thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 126 | కరీంనగర్ మంగళవారం, 15 జూలై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కులగణన ఉద్దేశం కేంద్రానికి లేదు

న్యూఢిల్లీ : కులగణనపై కాంగ్రెస్, బీజేపీ నడుమ మళ్లీ విమర్శల యుద్ధం మొదలైంది. జనాభా లెక్కల సేకరణకు కేంద్ర హోం శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావనే లేదని, అసలది జరిపే ఉద్దేశమే మోదీ ప్రభుత్వానికి లేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ ఆరోపించారు. రాజకీయ లబ్ధి పొందాలన్న లక్ష్యం నెరవేరకపోవడంతో ఆ పార్టీ దుష్ప్రచారాలకు దిగుతోందని బీజేపీ మండిపడింది. పైలట్ ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. కులగణనకు కేంద్రం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. 'ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కులగణనకు డిమాండ్ చేస్తోంది. మోదీ ప్రభుత్వం రాహుల్ ఒత్తిడికి తలొగ్గి జనగణనతోపాటే కులగణన చేపడతామని ప్రకటించింది. కానీ క్షేత్ర స్థాయిలో వాస్తవాలు వేరుగా ఉన్నాయి. జనాభా లెక్కల సేకరణకు రూ.10 వేల కోట్లు అవసరం.




హైదరాబాద్: రామాయణం, మహాభారతం మన జీవితాల్లో భాగమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో 'శ్రీమద్భాగవతం-పార్ట్1' చిత్రీకరణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ దీన్ని రూపొందిస్తోంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. "రామోజీ ఫిల్మ్‌సిటీలో శ్రీమద్భాగవతం చిత్రీకరణ రాష్ట్రానికి గర్వకారణం. రామోజీరావు ఫిల్మ్‌సిటీని అద్భుతంగా నిర్మించారు. నేను యూనివర్సల్ స్టూడియో చూడలేదు. రామోజీ ఫిల్మ్‌సిటీ.. దేశంలోనే ప్రత్యేకమైన స్టూడియో. ఇది తెలంగాణలో ఉందని చెప్పేందుకు గర్విస్తున్నా. శ్రీమద్భాగవతం సినిమా తీయాలన్న ఆలోచన వచ్చినందుకు మూవీ టీమ్‌ను అభినందిస్తున్నా. నలభయేళ్ల క్రితం రామాయణం సీరియల్ అందరికీ చేరువైంది. కొవిడ్ సమయంలో మళ్లీ ఆ సీరియన్‌ను టెలికాస్ట్ చేస్తే ప్రపంచ రికార్డు సృష్టించింది. 2035లోపు తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దాలని మేం సంకల్పించాం. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా ఉండేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. దీనికోసం 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసుకుంటున్నాం. ఇందులో సినీ రంగానికి ప్రత్యేక చాప్టర్ ఉంటుంది. నాడు రామానంద్ సాగర్ తీసిన రామాయణం సీరియల్ ఎంత పాపులర్ అయిందో.. 'శ్రీమద్భాగవతం పార్ట్-1' కూడా అంత హిట్ అవ్వాలని కోరుకుంటున్నా" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా రైతు పథకాలు అమలు చేస్తున్నాం: మంత్రి పొంగులేటి

ఖమ్మం: ఖమ్మంలోని పాలేరు జలాశయం నుంచి సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. సాగర్ ఆయకట్టు కింద 2.5 లక్షల ఎకరాలకు నీరు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 400 క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు. రాబోయే 5 రోజుల్లో పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరు విడుదల చేస్తామని చెప్పారు. కృష్ణా బేసిన్‌లో పంటలకు ఇబ్బంది లేకుండా నీరు అందిస్తామన్నారు. "ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా రైతు పథకాలు అమలు చేస్తున్నాం. రైతు భరోసా ద్వారా రైతులకు ఎకరాకు రూ.12 వేలు అందించాం. వారి ఖాతాల్లో 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు జమ చేశాం. సన్నధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రాబోయే రోజుల్లో మిగిలిన పంటలకు కూడా ఇస్తాం" అని పొంగులేటి తెలిపారు.



**ఆనాడు తప్పిదాలు చేసిందే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు: భట్టి..** కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే.. వ్యవసాయం, కరెంటు, ప్రాజెక్టులు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేదని విమర్శించారు. ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుంటే.. కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. ఆనాడు తప్పిదాలు చేసిందే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అని ఆరోపించారు. తప్పులు చేసిన భారత రాష్ట్ర సమితి నేతలు ఇప్పుడు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.




సికింద్రబాద్: సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి బోనాల ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన 'రంగం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడే భారం తనదని చెప్పారు.రాబోయే రోజుల్లో మహమ్మారి వెంటాడుతుందని, అగ్నిప్రమాదాలు కూడా సంభవిస్తాయని తెలిపారు. జాగ్రత్తగా ఉండాలని భక్తులను హెచ్చరించారు. ఈ ఏడాది వర్షాలు తప్పకుండా కురుస్తాయని, పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని తెలిపారు. "బాలబాలికలను మీరు విచ్చలవిడిగా వదిలేస్తున్నారు.. కానీ నేను కడుపులో పెట్టుకుని కాచుకుంటున్నాను. ఈసారి చాలా సంతోషంగా పూజలు చేశారు. మీ అందరినీ సంతోషంగా సమానంగా చూస్తాను. మీ అరికాలిలో ముల్లు నాలుకతో తీస్తాను. కాలం తీరితే ఎవరు ఏది అనుభవించాలో అది అనుభవిస్తారు, నేను అడ్డురాను" అని స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.




చౌటుప్పల్: తెలంగాణలో భాజపా ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు విజయ సంకల్పం తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పిలుపునిచ్చారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా చౌటుప్పల్‌కు వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. అనంతరం నిర్వహించిన సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్‌ను ఎందుకు ఎన్నుకున్నామని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. "భాజపా ప్రభుత్వం మాత్రమే తెలంగాణలో స్వర్ణయుగం తెస్తుంది. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో మాత్రమే తెలంగాణ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. గత భారాస ప్రభుత్వం అవినీతి మయమైంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల్ని ఇబ్బందులు పెడుతోంది. తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా భాజపా వైపు చూస్తున్నారు" అని రామచందర్‌రావు అన్నారు



చురకలు



# శరీరానికి రూపం... మనసుకు నూతన విశ్వాసం

## - జూలై 15 - నేషనల్ ప్లాస్టిక్ సర్జరీ డే




ప్లాస్టిక్ సర్జరీ అంటే కొంతమందికి కేవలం అందాన్ని మెరుగు పరచడానికే సంబంధించినదని భావన ఉంది. కాని వాస్తవానికి ఇది వ్యక్తిగత జీవితాలపై విప్లవాత్మక ప్రభావాన్ని చూపగల శాస్త్రశాఖ. జన్మతః లోపాలు, ప్రమాదాల వల్ల కలిగే శారీరక వైకల్యాలు, వ్యాధుల కారణంగా గాయ పడిన శరీర భాగాల పునర్నిర్మాణం వంటి అనేక జీవనోద్ధారక పరిణామాలకు ఇది మార్గదర్శకం. ఈ వైద్య విభాగంలోని సేవల ప్రాముఖ్యతను గుర్తించి, ప్రతి సంవత్సరం జూలై 15ను 'నేషనల్ ప్లాస్టిక్ సర్జరీ డే'గా జరుపు కుంటున్నారు. ఈ దినోత్సవాన్ని 2011లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్ సర్జన్స్ చొరవతో ప్రారంభించింది. బెంగళూరులో డాక్టర్ రాజేష్ కేజ్రీవాల్ నేతృత్వంలో జరిగిన తొలి కార్యక్రమం నుంచి ఈ దినోత్సవం నాటిగా దేశ వ్యాప్తంగా వైద్య స్థాయిలో గుర్తింపు పొందింది. నేటి పరిస్థితుల్లో ప్లాస్టిక్ సర్జరీ అందుబాటు లోకి వచ్చిన విధానం, నిపుణుల కృషి, వైద్య సాంకేతికతల పురోగతి...ఇవి ప్రజలలో విశ్వాసాన్ని పెంచే దిశగా నడుస్తున్నాయి. ప్లాస్టిక్ సర్జరీ అనే పదం వినగానే "ప్లాస్టిక్ పదార్థం"తో సంబంధం ఉందేమో అనిపించొచ్చు. కానీ ఈ పదం గ్రీకు మూలమైన "ప్లాస్టికోస్" నుండి ఉద్భవించింది, దీని అర్థం "ఆకృతి ఇవ్వగల శక్తి కలిగి ఉండే" అని. అందువల్ల ఇది శరీర భాగాలకు మళ్లీ రూపం ఇవ్వడం అనే అర్థంతో ప్రయోగం లోకి వచ్చింది. ప్లాస్టిక్ సర్జరీలో రెండు ప్రధాన మార్గాలున్నాయి పునర్నిర్మాణ శస్త్ర చికిత్స మరియు కాస్మెటిక్ శస్త్ర చికిత్స. పునర్నిర్మాణం అవసరమయ్యే సందర్భాలలో చీలిక పెదవి, కాలిన గాయాలు, క్యాన్సర్ చికిత్సల తర్వాత శరీర అవయవాల పునర్నిర్మాణం వంటి చికిత్సలు ఉండగా, కాస్మెటిక్ సర్జరీ రూపాన్ని మెరుగు పరచడానికి ఉపయోగ పడుతుంది. ఉదాహరణకు రైనోప్లాస్టీ (ముక్కు సర్జరీ), లిపోసక్షన్, ఫేస్‌లిఫ్ట్, బ్రెస్ట్ ఆగ్మెంటేషన్ వంటి చికిత్సలు వస్తాయి. భారత దేశంలో ప్లాస్టిక్ సర్జరీ చరిత్ర ఎంతో గొప్పది. సుమారు 2600 ఏళ్ల క్రితమే మహర్షి సుశ్రుతుడు రాసిన 'సుశ్రుత సంహిత'లో రైనోప్లాస్టీకి సంబంధించిన వివరణలు కనిపిస్తాయి. ముఖానికి మళ్లీ ఆకారం ఇచ్చే శస్త్రచికిత్సలు, స్కిన్ గ్రాఫ్టింగ్ వంటి విధానాలు అప్పుడే కనిపించాయి. ఈ శాస్త్రపు మూలాలను ఆధారంగా తీసుకుని ఆధునిక శస్త్రచికిత్సా విజ్ఞానం అభివృద్ధి చెందింది. అంతేకాక, ప్రపంచంలో ప్లాస్టిక్ సర్జరీ పునాది భారత దేశం నుంచే వేసినదన్న అభిప్రాయం కూడా ప్రబలంగా ఉంది. ఇప్పటి టెక్నాలజీ అభివృద్ధితో మైక్రో సర్జరీ, లేజర్ టెక్నిక్స్, మినిమల్ ఇన్వేసివ్ టెక్నాలజీ ద్వారా చికిత్సలు వేగంగా, తక్కువ అవాంతరాలతో పూర్తి అవుతున్నాయి. గణాంకాల ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 2 కోట్లకుపైగా ప్లాస్టిక్ సర్జరీలు జరుగు తున్నాయి. వాటిలో దాదాపు 10 శాతం భారత్ లోనే జరుగు తున్నాయన్నది గర్వకారణం. అత్యంత నైపుణ్యం కలిగిన భారత ప్లాస్టిక్ సర్జన్లు కేవలం దేశీయంగా కాకుండా అంతర్జాతీయంగా కూడా గుర్తింపు పొందుతున్నారు. నేషనల్ ప్లాస్టిక్ సర్జరీ డే సందర్భంగా దేశంలోని అనేక ఆసుపత్రులు, వైద్య సంస్థలు ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తాయి. ప్లాస్టిక్ సర్జరీ అవసరమైన వారికి ఉచితంగా సంప్రదింపులు, కొంతమంది అవసరమైన చికిత్సలు కూడా అందిస్తున్నారు. వైద్య విద్యార్థులకు వర్క్‌షాప్‌లు, లైవ్ డెమోలను నిర్వహించడం ద్వారా వారి లోతైన అవగాహన పెంపొందించడవే లక్ష్యంగా కార్యక్రమాలు సాగుతున్నాయి. ఈ దినోత్సవం యొక్క మరో ముఖ్య ఉద్దేశం ప్రజలలో ప్లాస్టిక్ సర్జరీపై ఉన్న అపోహలను తొలగించడమే. కొన్ని సందర్భాల్లో నకిలీ వైద్యుల చేత చికిత్సలు తీసుకోవడం వల్ల గాయాల కంటే ఎక్కువ నష్టం జరుగుతోంది. అందువల్ల నిపుణుల సేవలను గుర్తించి, అవసరమైన సందర్భాల్లో సరైన మార్గదర్శనం తీసుకోవడం అత్యవసరం. దీనికి సంబంధించిన ఖర్చులు, శస్త్ర చికిత్సల అవసరాలు, అందుబాటు, ప్రమాదాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత నేషనల్ ప్లాస్టిక్ సర్జరీ డే ద్వారా నెరవేరుతుంది. ప్లాస్టిక్ సర్జన్లు ఒక సామాజిక బాధ్యతను నిర్వహిస్తూ, రూపాన్ని మాత్రమే కాకుండా జీవితాన్ని మళ్లీ నిర్మించే అవకాశాన్ని అందిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. చర్మం కాలిన చిన్నారి ముఖానికి తిరిగి స్వరూపం ఇవ్వడం, జన్మతః లోపంతో పుట్టిన శిశువుకి సవ్యమైన రూపాన్ని ఇవ్వడం, ప్రమాదంలో గాయపడి ఇంట్లో నిర్బంధితుడైన వ్యక్తికి మళ్లీ సమాజంలో విలీనమయ్యే ధైర్యాన్ని కలిగించడయిది వీరి పని. అందువల్ల ఈ వైద్య విభాగం ఓ వ్యక్తిగత అవసరం కాదుబీ ఇది ఒక సామాజిక ఆశాజ్యోతి. ఈ దినోత్సవం ఒక్క వేడుక మాత్రమే కాదు. ఇది ఒక అవగాహన వేదిక. ఇది ఒక నివాళి. ఇది ఒక సమాజపు అభివృద్ధిలో వైద్యశాస్త్రం పోషించే పాత్రను గుర్తించే సంఘటన. ప్లాస్టిక్ సర్జన్లు చేస్తున్న సేవలు మనం గుర్తించి, మరింత ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేయడం మన సమాజపు బాధ్యత. శరీరానికి రూపం ఇవ్వడం వీరి పనైతే... మనం వారికి గౌరవం ఇవ్వడం మన బాధ్యత.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# నైపుణ్యాలే సమకాలీన యువతకి విజయ బాటలు

## నైపుణ్యమే శక్తి... యువతే దేశ భవిష్యత్తుకు మౌలిక శక్తి! - జూలై 15...ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం




ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూలై 15న "ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం" ఘనంగా నిర్వహించ బడుతోంది. ఇది కేవలం ఒక దినోత్సవం మాత్రమే కాదు, నైపుణ్య శిక్షణపై అంతర్జాతీయ దృష్టిని కేంద్రీకరించే ముఖ్యమైన మౌలిక ఆవశ్యకతను గుర్తుచేసే రోజు. యువతకు తగిన నైపుణ్యాలు అందించకుండా దేశ అభివృద్ధి సాధ్య పడదన్న సత్యాన్ని ఈ సందర్భంగా మరొసారి గుర్తు చేస్తారు. ఈ దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి 2014లో అధికారికంగా ప్రకటించింది. శ్రీలంక ప్రభుత్వం సూచించిన తీర్మానానికి 50కి పైగా దేశాలు మద్దతివ్వగా, 2015లో మొదటి సారిగా జూలై 15న ఈ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరిపారు. దీని ప్రధాన లక్ష్యం ు యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించి వారిని ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకునేలా చేయడం. ప్రపంచ జనాభాలో యువత (15%-%24 వయస్సు) సుమారు 1.2 బిలియన్లుగా ఉండగా, వారిలో లక్షలాది మంది నిరుద్యోగులు. యునెస్కో నివేదికల ప్రకారం, అనేక దేశాల్లో విద్యా వ్యవస్థలు మార్కెట్ అవసరాలకు తగిన నైపుణ్యాలను అందించడంలో విఫలమవుతున్నాయి. దీనివల్ల యువతలో నిరాశ, ఉపాధిలేమి, సామాజిక అసమానతలు పెరుగు తున్నాయి. ప్రస్తుత వేగంగా మారుతున్న ప్రపంచంలో ు డిజిటల్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు, గ్రీన్ ఎనర్జీ, ఫిన్‌టెక్, హెల్త్‌కేర్ వంటి రంగాల్లో నైపుణ్య అవసరం పెరుగుతోంది. యువత ఈ అవసరాలను తీర్చ గలిగితేనే దేశాలు ప్రపంచ స్పర్థలో నిలదొక్కు కోగలవు. ఈ నేపథ్యంలో నైపుణ్య శిక్షణ విద్యతో పాటు సమన్వయంగా సాగాల్సిన అంశంగా మారింది. భారత దేశం యువ శక్తితో నిండిన దేశం. అయితే 70 శాతానికి పైగా యువతకు మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలు లేవన్నది ఆందోళనకరాంశం. దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం "స్కిల్ ఇండియా మిషన్" ను 2015లో ప్రారంభించింది. "ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన" (%ూవీఖవ్%) ద్వారా కోటి మందికి పైగా యువతకు వృత్తి శిక్షణలు అందించ బడ్డాయి. రంగాల వారీగా ు రిటైల్, ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం, ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ సర్వీసులు మొదలైన వాటిలో శిక్షణా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. కోవిడ్-19 మహమ్మారి అనంతరం నైపుణ్య శిక్షణలో డిజిటల్ మాధ్యమాలు కీలక పాత్ర పోషించాయి. ఆన్‌లైన్ కోర్సులు, వెబినార్లు, వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లు యువతకు మరింత అవకాశాలను అందించాయి. ఈ మార్పు శాశ్వతంగానే కొనసాగు తుందనేది నిపుణుల అభిప్రాయం. యువతకు నైపుణ్యాలు అందించడంలో కేవలం సాంకేతిక అంశాలు కాక, భావ ప్రపంచాన్ని తీర్చిదిద్దే జీవన నైపుణ్యాలు ు కమ్యూనికేషన్, సమస్య పరిష్కారం, నాయకత్వం, సామూహిక సమన్వయం వంటి లక్షణాలపై కూడా దృష్టి పెట్టాలి. ఇదే యువతను కేవలం ఉద్యోగార్థులుగా కాక, ఉద్యోగ అవకాశాలను సృష్టించగల శక్తిగా తయారు చేస్తుంది. ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం కేవలం ఒక రోజు ఉత్సవం కాదు. ఇది ఒక ఉద్యమం ు దేశభవిష్యత్తు నిర్మాణానికి, సమాజ సమగ్ర అభివృద్ధికి, యువత శక్తిని సద్వినియోగం చేసుకోవడానికి తీసుకోవాల్సిన సంకల్పానికి సంకేతం. యువతకు సరైన దిశలో మార్గనిర్దేశనం చేస్తే ు వారు సామాజిక, ఆర్థిక రంగాల్లో అద్భుతంగా రాణించ గలుగుతారు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# సోషల్ మీడియా గివింగ్ డే

## - డిజిటల్ దాతృత్వానికి మార్గదర్శక దినోత్సవం - జూలై 15...సోషల్ మీడియా గివింగ్ డే




ప్రపంచం వేగంగా డిజిటలైజేషన్ వైపు పరుగులు తీస్తున్న సమకాలీన సమాజంలో, మానవీయ విలువలు, సహానుభూతి, దాతృత్వం వంటి భావనలు కొత్త రూపంలో పునర్జన్మ పొందుతున్నాయి. సోషల్ మీడియా వేదికలు ు అనేక మందికి కేవలం సమాచార మార్పిడికి, వినోదానికి సాధనంగా కనిపించినా ు వాటిని సానుకూల మార్పుల కోసం వినియోగించాలన్న ఆలోచన కలిగిన వారికే "సోషల్ మీడియా గివింగ్ డే" అనే దినోత్సవం నూతన ఆశావహ మార్గాన్ని చూపుతోంది. ప్రతి సంవత్సరం జూలై 15న జరుపుకునే ఈ దినోత్సవం, డిజిటల్ యుగంలో దాతృత్వానికి కొత్త నిర్వచనం అందిస్తుంది. 2013లో అమెరికాలో స్థాపితమైన %+ఱజజవతీ.ఎశీఎ% అనే సంస్థ ఈ దినోత్సవానికి బీజం వేసింది. సోషల్ మీడియా వేదికల ద్వారా స్వచ్ఛంద సంస్థలకు నిధులు సమీకరించడం, అవగాహన పెంచడం, ప్రేరణాత్మక కథనాలను పంచుకోవడం వంటి అంశాలను ప్రోత్సహించడమే దీని ప్రధాన ఉద్దేశ్యం. %ఖీఱఎవఎశీశీ౯, ×అర్ఖస్త్రతీఱఎ, ఔ (ుఙఱ్‌వతీ), ూఱఅవఎస×అ% వంటి వేదికల ప్రాచుర్యంతో, ఈ దినోత్సవం అంతర్జాతీయ స్థాయిలో విశేష ప్రాధాన్యం సంపాదించుకుంది. ప్రపంచ వ్యాప్తంగా దాతృత్వ విరాళాల్లో సుమారు 13 శాతం వరకూ సోషల్ మీడియా ద్వారా సమకూరుతోంది. 2022లో అమెరికాలోనే దాదాపు 2.8 బిలియన్ డాలర్లు సోషల్ మీడియా వేదికల ద్వారా నాన్‌ప్రాఫిట్ సంస్థలకు విరాళాలుగా అందాయి. ఒక్కో హ్యాష్ ట్యాగ్ (చ%ూశీ-ఎఱఖశ్రీ వీవసఱఖ. +ఱజఱఅస్త్ర ఖుఎ%) వందలాది జీవితాలను ప్రభావితం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ సందర్భంగా పలువురు సామాన్యులు, సెలబ్రిటీలు, విద్యార్థులు, స్వచ్ఛంద కార్యకర్తలు తమ తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారా సేవా చర్యలకు ప్రచారం కల్పిస్తున్నారు. ఇది కేవలం డిజిటల్ ప్రచారం మాత్రమే కాదు ు అనేకమంది ప్రజలకు జీవన మార్గాన్ని చూపిన శక్తివంతమైన ఉద్యమం. ఈ దినోత్సవం ప్రధానంగా చూపే అంశాలు: అవగాహన సృష్టి %-% స్వచ్ఛంద సంస్థలు తమ లక్ష్యాలు, కార్యక్రమాలను ప్రపంచానికి చేరవేసే వీలును ఈ వేదికలు కల్పిస్తున్నాయి. నిధుల సమీకరణ %-% సాంప్రదాయిక మార్గాలతో పోల్చితే తక్కువ సమయంలో పెద్ద విరాళాలను సమీకరించే శక్తి ఈ వేదికలదే. పరస్పర అనుసంధానం %-% చిన్న సంస్థలు, వ్యక్తులు ప్రపంచ వ్యాప్తంగా మద్దతు దారులను సంప్రదించ గలుగు తున్నాయి. ప్రేరణాత్మక కథనాల ద్వారా సానుభూతి ఉద్రూతలూగించడం %-% ఒక చిన్న సహాయ చర్య అనేక మందికి మార్గదర్శక మవుతోంది. సామాజిక చైతన్యం ప్రేరేపించడం %-% దాతృత్వానికి అవయవదానం, విద్యా సహాయం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై విస్తృత చర్చకు వీలు కలుగుతోంది. ఈ సందర్భంగా మీరు చేయగల కొన్ని సాధారణ ప్రభావవంతమైన చర్యల క్రమంలో... ఒక స్వచ్ఛంద సంస్థ గురించి మీ ఖాతాలో తెలియ జేయడం. వారి కార్యక్రమాలను షేర్ చేయడం, ఫండ్రైజింగ్ ప్రచారాలకు మద్దతు ఇవ్వడం. మీ స్వంత అనుభవాలను లేదా మీరు చూసిన సానుకూల మార్పులను కథనంగా పంచుకోవడం. హ్యాష్‌ట్యాగ్‌లు ఉపయోగించడం ద్వారా విస్తృత ప్రజల దృష్టికి చేర్చడం. మీ దాతృత్వ కృషి ద్వారా మిగిలిన వారికి ప్రేరణ కలిగించడం. ఈ దినోత్సవం డిజిటల్ మాధ్యమాల్లో ఉన్న మానవీయతను వెలికితీసే అరుదైన అవకాశం. ఒక చిన్న సహాయం %-% పుస్తకాలు పంపడం, రక్తదానం చేయడం, ఒక మిత్రునికి ధైర్య వాక్యం చెప్పడం, స్వచ్ఛంద సంస్థలో వాలంటీర్‌గా సేవ చేయడం %-% ఇవన్నీ సోషల్ మీడియా ద్వారా మరింత ప్రజల దృష్టికి తీసుకు రావచ్చు. భారత దేశంలో కూడా ఈ ఉద్యమం పటిష్టంగా ఎదుగుతోంది. రక్తదాన శిబిరాలు, పుస్తకాల విరాళాలు, విద్యా మద్దతు ఉద్యమాలు, ఆహార పంపిణీ వంటి కార్యక్రమాలు సోషల్ మీడియా వేదికల ద్వారా పుంజు కుంటున్నాయి. విద్యార్థి సంఘాలు, యువతీ యువకులు, స్వచ్ఛంద సంస్థలు ు అందరూ ఈరోజున తమ కృషిని ఇతరులకు తెలియ జేస్తున్నారు. ఇది వెచ్చని మానవత్వానికి వేదికగా మారుతోంది. సోషల్ మీడియా ఇప్పుడు కేవలం ట్రెండ్‌లు, రీల్స్, చర్చలు మాత్రమే కాదు ు దాతృత్వానికి, సేవా భావానికి బలమైన వేదిక. ఒక్క క్లిక్ తో మార్పు సాధ్యం అయ్యే వాస్తవం ఈ దినోత్సవం ద్వారా స్పష్టమవుతోంది. ఈ సందర్భంగా మనమంతా మన సోషల్ మీడియా వేదికలపై ఓ ప్రశ్న వేసుకోవాలి %-% "నేను నా డిజిటల్ ప్రాంగణాన్ని సమాజానికి ఉపయోగపడేలా ఎలా మారుస్తున్నాను?" మన చిన్న చర్యలు... ఒక చిన్న పోస్ట్, ఒక సహాయక పిలుపు, ఒక మద్దతు %-% వందలాది మందిలో మార్పును తీసుకు రాగలవు. సోషల్ మీడియా గివింగ్ డే మానవీయతను పంచుకునేందుకు టెక్నాలజీ చాలా గొప్ప సాధనం. ప్రతి ఒక్కరం మానవీయ విలువలకు గొంతు కల్పించాలన్న సంకల్పంతో, ఈ దినోత్సవాన్ని ఒక ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉంది. నెట్‌వర్క్ కాదు %-% నేతృత్వ వేదికగా సోషల్ మీడియా మారాలి.

# వెండితెరపై చిరంజీవిగా వెలిగిన కళా మూర్తి... బి. సరోజాదేవి

## దక్షిణ భారతీయ చిత్రసీమలో చిరంజీవిగా నిలిచిన అభినయ సరస్వతి...బి. సరోజాదేవి



భారతీయ సినిమా చరిత్రలో మహిళా నటీ నటులకు గౌరవస్థానం అందించిన కొద్ది మందిలో బి. సరోజాదేవి పేరు ప్రశస్తంగా నిలుస్తుంది. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ సినిమాల్లో విశిష్ట పాత్రలు పోషించి నాలుగు దశాబ్దాల పాటు అగ్ర నటిగా వెలిగిన ఈ నటి మణి సోమవారం తెల్లవారు జామున బెంగళూరులో తుదిశ్వాస విడిచారు. ఆమె మరణం సినీ లోకానికి తీరని లోటు, అభినయ కళకు వేదనాత్మక విరామం. సొగసైన రూపం, సంయమనతో కూడిన నటన, సుస్థిర వ్యక్తిత్వం ఆమెకు విశేష గౌరవాన్ని, అపారమైన అభిమానాన్ని తెచ్చిపెట్టాయి. 1938 జనవరి 7న కర్ణాటక రాష్ట్రంలోని కుణిగల్ వద్ద జన్మించిన బంగారమ్మ సరోజాదేవి, బాల్యంలోనే కళారంగం వైపు ఆకర్షితమయ్యారు. సంగీత పరిచయం, నాట్య నైపుణ్యం, వచన శక్తి ఆమెను సినీరంగానికి అద్భుతంగా అనుకూలంగా తీర్చిదిద్దాయి. చిన్నవయస్సులోనే వెండితెరపై అడుగుపెట్టి, 13వ ఏట మొదటి చిత్రం ద్వారా ప్రయాణం ఆరంభించి, నిరంతరం అభివృద్ధి చెందుతూ దేశవ్యాప్తంగా అగ్రనటిగా వెలిగారు. తెలుగు చిత్రాల్లో ఆమె పోషించిన పాత్రలు సాంప్రదాయ స్త్రీల శక్తి శాలిత్వాన్ని, త్యాగ వృత్తిని, ప్రేమను ప్రతిబింబించేవిగా ఉండేవి. "పాండురంగ మహత్యం" చిత్రంలో ఆమె పోషించిన రుక్మిణీ పాత్రలో భక్తి, భార్యా ధర్మం, మానసిక స్థైర్యం ఆమె అభినయాన్ని ఉద్దీపనగా తీర్చిదిద్దాయి. "శ్రీకృష్ణార్జున యుద్ధం"లో సత్యభామ పాత్రలో ఉన్న గర్వం, అహంకారం, ప్రేమ, ఆత్మాభిమానాన్ని ఆమె అద్భుతంగా ఆవిష్కరించారు. "వాసంతి", "పూజా. ఫలము", "భార్యా భర్తలు", "సభాష్ మీనా" వంటి చిత్రాల్లో ఆమె పాత్రలు మధ్యతరగతి మహిళల భావోద్వేగాల మేళవింపుగా నిలిచాయి. భూకైలాస్, సీతారామ కళ్యాణం, జగదేక వీరుని కథ, ఆత్మబలం, దాగుడు మూతలు, భాగ్య చక్రం, మాయని మమత, పండంటి కాపురం, శ్రీ రామాంజనేయ యుద్ధం, దాన వీర శూరకర్ణ లాంటి ఎన్నో సూపర్ హిట్స్ లో భాగం పంచుకున్నారు. కన్నడలో ఆమె రాజ్‌కుమార్‌తో జతగా చేసిన "భక్త కనకదాస", "సంతాన", "నవశక్తి నందన", "సత్యహరిశ్చంద్ర", "బంగారద మనె" వంటి చిత్రాల్లో ఆమె ప్రదర్శించిన గంభీరత, సాంప్రదాయిక విలువల్ని నిలబెట్టే నటనా శైలి విశేషంగా ప్రశంసలు పొందింది. "భక్త ప్రహ్లాద" వంటి పౌరాణిక చిత్రాల్లో ఆమె శాంత భావన కలిగిన, తల్లి పాత్రలను అత్యద్భుతంగా పోషించారు. ఆమె ముఖ కవళికలు, కళ్లతో చెప్పే భావాలు, సున్నితమైన అనుభూతులను సులభంగా ఆవిష్కరించే శైలి కన్నడ ప్రేక్షకులను ఉప్పొంగేలా చేసింది. తమిళ చిత్రాల్లో ఆమె శివాజీ గణేశన్, ఎంజీఆర్ వంటి మహానటులతో కలిసి "తిలకం", "కల్పకమాలై", "పార్థిబన్ కనవు", "పెరియతలైవన్", "వాలిబన్", "అందమైన పెళ్లం", "తంగవీణై" వంటి సినిమాల్లో ప్రధాన పాత్రల్లో నటించి, కథానాయిక పాత్రలకు ఉన్న పరిమితులను అధిగమించారు. పార్థిబన్ కనవులో ఆమె పోషించిన చారిత్రక పాత్ర గంభీరంగా ఉండటమే కాక, విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. వాలిబన్ వంటి కమర్షియల్ చిత్రాల్లోనూ ఆమె గ్లామర్‌తో పాటు విలువైన భావాలను ప్రసారం చేయగల నైపుణ్యం కలిగి ఉన్నారనిపించారు. హిందీ నటులైన షమ్మీ కపూర్, మనోజ్ కుమార్, బిశ్వజీత్, జైరాజ్, రాందయాల్ శర్మ, శరత్ సక్సేనా వంటి వారితో కలిసి నటించారు. 1961లో వచ్చిన "పహలే మౌసమ్" చిత్రంతో ఆమె హిందీ సినీ రంగంలోకి అడుగుపెట్టారు. షమ్మీ కపూర్ నటించిన ఈ చిత్రంలో ఆమె పాత్ర సున్నితమైన భావావేశాలతో ఆకట్టుకుంది. అదే సంవత్సరంలో విడుదలైన "బహు రూపియా" అనే చిత్రంలో ఆమె మనోజ్ కుమార్‌తో కలిసి నటించి, మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో గంభీరమైన పాత్రను సమర్థంగా పోషించారు. 1963లో విడుదలైన "బేగునాహ్" చిత్రం ఆమె హిందీ సినీ ప్రస్థానంలో ఒక మైలురాయి. ఇందులో బిశ్వజీత్ కథానాయకుడిగా నటించగా, మదన్ మోహన్ సంగీత దర్శకత్వంలో రూపొందిన పాటలతో ఆమె హావభావాలు అద్భుతంగా మిళితమయ్యాయి. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన "భారత్ మాతా" (1965) చిత్రంలో ఆమె త్యాగమూర్తిగా, దేశాన్ని మించిన ప్రేమను ప్రదర్శించే భార్య పాత్రను పోషించారు. ఆమె హావభావాలు ఈ చిత్రంలో అత్యంత భావోద్వేగంతో నిండి ఉండేవి. 1967లో విడుదలైన "స్వర్ణ సుందరి" చిత్రంలో జైరాజ్‌తో కలిసి నటించిన ఆమె, సంగీతం, నాట్యం, శృంగారాభినయం కలగలిపిన పాత్రలో తన నటనా ప్రతిభను సమగ్రంగా ఆవిష్కరించారు. 1969లో వచ్చిన "పరిణయ్" చిత్రంలో శరత్ సక్సేనా సరసన విద్యావంతురాలైన భార్య పాత్రను పోషించిన ఆమె నటన సామాజిక విలువల పట్ల స్పష్టమైన వ్యక్తీకరణగా నిలిచింది. భాషాపరమైన పరిమితుల కారణంగా ఆమెకు ఉత్తర భారతంలో సంపూర్ణ స్థాయి గుర్తింపు రాలేక పోయింది. అయినప్పటికీ, హిందీలోనూ ఆమె నటనకు ప్రశంసలే లభించాయి. నిష్కళంకమైన భాషాభావ ప్రకటనతోపాటు అభినయ నైపుణ్యాన్ని జోడించి తనదైన ముద్రవేసారు. ఆమె నటనా ప్రస్థానం ఆమెకు అనేక గౌరవాలను తెచ్చిపెట్టింది. పద్మశ్రీ (1969), పద్మభూషణ్ (1992) వంటి దేశీయ గౌరవాలతో పాటు, తమిళనాడు ప్రభుత్వం నుంచి కళైమామణి, కర్ణాటక ప్రభుత్వం నుంచి రాజ్యోత్సవ పురస్కారం, కర్ణాటక రత్న, దాదాసాహెబ్ ఫాల్కే అకాడమీ అవార్డు వంటి అనేక బహుమతులు ఆమెను గౌరవించాయి. కేంద్ర ప్రభుత్వ జాతీయ చలనచిత్ర పురస్కారాల జ్యూరీ సభ్యురాలిగా ఆమె సేవలందించారు. ఆమె వ్యక్తిగత జీవితం కూడా సంతోషకరంగా సాగింది. డాక్టర్ హరినాథ్‌ను వివాహం చేసుకున్న ఆమె, కుటుంబాన్ని పరిరక్షించడం లోను, సినీ జీవితాన్ని కొనసాగించడం లోను సుస్థిరంగా ముందుకు సాగారు. భర్త మరణానంతరం ఆమె సినీరంగానికి కొంత దూరంగా ఉన్నా, సామాజిక సేవలో విశేషంగా పాల్గొన్నారు. ఆమె స్థాపించిన సరోజా దేవి ఫౌండేషన్ ద్వారా అనాథల అభ్యున్నతికి పాటుపడిన సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమైనవి. ఆమె నటనలో ఉన్న సహజత్వం, భావ వ్యక్తీకరణలో ఉండే నిగూఢత, పాత్రలతో లయబద్ధత ఆమెను శాశ్వత నటి చేసి ప్రేక్షకుల గుండెల్లో నిలిపాయి. బి. సరోజాదేవి నటించిన ప్రతి పాత్ర నేటికీ సమకాలీన విలువలు కలిగిన ఉదాహరణగా నిలుస్తోంది. ఆమె నటనా శైలికి రూపం గల కావ్యం అనిపించేది %-% అద్భుతమైన సౌందర్యంతో పాటు లోతైన భావజాలం కలబోసిన కళామూర్తిగా ఆమె వెలిగారు. బి. సరోజాదేవి మరణంతో దక్షిణ భారతీయ సినిమా రంగం ఒక వెలుగు కొల్పోయింది. కానీ ఆమె నటించిన వందలాది చిత్రాలు, అందులో ఆమె పోషించిన పాత్రలు, ఆమె పలికిన సంభాషణలు, ఆమె చూపిన హావభావాలు %-% ఇవన్నీ ఈ తరం నుంచీ రాబోయే తరాల వరకు కళా. మీమాంసకులకూ, అభిమానులకూ స్ఫూర్తిగా నిలవ నున్నాయి. ఆమె జీవితం, కళా విశిష్టత, విలువలకు నిబంధితమైన వ్యక్తిత్వం మనమందరికీ దారి దీపంగా నిలుస్తుంది. బి. సరోజాదేవికి సద్గతులు కలగాలని హృదయ పూర్వకంగా ప్రార్థిస్తూ... **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 126 | కరీంనగర్ మంగళవారం, 15 జూలై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కులగణన ఉద్దేశం కేంద్రానికి లేదు

న్యూఢిల్లీ : కులగణనపై కాంగ్రెస్, బీజేపీ నడుమ మళ్లీ విమర్శల యుద్ధం మొదలైంది. జనాభా లెక్కల సేకరణకు కేంద్ర హోం శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావనే లేదని, అసలది జరిపే ఉద్దేశమే మోదీ ప్రభుత్వానికి లేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ ఆరోపించారు. రాజకీయ లబ్ధి పొందాలన్న లక్ష్యం నెరవేరకపోవడంతో ఆ పార్టీ దుష్ప్రచారాలకు దిగుతోందని బీజేపీ మండిపడింది. పైలట్ ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. కులగణనకు కేంద్రం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. 'ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కులగణనకు డిమాండ్ చేస్తోంది. మోదీ ప్రభుత్వం రాహుల్ ఒత్తిడికి తలొగ్గి జనగణనతోపాటే కులగణన చేపడతామని ప్రకటించింది. కానీ క్షేత్ర స్థాయిలో వాస్తవాలు వేరుగా ఉన్నాయి. జనాభా లెక్కల సేకరణకు రూ.10 వేల కోట్లు అవసరం.

# ఓర్వలేకే తమ ప్రభుత్వంపై నిందలు

## దొర గ్లాసులో సోడా కలపడం తప్ప నీకేమి తెలుసు

### మాజీ మంత్రి జగదీష్ రెడ్డిపై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్




నల్గొండ, జులై 14: బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఏ ఒక్కరికీ రేషన్ కార్డు ఇవ్వలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. పేదవాడికి సన్న బియ్యం ఇచ్చి.. గుక్కెడు ముద్ద పెట్టాలని ఆలోచన సైతం గత ప్రభుత్వ పెద్దలు చేయలేదని మండిపడ్డారు. సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రూ.34.20 కోట్ల విలువైన పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో రేషన్ షాపులు తెరవలేదని.. బెల్ట్ షాపులు తెరిచారంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తుంటే.. ఓర్వలేక తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయంటూ మండిపడ్డారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేస్తున్నామని.. బోనస్ సైతం ఇస్తున్నామని చెప్పారు. రేషన్ కార్డు అంటే పేదవారి ఆత్మగౌరవం.. గుర్తింపు అని ఈ సందర్భంగా ఆయన అభివర్ణించారు. పేదల ఆకలి తీర్చే ఆయుధమే రేషన్ కార్డు అని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల వల్లే నేడు నల్గొండ జిల్లాకు నీళ్లు వస్తున్నాయని గుర్తు చేశారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పామని.. ఈ హామీని తమ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. అయితే తమ ప్రభుత్వం రైతు భరోసా ఎగ్గొట్టిందంటూ దుష్ప్రచారం చేశారని ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతులకు రైతు భరోసా నగదు అందించామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన 18 నెలల కాలంలోనే రూ. 6,500 కోట్లు ఖర్చు అయిందని వివరించారు. తమ ప్రభుత్వం కొలువు తీరి రెండేళ్లు పూర్తయ్యే సరికి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం.. ఆయన హయాంలోనే కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. కూలేశ్వరం ప్రాజెక్టు దగ్గరే వారిని ఉరి తీసినా తప్పు లేదన్నారు. ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా? అంటూ బీఆర్ఎస్ నేతలకు ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు.

**మాజీ మంత్రి జగదీష్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్...** మూడు అడుగులున్న స్థానిక నేత ఎగిరెగిరి పడుతున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లు అవకాశం ఇచ్చినా తుంగతుర్తికి నీళ్లు ఎందుకు తేలేదంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని సీఎం సూటిగా ప్రశ్నించారు. తుంగతుర్తికి నీరు తేవడమంటే.. గ్లాస్‌లో సోడా పోసినట్లు కాదంటూ బీఆర్ఎస్ నేతకు ఈ సందర్భంగా చురకలంటించారు. దొర ముందు చేతులు కట్టుకుని గ్లాస్‌లో సోడా పోయడమే నీకు తెలుసంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిపై మండిపడ్డారు. సొంత మండలానికి ఎమ్మార్వో, ఎంపీడీవో ఆఫీస్‌లే కాదు.. పోలీస్ స్టేషన్ సైతం తెచ్చుకోలేని ఘనత బీఆర్ఎస్ నేతలదంటూ వ్యంగ్యంగా అన్నారు. పోరాట యోధులను అందించిన గడ్డ నల్గొండ అని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. నాడు గంజికి లేని మూడు అడుగుల నాయకుడు.. నేడు బెంజి కార్లలో తిరుగుతున్నారంటూ జగదీశ్వర్ రెడ్డిపై వ్యంగ్య బాణాన్ని సీఎం రేవంత్ రెడ్డి సంధించారు. తెలంగాణలో కొత్తగా 3.58 లక్షల రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కొత్త రేషన్ కార్డుల ద్వారా 11.3 లక్షల మందికి లబ్ధి చేకూరతుందన్నారు. తెలంగాణలో మొత్తం 95. 56 లక్షల మంది రేషన్ కార్డులు అందుకున్నారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.




హైదరాబాద్, జులై 14: తెలంగాణ హైకోర్టు కొత్త సీజేగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు కొలీజియం సిఫార్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. కాగా, ఇంతకు ముందు త్రిపుర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ అపరేష్ కుమార్ పనిచేశారు.

ఇక ప్రస్తుత తెలంగాణ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా ఉన్న సుజయ్ పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలిజియం సిఫార్సు చేసింది. ఇదిలా ఉండగా, అపరేష్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) 1965, జూలై 7న జన్మించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. అనంతరం 1990 నుంచి 2000 వరకూ ఉత్తర్ ప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఆ తర్వాత 2001లో జారండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012, జనవరి 24న జారండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 ఏప్రిల్ నుంచి జారండ్ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా అపరేష్ కుమార్ నియమితులయ్యారు. ఇక 2022 నుంచి 2023 వరకూ జార?ండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. 2023, ఏప్రిల్ 17న త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అపరేష్ కుమార్ సింగ్ పదోన్నతి సాధించారు. కాగా, తాజాగా తెలంగాణ హైకోర్టు సీజేగా నియమితులయ్యారు.




దిల్లీ: మూడు రాష్ట్రాలకు నూతన గవర్నర్లను రాష్ట్రపతి ద్రౌపదీముర్ము నియమించారు. గోవా గవర్నర్‌గా తెదేపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు నియమితులయ్యారు. హరియాణా గవర్నర్‌గా ప్రొఫెసర్ ఆషిమ్‌కుమార్ ఘోష్, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తాను నియమించారు. ఈ మేరకు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. అశోక్ గజపతిరాజు తెలుగు రాష్ట్రాల్లోని సీనియర్ రాజకీయ నేతల్లో ఒకరు. 1951 జూన్ 16న జన్మించిన ఆయన.. ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలుపొందారు. 1978లో తొలిసారి జనతా పార్టీ తరఫున ఎమ్మెల్యేగా విజయం సాధించిన అశోక్.. ఆ తర్వాత తెదేపాలో చేరారు. ఆ పార్టీ నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా.. ఒకసారి ఎంపీగా విజయం సాధించారు. 1983, 1985, 1989, 1994, 1999, 2009లో తెదేపా తరఫున గెలిచారు. 2014లో అదే పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ చేసి జయకేతనం ఎగురవేశారు. 2014లో కేంద్ర ప్రభుత్వంలో పౌరవిమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రివర్గాల్లో అశోక్‌గజపతిరాజు పలు కీలక శాఖల బాధ్యతలు నిర్వర్తించారు. ఎన్టీఆర్ హయాంలో ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల మంత్రిగా, చంద్రబాబు హయాంలో ఆర్థిక, శాసనసభ వ్యవహారాలు, రెవెన్యూ శాఖల మంత్రిగా పనిచేశారు. చాలా కాలంగా తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఆయన కొనసాగుతున్నారు.

2024 ఎన్నికల్లో అశోక్‌గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు విజయనగరం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.




## తిరుమలలో సత్ఫలితాలిస్తున్న కూటమి ప్రభుత్వ ప్రక్షాళన

ఏపీ కూటమి ప్రభుత్వం తిరుమలలో చేపట్టిన ప్రక్షాళన సత్ఫలితాలనిస్తోంది. వైకాపా హయాంలో శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా లడ్డూ, అన్నప్రసాదంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమల నుంచే ప్రక్షాళన ప్రారంభించింది. లడ్డూతో పాటు అన్నప్రసాదంలో వినియోగించే సరుకులు, బియ్యం కొనుగోలులో పారదర్శకతను పెంచింది. అన్ని స్థాయిల్లో నాణ్యతను పరిశీలించాకే ప్రసాదం తయారీకి వినియోగించేలా చర్యలు చేపట్టింది.




# 'బనకచర్ల' వివాదం ఓ కొలిక్కి!

## న్యూఢిల్లీలో భేటీ కానున్న తెలుగు రాష్ట్రాలు !

అమరావతి, జులై 14: బనకచర్ల ప్రాజెక్టుపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఏ నిర్ణయానికి వచ్చే అవ కాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు – తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దేశ రాజధాని ఢిల్లీలో భేటీ అవుతారనే వార్తలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం న్యూఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. మంగళవారం ఉదయం సీఎం చంద్రబాబు నాయుడు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12.00 గంటలకు ఆయన న్యూఢిల్లీకి చేరుకుంటారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి అమిత్ షా, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవి, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వేర్వేరుగా సమావేశం కానున్నారు. అలాగే నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వికే సారస్వత్, ఢిల్లీ మెట్రో ఎండీతో సైతం సీఎం చంద్రబాబు భేటీ అవనున్నారు. ఇక ప్రధాని సంగ్రహాలయలో మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నర్సింహారావు జీవితంపై సీఎం చంద్రబాబు నాయుడు ప్రసంగించనున్నారు. అలాగే భారత పరిశ్రమ సమాఖ్య– సీఐఐ స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు పాల్గొనున్నారు.

**న్యూఢిల్లీలో సీఎం చంద్రబాబు షెడ్యూల్ ఇలా..** జులై 15వ తేదీ మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల మధ్య కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో ఆయన నివాసంలో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు. మధ్యాహ్నం 2. 30 గంటలకు సీఎం చంద్రబాబుతో ఆయన అధికారిక నివాసంలో నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 3.00 గంటలకు సీఎం చంద్రబాబును ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ఢిల్లీ మెట్రో ఎండీ కలవనున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ప్రధాని సంగ్రహాలయను సీఎం చంద్రబాబు సందర్శించనున్నారు. అనంతరం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు సంస్మరణ సభలో 'పీవీ జీవితం, వారసత్వం'పై ఆయన కీలక ప్రసంగం చేయనున్నారు. సాయంత్రం 7.00 గంటలకు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు. బుధవరం అంటే.. జులై 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం భేటీ కానున్నారు. అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆయన సమావేశం కానున్నారు. రాత్రి 7 గంటలకు సీఐఐ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులు, వాటికి అవసరమైన నిధులు, పోలవరం – బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా పలు అంశాలపై కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించనున్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారంపై టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో చేపట్టాల్సిన ప్రాజక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల ఆదాయ పెంపుదల తదితర అంశాలతో పాటు.. దేశంలో అధిక వృద్ధి రేటు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ టాస్క్ ఫోర్స్ అధ్యయనం చేసిన విషయం విదితమే. సీఐఐ నిర్వహిస్తున్న కార్యక్రమంలో సీఎం చంద్రబాబుకు ఈ టాస్క్‌ఫోర్స్ నివేదికను అందజేయనుంది. అనంతరం... రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సీఐఐ పోషించాల్సిన కీలక పాత్రపై సీఎం చంద్రబాబు ప్రసంగించనున్నారు. గురువారం అంటే.. జులై 17వ తేదీ ఉదయం 9 గంటలకు సీఎం చంద్రబాబు నాయుడు విజయవాడకు తిరుగు ప్రయాణం కానున్నారు.

**తెలుగు రాష్ట్రాల సీఎంలు సమావేశం..!** మరోవైపు.. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు న్యూఢిల్లీలో భేటీ అయ్యే అవకాశమున్నట్లు తెలుస్తుంది. కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో వీరిద్దరు భేటీ అయ్యే అవకాశమున్నట్లు సమాచారం. పోలవరం – బనకచర్ల ప్రాజెక్ట్‌పై తెలంగాణలో పలు రాజకీయ పార్టీల నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్రం నుంచి వచ్చిన అభ్యంతరాలపై ఏపీ ఇప్పటికే సమాధానం ఇచ్చింది. అయితే దీనిపై చర్చలే ముఖ్యమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు సైతం ఇదే అంశాన్ని ప్రస్తావించారు. దీంతో ఈ అంశంపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో వీరిద్దరు సమావేశమయ్యే అవకాశముందని తెలుస్తుంది. ఇక సీఎం చంద్రబాబు రెండు రోజుల న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ కానున్నారు. అలాగే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా బుధవారం న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. ఆయన సైతం అదే రోజు కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌లో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల మధ్య ప్రాజెక్టులు, నీటి కేటాయింపులతోపాటు పోలవరం – బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో ఈ సీఎంలు ప్రాథమిక చర్చలు జరపనున్నట్లు తెలుస్తోంది. అయితే పోలవరం – బనకచర్లపై కేంద్రం లేవనెత్తిన అంశాలపై సీఎం చంద్రబాబు ఇప్పటికే సమగ్ర నోట్స్ తయారు చేసినట్లు సమాచారం. అలాగే ఈ ప్రాజెక్ట్‌పై తెలంగాణ తెరపైకి తీసుకు వచ్చిన అంశాలను కూడా ఈ సందర్భంగా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్.. తెలుగు రాష్ట్రాల సీఎంలకు ఒకే సారి అపాయింట్‌మెంట్ ఇచ్చారా? లేకుంటే వేర్వేరుగా ఇచ్చారా ? అనే అంశంపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో వీరి భేటీపై కొంత సందిగ్ధత నెలకొంది.

చురకలు

## సంపాదకీయం

# డీకే, సిద్ధరామయ్యా 'కుర్చీ'లాట!

కర్ణాటక రాజకీయాల్లో సీఎం పదవి చుట్టూ మళ్లీ వేడి రాజుకుంది. కాంగ్రెస్ అధికారం చేపట్టినప్పటి నుంచే సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య కనిపిస్తున్న 'అసంతృప్తి' చీకటి రాజకీయంగా కొనసాగుతున్నా.. ఇప్పుడు బహిరంగ వ్యాఖ్యల దశకు చేరుకుంది. ముఖ్యమంత్రి పీఠంపై ఆసక్తిని డీకే తాజా వ్యాఖ్యలతో మరోసారి స్పష్టంగా సంకేతాలిచ్చారు.

**– "కుర్చీ దొరికితే వదలొద్దు!"...** బెంగళూరులో న్యాయవాదుల సమాఖ్య నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న డీకే శివకుమార్, ఖాళీ కుర్చీలను చూపుతూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. "ఇక్కడ చాలా మంది లాయర్లు ఖాళీ కుర్చీలు ఉన్నా కూర్చోవడంలేదు. కానీ మేమైతే ఓ కుర్చీ కోసం ఏ స్థాయిలోనైనా పోరాడతాం. కుర్చీ దొరికితే వదలొద్దు. అందులో కూర్చోవాలి. దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అంటూ వ్యాఖ్యానించారు. ఈ మాటలు హాస్యంగా కనిపించినా.. రాజకీయంగా మాత్రం గంభీర సంకేతాలివిగా విశ్లేషకులు భావిస్తున్నారు. అధికార కుర్చీపై డీకే మక్కువను అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. ముఖ్యమంత్రి పదవి ఎప్పుడైనా తనవయ్యే అవకాశం ఉంటుందని ఆయనలో ఆశ సజీవంగానే ఉందని చెప్పొచ్చు.

**–వెంటనే వైరల్.. విమర్శలు, వాదనలు!...** డీకే వ్యాఖ్యలు కేవలం హాస్యానికి పరిమితం కాలేదు. సీఎం పదవి విషయంలో ఆయన ఆసక్తికి, ఇప్పటి రాజకీయ దిశకు అవి ప్రతిబింబంగా మారాయి. నెట్టింట్లో ఈ వ్యాఖ్యలు వైరల్ కావడంతో.. 'డీకే సీఎం కావాలనే తపన'పై పునరాలోచనలు ప్రారంభమయ్యాయి.

**–రెండున్నరేళ్ల ఒప్పందం నిజమేనా?....** 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత సీఎం ఎంపిక కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారిన సంగతి తెలిసిందే. చివరకు సిద్ధరామయ్య సీనియారిటీ, సామాజిక సమీకరణాల పేరుతో ఎంపికయ్యారు. అయితే, అప్పటినుంచి రెండు సంవత్సరాల తర్వాత సీఎంను మార్చే ప్రణాళిక ఉన్నదనే ప్రచారం రాజకీయం చేస్తోంది. పార్టీలో చా లా మంది ఎమ్మెల్యేలు, నేతలు ఇదే మాట చెబుతుండటంతో డీకే ఆశలు బలపడుతున్నాయి.

**–పార్టీ చీలిపోయే ప్రమాదం?...** అయితే, డీకే ముఖ్యమంత్రి అయితే సిద్ధరామయ్య వర్గం అసంతృప్తిగా మారే ప్రమాదం ఉంది. ఆయనను గద్దె దించితే కాంగ్రెస్‌లో విభేదాలు పెరిగి పార్టీ బలహీనపడే అవకాశముందని హైకమాండ్ ఆందోళన చెందుతోంది. ముఖ్యంగా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఏ చిన్న వైఖరిని అయినా జాగ్రత్తగా మేనేజ్ చేయాలనే ఉద్దేశంతో సిద్ధరామయ్యకు పూర్తి మద్దతు ఇస్తూ వస్తోంది. డీకే శివకుమార్ వ్యాఖ్యలు ఇప్పటివరకు నడుస్తున్న 'నిశబ్ద రాజకీయ పోరాటం'కు బహిరంగ రూపమిచ్చినట్టే. కాంగ్రెస్‌లో కుర్చీలాట ఎప్పుడు ఓ తేలికపాటి అంశంలా కనిపించినా.. గడిచిన అనుభవాల దృష్ట్యా అది పార్టీకి నష్టం కలిగించే విధంగా మారకూడదని విశ్లేషకుల అభిప్రాయం. ఇకపోతే, అధిష్టానం ఎంత కాలం ఈ తాత్కాలిక సమతుల్యతను కాపాడగలదో చూడాలి!


# సామాజిక సేవలకు ప్రతిరూపం దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ - జూలై 15... దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ జయంతి



ఆమె ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త, రచయిత్రి. దేశభక్తు రాలిగా, సామాజిక సేవా తత్పరు రాలుగా ... మరెవరూ చూపని ధైర్య సాహసాలను, ప్రజ్ఞను చూపి చరిత్రలో నిలిచి పోయారు. తెలుగు ప్రజలు గర్వించ దగిన ఉన్నత భావాలు కలిగిన మహోన్నత వ్యక్తి. వ్యక్తి మాత్రమే కాదు, ఒక వ్యవస్థ. మేధావిగా, న్యాయ కోవిదు రాలుగా, మానవతా వాదిగా, ఆంధ్ర మహిళాసభ వ్యవస్థాపకురాలిగా.. బహుముఖ ప్రజ్ఞను కనబరిచి చరిత్రపుటల్లో మహామనిషిగా నిలిచిన ఆ ఉక్కు మహిళ దుర్గాబాయ్ దేశ్ ముఖ్. ఒక బాలికగా జాతీయోద్యమానికి ప్రేరేపితురాలై, జాతిపిత, చాచా నెహ్రూ లాంటి జాతీయోద్యమ నేతల మన్ననలను అందు కున్నారు. గాంధీజీ ఆంధ్ర రాష్ట్ర పర్యటనకు విరాళాల సేకరణ కోసం కాకినాడ వచ్చినపుడు ఆయన ప్రసంగాన్ని తెలుగులో చేసిన అనువాదానికి గాంధీజీ అభినందనలకు పాత్రు లైనారు. ఆ సందర్భంలో విరాళాలు సేకరించడమే కాక, మహాత్ముడు అడిగితే తన చేతి బంగారు గాజులు కూడా సమర్పించిన త్యాగమయి. కాకినాడలో 1923లో జరిగిన కాంగ్రెసు మహాసభలకు టికెట్టు లేకుండా వచ్చిన జవాహర్లాల్ నెహ్రూను అనుమతి లేదని వెనక్కి పంపిన ధీశాలి. దుర్గాబాయ్ చిన్ననాటి నుండే స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచు కున్నారు. తన 12 యేండ్ల వయసులో ఆంగ్ల విద్యపై పోరాటం చేశారు. ఆమె రాజమండ్రిలో బాలికలకు హిందీలో విద్యను అందించడానికి బాలికా హిందీ పాఠశాలను ప్రారంభించారు. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మద్రాసు ప్రెసిడెన్సి (ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్) లోని రాజమండ్రిలో, 1909 జూలై 15 న సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన రామారావు, కృష్ణవేణమ్మ దంపతులకు జన్మించారు. పది సంవత్సరాల వయస్సులోనే హిందీలో పాండిత్యాన్ని సంపాదించి, హిందీ పాఠశాలను నెలకొల్పి అన్ని వయసుల వారికీ విద్యాబోధన అందించారు. బెనారస్ విశ్వ విద్యాలయం నుండి మెట్రి క్యులేషన్, ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి ఎం.ఏ (పొలిటికల్ సైన్స్), 1942లో ఎల్. ఎల్.బి పూర్తిచేసింది. న్యాయశాస్త్ర చదువు పూర్తయ్యాక మద్రాసులో హైకోర్టులో సాధన ప్రారంభించారు. న్యాయ కోవిదురాలిగా, ప్రఖ్యాత క్రిమినల్ లాయర్‌గా పేరుగాంచారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు జైలు శిక్ష కూడా అనుభవించారు. భారతదేశ రాజ్యాంగ సభ, ప్రణాళికా సంఘ సభ్యురాలు. ఆమె నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్ కు మొదటి చైర్ పర్సన్ గా వ్యవహరించారు. 1953 ఆగస్టులో భారత ప్రభుత్వంచే నెలకొల్పబడిన కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డుకు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా, ఢిల్లీలో బ్లైండ్ రిలీఫ్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలిగా పని చేశారు. ఆమెను భారతదేశంలో సోషల్ సర్వీస్ మదర్ గా పిలిచేవారు. అనేక మహిళా సంస్థలు, సాంఘిక సంక్షేమ సంస్థలను ప్రారంభించి స్త్రీల అభ్యున్నతికి కృషిచేశారు. ఆమె ఆధ్వర్యంలో 1937లో చెన్నపట్నంలో (ప్రస్తుత చెన్నై లో) ఆంధ్ర మహిళా సభ స్థాపించ బడింది. హైదరాబాద్ లో ఆంధ్ర మహిళా సభను స్థాపించారు. ఇప్పటికీ పనిచేసే ఆసంస్థ పేరుతోనే ఆవీధిని పిలుస్తారు. అక్కడ వితంతువులకు, అనాధ స్త్రీలకు చదువు చెప్పించడం, రకరకాల పనులలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ళమీద వారు నిలబడేటట్లుగా తయారు చేసేవారు. రాష్ట్ర మంతటా ఎన్నో కళాశాలలు, వసతిగృహాలు, నర్సింగ్ హోమ్‌లు, వృత్తి విద్యాకేంద్రాలు నెలకొల్పారు. లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్ అనే బాల సంఘాన్నికూడా స్థాపించారు. నర్సింగ్ కాలేజీ లను స్థాపిం చారు. ఆంధ్ర మహిళ పత్రికను స్థాపించి సంపాదకత్వం వహించారు. 1953 జనవరి 22న దేశ్‌ముఖ్ వివాహం దుర్గాబాయ్ తో జరిగింది. అది ద్వితీయ, అంతర్రాష్ట్ర, ఆదర్శ వివాహం అయినందున దేశంలో గొప్ప సంచలనం సృష్టించింది. వారి పెళ్లి పత్రంపై నెహ్రూ, ఆచార్య కృపలానీ దంపతులు సాక్షులుగా సంతకాలు చేశారు. దుర్గాబాయ్‌తో వివాహం జరిగిన తర్వాత మొదటి జన్మదినాన్ని ఆయన తన ఇంట్లో చాలా నిరాడంబరంగా జరుపు కున్నారు. ఈ సంగతి నెహ్రూకు తెలిసి, తీరిక చేసుకొని నెహ్రూ వాళ్ల ఇంటికి వెళ్లారట. 'ఏం దుర్గాబాయ్! దేశ్‌ముఖ్ నీ భర్తే కావచ్చు.. నా క్యాబినెట్ మంత్రి సుమా!' అని చమత్కరించారట. ఆ దంపతులు ఇచ్చిన టీ బిస్కెట్ తీసుకుని నెహ్రూ మందహాసంతో వెళ్లిపోయారట. ఇలాంటి ఆప్యాయత ఈ రోజుల్లో కనిపించడం బహు అరుదు. 1971లో సాక్షారతా భవన్ ని ప్రారంభించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం దుర్గాబాయికి 1971లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 1975లో భారత ప్రభుత్వం పద్మ విభూషణ పురస్కారంతో సత్కరించగా, అదే సంవత్సరం ఆయన సతీమణి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కూడా పద్మ విభూషణ్ పొందడం, భార్యా భర్తలు ఇద్దరూ ఒకే ఏడాది పురస్కార గ్రహీతలు కావడం విశేషం. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, 1971 – నెహ్రూ లిటరసీ అవార్డు (వయోజన విద్యాసేవలకు గుర్తింపుగా), యునెస్కో నుండి పాల్ జి. హాఫ్‌మన్ అవార్డు పొందారు. అసమాన ప్రజ్ఞా పాటవాతో చిర కాలం గుర్తుండే కార్యక్రమాలకు పురుడు పోసిన దుర్గాబాయ్ 1981 మే 9వ తేదీన హైదరాబాదులో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# మాటల మాంత్రికుడు డి.వి.నరసరాజు - జూలై 15...డి.వి.నరసరాజు జయంతి




తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తన రచనతో ఎన్నో మరపురాని చిత్రాలను అందించిన ప్రసిద్ధ రచయిత డి.వి. నరసరాజు. సినీ కథ, సంభాషణల రచయితగా సుప్రసిద్ధులు. ఆయన రచించిన సినిమాలలో హాస్యరసం తొణికిస లాడుతూ ప్రేక్షకుల్ని నవ్వించింది. జన సామాన్య వాడుక లోని పదాలతోనే వాడి హాస్యం వ్యంగ్యం పండించిన కృషీవలుడు డి.వి.నరసరాజు. ఆయన మౌలికంగా నాటక రంగం తెలుగు పలుకు బడిని ఉపయోగించడంలో అందెవేసిన చేయి. డి.వి. నరసరాజుగా ప్రసిద్ధుడైన దాట్ల వెంకట నరసరాజు (జూలై 15, 1920 – ఆగష్టు 28, 2006) రంగస్థల, సినిమా నటుడు, రచయిత, దర్శకుడు. 1920 జూలై 15న గుంటూరు జిల్లా, సత్తెనపల్లి మండలంలోని తాళ్లూరులో జన్మించాడు. ఆయన హేతువాది. నరసరాజు గుంటూరులోని హిందూ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని, హిందూ కళాశాలలో ఇంటర్ తర్వాత మద్రాసు లయోలా కళాశాల నుండి బి.ఏ పూర్తి చేశాడు. ఇప్పుడు విజయవాడలో కలసి పోయిన ముత్యాలంపాడు గ్రామంలో తొలి గ్రాడ్యుయేట్ దాట్ల వెంకట నరసరాజు. నాటక రచయితగా జీవితాన్ని ప్రారంభించాడు. సినిమాల లోకి రాకముందు నాటక రచయితగా పేరు తెచ్చు కున్నాడు. అంతర్వాణి, ఈ ఇల్లు అమ్మ బడును, వాపసు లాంటి సూపర్ హిట్ నాటకాలు రాశాడు. ఈనాడు పత్రికలో కొంతకాలం పనిచేశాడు. మొదటి నుంచి సృజనాత్మక కళల మీదే నరసరాజు దృష్టి. 1951లో పాతాళభైరవి సినిమా వందరోజుల ఉత్సవం సందర్భంగా ప్రదర్శించబడిన నరసరాజు నాటకం "నాటకం" చూసాడు దర్శకుడు కె.వి.రెడ్డి. ఆయన ప్రతిభ చూసిన దిగ్గర్శకులు కేవీ రెడ్డి తన 'పెద్ద మనుషులు' చిత్రం ద్వారా నరసరాజును చిత్రసీమకు పరిచయం చేశారు. అలా నరసరాజు 1954లో పెద్ద మనుషులు సినిమాతో రచయితగా సినీరంగ ప్రవేశం చేశాడు. ఆ సినిమా విజయవంతం కావడంతో సినీ రచయితగా స్థిరపడ్డాడు. దొంగ రాముడు మూవీకి రచయితగా డి.వి.నరసరాజునే తీసుకున్నారు. గుండమ్మ కథకు మాటలు రాశాడు. రాముడు భీముడును సూపర్ డూపర్ హిట్ కొట్టించాడు. నరసరాజుతో ఎన్టీఆర్‌కు ఎక్కువ సాన్నిహిత్యం ఉండేది. తన స్వీయ నిర్మాణంలో తెరకెక్కిన సాంఘిక చిత్రాలకు ఎక్కువగా నరసరాజుకే స్క్రిప్ట్ బాధ్యతలు అప్పగించేవారు ఎన్టీఆర్. అలా రూపుదిద్దుకున్న చిత్రాల్లో కోడలు దిద్దిన కాపురం ఒకటి. బడి పంతులు డైలాగ్స్ కోసం డబ్బులు తీసుకున్న ఆత్రేయ రాయని స్థితిలో చివరకు నరసరాజు పూర్తి చేయాల్సి వచ్చింది. యన్టీఆర్ హీరోగా రూపొందిన "నాదీ ఆడజన్మే, సి.ఐ.డి., తిక్క శంకరయ్య, బడి పంతులు, వాడే-వీడు, మగాడు, యమగోల, కేడీ నంబర్ వన్, యుగంధర్ లాంటి చిత్రాలలో ఆయన చిరకాలం గుర్తుండేలా రచనలు చేశారు. అక్కినేని హీరోగా రూపొందిన మూగనోము, గృహలక్ష్మి, జై జవాన్, ఇద్దరు అమ్మాయిలు, శ్రీరంగనీతులు, రావుగారిల్లు చిత్రాలకు నరసరాజు రచన చేశాడు. చిత్రపు నారాయణ మూర్తి తీవ్రమైన కష్టాల్లో ఉన్న పరిస్థితి చూసి సాధారణంగా పౌరాణికాలు పెద్దగా అంగీకరించని నరసరాజు భక్త ప్రహ్లాదకు పని చేశారు. రంగుల రాట్నం, రాజ మకుటం లాంటి సినిమాలు ఆయన ఖాతాలోకే వస్తాయి. యమగోల చిత్రంలో చాలా పొలిటికల్ డైలాగులు పేల్చి నరసరాజు జనంతో ఈలలు కొట్టించు కున్నారు. ఎమర్జన్సీ మీద కాంగ్రెస్ పార్టీ మీద చాలా సెటైర్లు రాయగా, తెర మీద చెప్పేది ఎన్టీఆర్ కావడంతో ఆ డైలాగ్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. నాటకం' అనే నాటకంతో రంగస్థలం మీద సంచలనం సృష్టించిన డి.వి.నరసరాజు తెర మీద కూడా రెండు సినిమాల్లో నటించారు. ఒక సినిమాకు దర్శకత్వం వహించాడు. అలా నరసరాజు 92కు పైగా సినిమాలకు కథను, మాటలను సమకూర్చాడు. ఆయన దర్శకత్వం వహించిన కొన్ని సినిమాలలో కారు దిద్దిన కాపురం ఒకటి. వి.వి. సత్య నారాయణ తొలి చిత్రం చెవిలో పువ్వులో నరసరాజు హీరోయిన్ సీత తాతగా నటించారు. మనసు-మమత చిత్రంలోనూ ఓ కీలక పాత్ర పోషించారు నరసరాజు. ఈయన చివరి సినిమా 2006 లో విడుదలైన మాయా బజార్. ఆయన 2006 ఆగష్టు 28న హైదరా బాదులో మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఫాదర్ ఆఫ్ కెమటాలజీ కొలచల సీతారామయ్య - జూలై 15... కొలచల సీతారామయ్య జయంతి

కొలచల సీతారామయ్య (జూలై 15, 1899 – సెప్టెంబరు 29, 1977) ఆయిల్ టెక్నాలజీ పరిశోధక నిపుణులు. యంత్రాలు, వాహనాలలో యంత్ర భాగాల ఘర్షనను నిరోధించే కందెనలు (లూబ్రికెంట్స్) మీద పరిశోధనలు చేసి కెమటాలజీ (మోటారు ఆయిల్స్, కందెనలకు సంబంధించిన రసాయన శాస్త్రము) కు పునాది వేసిన రసాయన శాస్త్రవేత్త. ఆయనను ఫాదర్ ఆఫ్ కెమటాలజీ అంటారు. ఆయన కృష్ణా జిల్లా లోని ఉయ్యూరు గ్రామంలో జన్మించారు. ఆయన జాతీయ భావాలు గల మధ్య తరగతి కుటుంబంలో జూలై 15 1899లో జన్మించారు. మదనపల్లె నేషనల్ కాలేజి (చిత్తూరు) రసాయన శస్త్రాధ్యయనం చేశారు. 1921 లో మద్రాసు విశ్వ విద్యాలయం గ్రాడ్యుయేట్ స్కూల్ లో ప్రవేశించారు. 1924 జూన్ 10 వ తేదీన రసాయన శాస్త్రంలో ఆయనకు మాస్టర్స్ డిగ్రీ ప్రదానం జరిగింది. స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా జరుగుతున్న కాలంలో ఆస్తినంతటినీ అమ్మివేసి అమెరికా వెళ్లారు. చికాగో యూనివర్శిటీకి వెళ్ళి ఆయిల్ టెక్నాలజీలో పరిశోధన చేశారు. అతి ప్రామాణికమైన సిద్ధాంత రూపకల్పన చేసి పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ అందు కున్నారు. పెట్రోకెమికల్ రంగంలో ప్రైవేటు కంపెనీలో 1925 నుండి 1927 దాకా అమెరికాలో పనిచేశారు. ఆ కాలంలో న్యు హెవెన్ లో గల కంపెనీ ప్రయోగశాలకు ఆయన అధిపతిగా ఉండేవారు. అదే కాలంలో మెల్ విశ్వవిద్యాలయం నుండి డిగ్రీని పొందారు. సానెబాల్స్ సంస్థలో పని చేసిన కాలంలో లూబ్రికెంట్ ల నాణ్యతను పెంచే ఉత్పత్తులను కనుగొన్నారు. ఈ పరిశోధనల ఫలితాలన్నింటికి పేటెంట్ హక్కులు లభించిన ఖ్యాతి సీతారామయ్యకు దక్కింది. 1930 డిసెంబర్ 17 న కొలాచల సీతా రామయ్య సోవియట్ యూనియన్ రాజధాని మాస్కో నగరం చేశారు. అనతి కాలంలోనే భూ పరిశోధకునిగా ప్రసిద్ధి పొందిన ఒక విద్యావేత్త అయిన "గుచికిక్"తో పరిచయం యేర్పడింది. ఆయన రష్యా ప్రభుత్వ ఆయిల్ రీసెర్చి ఫౌండేషన్ డైరక్టరు. ఆ దేశంలోని వోల్గా ప్రాంతం నుంచి ఉరల్స్ ప్రాంతం వరకు గల భూగర్భంలో నూనె నిల్వలు అపరిమిత స్థాయిలో ఉన్నట్లు సీతా రామయ్యకు తెలుపుతూ పరిశోధనలలో తనకు సహకరించ వలసినదిగా పోత్సహించారు. సీతా రామయ్యకు గల ఆయిల్ కెమికల్ సైన్సు రంగంలో ఉన్న పరిశోధనానుభవం, కృషి సాఫల్యతల గూర్చి తెలుసుకొన్న గుచికిక్ మరింత మద్దతునిచ్చి, దేశ పౌరసత్వాన్ని లభింపజేసి, ఆయిల్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్ లోని లూబ్రికెంట్స్ రీసెర్చి డివిజన్ కు డైరక్టరుగా నియమింప జేశారు. ఆ పరిణామం సీతారామయ్య పరిశోధనా జీవితాన్ని వ్యక్తిగత జీవితాన్ని సమూలంగా మార్చివేసింది. ఆయన పేరు "కాన్‌స్తాంతిన్ సెర్గియేవిచ్"గా రూపాంతరం చెందింది. రష్యనుగా మారి, జీవితంలో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. సోవియట్ రష్యా దేశంలోని ఆయిల్ వనరులు ఉన్న ఆయిల్ రిఫైనరీస్ ఉన్న ప్రాంతాలలో క్షుణ్ణంగా పరిశీలించారు. ఆధునిక సాంకేతిక విధానాలను ప్రవేశ పెట్టడానికి అధ్యయనాలు నిర్వహించి కృషిచేశారు. అనతి కాలంలోనే ఆ ప్రభుత్వ గుర్తింపు పొందారు. ఆటోమొబైల్, మోటార్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ లోని ఆయిల్ రీసెర్చి డివిజన్ కు హెడ్ గా నియమితులయ్యారు. DKNAMI అనే పేరుతో క్రొత్త పరికరాన్ని తయారు చేయడం. తర్వాత మీడియా సిద్ధాంతం ఆవిష్కరణ, తర్వాత కాలంలో సైన్స్ లో కొత్త అధ్యాయం ఆరంభమైంది. కొంతకాలం గడిచిన తర్వాత దానికి కెమోటాలజి అనే ఒక ప్రత్యేకమైన పేరు వచ్చింది. రామయ్య పరిశోధనలతో లూబ్రికంట్ చరిత్రలో విప్లవమే వచ్చింది. అందుకే రామయ్య "కెమోటాలజీ పితామహుడు" అయ్యారు. అన్ని రకాల శీతోష్ణస్థితిలో సమర్థవంతంగా పని చేసే ప్రత్యేక కిరోసిన్ ఇంధనాన్ని తయారు చేశారు. ఎటువంటి ప్రతికూల వాతావరణంలో నైనా యుద్ధ ట్యాంకులు నిలిచి పోకుండా ఉండేందుకు ఆయన కనుగొన్న ఇంధనం రెండవ ప్రపంచ యుద్ధంలో సోవియట్ మిత్రకూటమి విజయ పరంపరలో కీలకమైనది. టాంక్ యుద్ధాలలో విజయాలను అందుకునేలా చేసింది. అనతి కాలంలోనే ఆయన ప్రముఖ శాస్త్రవేత్తగా




Young Indian friends in Ramayya's Lab., 1957

అఖండ కీర్తినార్జించడమే కాక ఆటోమొబైల్స్, మోటార్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ విభాగాధిపతిగా నియమింప బడ్డారు. ఆయనకు సాహిత్యంలో కూడా ప్రవేశం ఉంది. ఏటుకూరి బలరామమూర్తి రాసిన "ఏ బ్రీఫ్ సర్వే ఆఫ్ ద హిస్టరీ ఆఫ్ ద పీపుల్ ఆఫ్ ఆంధ్ర" అనే పుస్తకాన్ని రామయ్య రష్యన్ భాషలోకి అనువదించారు. చాలా ఏళ్ళ అనంతరం 1963 లో ఏప్రెల్ 22 నుండి జూన్ 5 వరకు 42 రోజులు మాతృ దేశమైన భారత్ లో గడిపి తిరిగి రష్యా చేరుకున్నారు సీతా రామయ్య. తాను రష్యా కు, భారత దేశంకు చెందిన ఉమ్మడి పౌరుడిని అని చెప్పుకుని గర్వ పడేవారు. రష్యాలో ఆయనను ఆంధ్రా సీత రామయ్య అంటే... భారతదేశంలో ఆయన్ను రష్యా సీతా రామయ్య అనే వారు. తీవ్రమైన న్యుమో నియాతో బాధపడి 1977 సెప్టెంబర్ 29 న తన 78 వ ఏట మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఆంధ్రప్రదేశ్ తొలి ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు - జూలై 15...కోకా సుబ్బారావు జయంతి



రాజ్యాంగ సంక్రమిత ప్రాథమిక హక్కులను, సవరించేందుకు చట్టసభలకు వీలులేదని, అలాగే చట్ట సభలకు (పార్లమెంట్ కి) కూడా ప్రాథమిక హక్కుల ఉల్లంఘన చేసే అధికారం లేదని చారిత్రాత్మక తీర్పులు వెలువరించిన న్యాయమూర్తి కోకా సుబ్బారావు. కోకా సుబ్బారావు (జూలై 15, 1902 – మే 6, 1976) ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మొట్ట మొదటి ప్రధాన న్యాయమూర్తి, తొమ్మిదవ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి. రాజమండ్రిలో 1902 జూలై 15న కోకా సుబ్బారావు విద్యావంతులైన వెలమ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి సుబ్రమణ్యేశ్వర నాయుడు కూడా రాజమండ్రిలో ప్రముఖ న్యాయవాదిగా పేరెన్నిక గన్నారు. తండ్రి చిన్నతనంలోనే మరణించారు. రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పొందిన తరువాత, మద్రాసు లా కాలేజీలో న్యాయశాస్త్రం చదివారు. అక్కడ మంచి క్రీడాకారునిగా రాణించారు. టంగుటూరి ప్రకాశం పంతులుకు జూనియరుగా ఉన్న తన మామయ్య పి. వెంకట రమణారావు నాయుడు వద్ద సుబ్బారావు జూనియర్ గా వృత్తి ప్రారంభించారు. వెంకట రమణారావు మద్రాసు ఉన్నత న్యాయస్థానంకు జడ్జిగా పదవోన్నతి పొందిన తర్వాత, సుబ్బారావు తన బావమరిది పి.వి.రాజమన్నార్ తో కలిసి ప్రాక్టీసు కొనసాగించారు. రాజమన్నార్ ఆ తరువాతి కాలంలో అడ్వకేట్ జనరల్, తర్వాత మద్రాసు ఉన్నత న్యాయస్థానం యొక్క ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. వీరిరువురు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రధాన కేసులన్నీ చేపట్టారు. 1948లో సుబ్బారావు బెంచికీ నియమించ బడ్డారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తర్వాత రాజాజీ, సీనియర్ జడ్జి అయిన గోవింద మీనన్ ను 1954లో గుంటూరులో ఏర్పాటు కానున్న ఆంధ్ర రాష్ట్ర హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా పంపాలను కున్నారు, అయితే ప్రకాశం పంతులు... హైకోర్టు ఏర్పాటును పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారిగా సుబ్బారావే కావాలని పట్టుబట్టిన కారణంగా గుంటూరులో హైకోర్టు ఏర్పాటు అయిన తర్వాత సుబ్బారావు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పుడు సుబ్బారావు హైదరాబాదు లోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగారు. 1954లో తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం స్థాపన సమయంలో, సుబ్బారావు విశ్వ విద్యాలయపు తొలి సంచాలకులుగా నియమించ బడ్డారు. విశ్వ విద్యాలయల చట్టాన్ని సవరించి రాష్ట్ర గవర్నరుకు విశ్వ విద్యాలయాల సంచాలక పదవిని పునరుద్ధరించే వరకు సుబ్బారావు ఆ పదవిలో కొనసాగారు. మద్రాసు హైకోర్టులో జడ్జిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన తర్వాత 1958 జనవరి 31న ఆయన సుప్రీంకోర్టు జడ్జిగా నియమించ బడ్డారు. 1966 జూన్ 30న కోకా సుబ్బారావు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితు డయ్యారు. ఆయన వ్రాసిన తీర్పులలో ప్రసిద్ధ గోలక్‌నాథ్ – పంజాబ్ రాష్ట్రం కేసు అత్యంత ప్రముఖమైనది. ఈ కేసులో భారత రాజ్యాంగం ఆపాదించిన ప్రాథమిక హక్కులను చట్టసభలు సవరించేందుకు వీలులేదని తీర్పునిచ్చారు. చట్ట సభలకు (పార్లమెంట్ కి) కూడా ప్రాథమిక హక్కుల ఉల్లంఘన చేసే అధికారం లేదని చారిత్రాత్మిక తీర్పులో పేర్కొన్నారు. ప్రధాన న్యాయవాది సుబ్బారావు, జస్టిస్ షా, సిక్రి, షిలత్, వైదియలింగంతో కూడిన ధర్మాసనం ఈ తీర్పుని ప్రకటించింది. అలా పౌరుల ప్రాథమిక హక్కుల భంగంకు సంబంధించిన కేసుల విషయం వచ్చినపుడల్లా కోకా సుబ్బారావు పేరు గుర్తుకు రాక మానదు. సుబ్బారావు భారత నాలుగవ రాష్ట్రపతి ఎన్నికలలో, ప్రతిపక్ష పార్టీల యొక్క ఏకగ్రీవ అభ్యర్థిగా పోటీ చేయటానికి వీలుగా 1967 ఏప్రిల్ 11న న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు. అయితే ఆ ఎన్నికలలో జాతీయ కాంగ్రెస్ అభ్యర్థి అయిన జాకీర్ హుస్సేన్ చేతిలో ఓటమి చవి చూశారు. సుబ్బారావు మే 6, 1976న బెంగుళూరులో మరణించారు. బెంగుళూరు విశ్వ విద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. సుమారు 55 ఏళ్ల తర్వాత మరో తెలుగు వ్యక్తి జస్టిస్ ఎన్వి రమణ కు ఈ అరుదైన అవకాశం లభించడం విశేషం.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఉపాధికి స్వాగతం

సారంగాపూర్: డిగ్రీ పట్టాలు పొందిన విద్యార్థులు చదువుకు తగిన ఉద్యోగాలు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సంప్రదాయ కోర్సులు చేసిన వారికి సరైన ఉపాధి అవకాశాలు లేవు. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ, విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఆధ్వర్యంలో వృత్తిరీత్యా కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో చేరిన విద్యార్థులు రెండేళ్ల పాటు కళాశాలలో చదివి.. మూడో సంవత్సరం కోర్సుకు సంబంధించిన కంపెనీల్లో అప్రెంటిస్‌షిప్ చేయవచ్చు. శిక్షణ, నైపుణ్యం ఆధారంగా అదేచోట ఉద్యోగం కూడా పొందవచ్చు. ఇతర కంపెనీల్లో కూడా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి.

**ఇంటర్ విద్యార్థులు అర్హులు**

ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు బీకామ్ 'ఈ-కామర్స్ ఆపరేషన్స్' కోర్సు ఎంచుకోవచ్చు. ఆన్‌లైన్, షోరూం తదితర ప్రముఖ కంపెనీల్లో సేల్స్ సెక్టార్‌లో ఉపాధి అవకాశాలు ఉంటాయి. బీఎఫ్ఎస్ఐ(బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్) ద్వారా బ్యాంకింగ్ ఆపరేషన్, ఇన్సూరెన్స్, ఫైనాన్షియల్ మేనేజ్ మెంట్‌లో ఉద్యోగాలు దొరుకుతాయి. బీఎస్సీ హెచ్‌సీఎం(హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్)తో హెల్త్ కేర్ అడ్మినిస్ట్రేటర్, హాస్పిటల్ మేనేజర్, హెల్త్ ఇన్సూరెన్సు అనలిస్టు, మెడికల్ ఆఫీస్ మేనేజర్, పబ్లిక్ హెల్త్ ప్రోగ్రాం మేనేజర్, హెల్త్ డాటా అనలిస్టు, క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్, హెల్త్ కేర్




మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అవకాశాలు లభిస్తాయి. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య బీమా, మెడికల్ టూరిజం కంపెనీలు, క్లినికల్ పరిశోధనా సంస్థలు, వైద్యారోగ్య శాఖ, హెల్త్ టెక్ స్టార్టప్స్‌లో స్థిరపడవచ్చు. బైపీసీ, సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూతో పాటు వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులు. ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, ఎంపీహెచ్(మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్), ఎమ్మెస్సీ(హెల్త్ అడ్మినిస్ట్రేషన్), పీజీ డిప్లొమా – క్లినికల్ రీసెర్చ్, హెల్త్ ఎకనామిక్స్, హెల్త్ ఇన్ఫార్మటిక్స్ వంటి ఉన్నత విద్యా కోర్సులు కూడా చేయవచ్చు.

**స్టైఫండ్ అందజేత**

బోర్డు ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్(బోట్) వారు మూడో ఏడాది కంపెనీలో శిక్షణ పొందుతున్న ప్రతి విద్యార్థికి, ఆయా కంపెనీలకు రూ.4వేలు చొప్పున చెల్లిస్తారు. పట్టా చేతికందాక రెండు పదుల వేతనంతో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

**కోర్సులు అందుబాటులో ఉన్న కళాశాలలు**

గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల (మూడు కోర్సులు)
కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాల(బీకాం రిటైయిల్ ఆపరేషన్స్)
గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల(బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్)
మంథని డిగ్రీ కళాశాలబీఎఫ్ఎస్ఐ(బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్)

**శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు**

నూతన కోర్సులు అభ్యసిస్తే అప్రెంటిస్‌షిప్ ఆధారిత ఉద్యోగాలు పొందవచ్చు. విద్యార్థులు ఒకసారి ఈ కోర్సు ఎంచుకున్న తర్వాత.. రెండేళ్లు కళాశాలలో చదివి.. హైదరాబాద్‌లో మూడో సంవత్సరం అప్రెంటిస్‌షిప్ శిక్షణ పొందాలి. ప్రతినెల బోర్డు ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ నిర్వాహకులు రూ.4వేలు అందజేస్తారు.

జైకిషన్ ఓజా, ప్రిన్సిపల్, ఖని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల

# ఆర్డర్లు దండిగా.. కార్మికులు అరకొరగా

సిరిసిల్ల: జిల్లా వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వ ఆర్డర్ల కేటాయింపులు జరిగాయి. రెండు విడతలుగా 4.24 కోట్ల మీటర్ల మహిళా సంఘాల చీరలు 130 మ్యాక్స్ సంఘాలకు ఆర్డర్లు ఇచ్చారు. గతనెల చేనేత, జౌళిశాఖ ఉన్నతాధికారులు మీటరుకు రూ.34 చొప్పున ఉత్పత్తి ధర నిర్ణయమైంది. దీనితర్వాత ప్రింటింగ్, ప్రాసెసింగ్ ప్రక్రియ కూడా ఉంటుంది. పరిశ్రమలో ప్రభుత్వ, ప్రైవేటు ఆర్డర్లు ఉత్పత్తికి సరిపడా కార్మికులు లేరు. అధిగమిస్తేనే ఉత్పత్తిలో వేగం పుంజుకుటుంది. **లక్ష్యం ఇలా..** రాష్ట్రంలోని మహిళా సంఘాలకు ఆగస్టు 15న లాంఛనంగా చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలివిడత ఒక్కో చీరను అందించాలని ప్రణాళికలు చేస్తోంది. జిల్లాలో డాబీ, జకార్డు పరికరాలు అమర్చిన 17 వేల మరమగ్గాలపై రోజుకు లక్ష మీటర్ల చీర వస్త్రం ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. ప్రస్తుతం నాలుగువేల మగ్గాలపై రోజుకు గరిష్ఠంగా 30 వేల మీటర్లకు మించి ఉత్పత్తి కావడం లేదు. గతంలో మాదిరిగా ఒత్తిడి లేకపోవడం.. సొంత ఉత్పత్తులు చేస్తూనే చీరలపై దృష్టి పెట్టడంలో ఆలస్యమవుతోంది. మొన్నటి వరకు నూలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. రాత్రి సమయంలో విద్యుత్తు దీపాల వెలుతురులో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఏడు కంపెనీల నూలు**

చీరల ఉత్పత్తిలో ఉపయోగించే నూలును నేషనల్ హ్యాండ్‌లూం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ధ్రువీకరించిన ఏడు కంపెనీల ద్వారా సరఫరాకు టెస్కో ఒప్పందం చేసుకుంది. 130 మ్యాక్స్ సంఘాల్లో 83 సంఘాలు సొంతంగా నూలు కొనుగోలు చేయాల్సి ఉండగా పెట్టుబడిలేక ఆర్థికంగా వెనకబడిన 47 మ్యాక్స్ సంఘాలకు చేయూతనిచ్చేందుకు నూలు బ్యాంకులో నూలు అందుబాటులో ఉంచారు. వీటిలో వారి ఉత్పత్తి సామర్థ్యాన్ని బట్టి టెస్కోకు డీడీలు చెల్లించిన వారికి విడతల వారీగా నూలు సరఫరా చేస్తున్నారు.

**పక్క జిల్లాలవారు వస్తేనే..**

జిల్లా వస్త్ర పరిశ్రమలో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దాదాపు రెండేళ్లుగా అరకొర ఉత్పత్తులతో నెట్టుకొస్తున్న కార్మికులకు ప్రస్తుతం పరిశ్రమలో సొంత ఉత్పత్తులకు ప్రభుత్వ ఆర్డర్లు తోడవడంతో ఉపాధికి కొదువలేదు. గతంలో బతుకమ్మ చీరల ఉత్పత్తి సమయంలో ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలు.. జిల్లాల నుంచి నేతన్నలు ఇక్కడికి వచ్చేవారు. ప్రభుత్వం ఏకరూప దుస్తులు, మహిళా సంఘాల చీరలు, ఇతర ఆర్డర్లతో ఏడాదిలో గరిష్ఠంగా ఎనిమిది నుంచి తొమ్మిది నెలలు ఇక్కడ పని లభిస్తుంది. ఇప్పటికే మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార?ండ్ రాష్ట్రాల నుంచి వెయ్యి మంది కార్మికులు సిరిసిల్లకు వచ్చారు. వీరిలో చాలా వరకు పాలిస్టర్, కాటన్ ఉత్పత్తులు చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి చీరలు నేసేందుకు రెండువేల మందికిపైన వస్తేనే వస్త్రోత్పత్తుల్లో వేగం పెరుగుతుంది. సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని.. ఉత్పత్తి పెంచేలా చర్యలు తీసుకుంటామని జిల్లా చేనేత, జౌళిశాఖ అదనపు సంచాలకులు రాఘవరావు పేర్కొన్నారు.

# అభ్యసనంలో తడబాటు!



పెద్దపల్లి : విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు విద్యాశాఖ చేపట్టిన ప్రయత్నం ఫలించడం లేదు. రాష్ట్ర, జాతీయ సగటుతో పోలిస్తే జిల్లా వెనకబాటుకు గురైంది. ఇటీవల 3, 6, 9వ తరగతి విద్యార్థులకు అభ్యసన సామర్థ్య పరీక్షలు నిర్వహించగా అన్నింటిలో ఆశించిన స్థాయిలో మార్కులు సాధించలేదు. జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి విడుదల చేసిన పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్-2024 నివేదిక ఆందోళన కలిగిస్తోంది. తరగతికి తగిన అభ్యసన సామర్థ్యాలు కొరవడినట్లు స్పష్టమవుతోంది. బాలుర కంటే బాలికల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగ్గానే ఉండటం విశేషం.

**సర్వేలో ప్రధానాంశాలు ఇలా..**

జిల్లాలో 88 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 331 ఉపాధ్యాయులు, 2,228 విద్యార్థులు సర్వేలో భాగస్వాములయ్యారు.
బాలురతో పోలిస్తే బాలికల అభ్యసన సామర్థ్యాలు మెరుగ్గా ఉన్నాయి. బాలికలు 54 శాతం, బాలురు 46 శాతం నమోదు అయ్యాయి.
పట్టణ ప్రాంతాల్లో విద్యార్థుల్లో 58 శాతం, గ్రామీణంలో 42 శాతం సామర్థ్యాలు కలిగి ఉన్నాయి.
ప్రైవేటులో 48 శాతం ఉండగా ప్రభుత్వం 44, ఎయిడెడ్ 4, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని పాఠశాలల్లో 4 శాతం ఉంది.
సామాజికవర్గాలవారీగా పరిశీలిస్తే ఎస్సీ 22, ఎస్టీ 5, ఓబీసీ 62, ఇతరులు 9 శాతం ఉన్నాయి.

ఇలా చేస్తే మెరుగు

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనలో లోతైన విజ్ఞానం అందించాలి.
బోధనోపకరణాలతో విద్యార్థులను సన్నద్ధం చేయాలి.
వెనకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
తల్లిదండ్రులను భాగసామ్యం చేస్తూ బడులను బలోపేతం చేయాలి.

# ప్రధాన రహదారిపై ఆక్రమణల జోరు



కోరుట్ల: జిల్లాలో జనాభా పరంగా రెండో పెద్ద పట్టణమైన కోరుట్ల రోజురోజుకూ విస్తరిస్తోంది. రహదారుల విస్తరణ, మౌలిక వసతుల కల్పనలో బల్దియా అధికారులు విఫలమవుతున్నారు. పట్టణంలోని జాతీయ రహదారిపై అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకోవడం లేదు.

**రద్దీతో తరచూ ప్రమాదాలు**

రోడ్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను బల్దియా అధికారులు 'మామూలు'గా చూస్తూ వీఎల్‌టీ నంబర్లు కేటాయించి పన్నులు వసూలు చేస్తున్నారు. ఆ నంబర్ల ఆధారంగా విద్యుత్తు అధికారులు మీటర్లు మంజూరు చేస్తున్నారు. ఆక్రమణలతో రహదారి కుచించుకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మెట్‌పల్లి రోడ్‌లో రద్దీతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై పురపాలక సంఘం పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా 100 అడుగుల లోపు చేపట్టిన నిర్మాణాలకు, రేకుల షెడ్లన్నింటికీ నోటీసులు జారీ చేస్తున్నామని చెప్పారు. రహదారిపై వంద అడుగుల వరకు మార్కింగ్‌ను ఇస్తున్నామని, త్వరలోనే ఆక్రమణలు తొలగింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**40-50 అడుగులలోపే నిర్మాణాలు**

కోరుట్లలో ప్రధాన రహదారి మెట్‌పల్లి రోడ్‌లోని కొత్త సురేశ్ రైస్‌మిల్లు నుంచి పట్టణ శివారులోని పశువైద్య కళాశాల వరకు, సాయిబాబా ఆలయ కూడలి తర్వాత నుంచి పట్టణ శివారులోని పాలిటెక్నికల్ కళాశాల వరకు విస్తరించి ఉంది.

పురపాలక నిబంధనల ప్రకారం రహదారికి ఇరువైపులా 100 అడుగులు వదిలిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాలి. ఇరువైపులా కేవలం 40-50 అడుగులలోపే నిర్మాణాలు జరుగుతున్నాయి.

శాశ్వత, తాత్కాలిక షెడ్లను రేకులతో నిర్మించుకొని దుకాణాల నిర్వహణకు అద్దెకు ఇస్తున్నారు. ప్రధాన రహదారిని ఆనుకునే భారీగా షెడ్లు వేసుకొని వినాయక విగ్రహాల తయారీ దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

# ముసురుకుంటున్న వ్యాధులు



కొత్తగూడెం : మన్యంలో వారం రోజులుగా కురిసిన చెదురుమదురు వానలతో అపరిశుభ్రత తాండవిస్తోంది. జ్వర బాధితులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వ దవాఖానాల్లో డెంగీ కేసులు అంకెల్లో నమోదైతే.. అనధికారికంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో వాటి సంఖ్య పది కంటే ఎక్కువగా ఉందని సమాచారం. ఈనెల 1 నుంచి 7 వరకు జిల్లావ్యాప్తంగా 29 పీహెచ్‌సీలు, 6 సీహెచ్‌సీలు, 245 సబ్ సెంటర్ల పరిధిలో 5,983 మంది జ్వరాల బారిన పడ్డారు. దగ్గు, జలుబు, కీళ్ల నొప్పులు, ఒళ్ల నొప్పులు వంటి సమస్యలతో సతమతమవుతున్నారు.రీ డెంగీ, ఇతర జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వైద్యనిపుణుల సలహాలు, సూచనలతో వైద్యపరీక్షలు చేయించుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాం. టీ హబ్ ద్వారా అన్నిరకాల వైద్యపరీక్షలు చేయించేందుకు వెసులుబాటు ఉంది. జ్వర బాధితుల నుంచి రక్తనమూనాలు సేకరించి పీహెచ్‌సీల ద్వారా టీ హబ్‌కు పంపించాలని సిబ్బందికి సూచించాం.

– డాక్టర్ ఎస్.జయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ

**పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి**

వర్షాలతోనే కాకుండా లీకేజీ సమస్యలతో వృథా అవుతున్న తాగునీటి కారణంగా కొన్నిప్రాంతాల్లో మడుగులు ఏర్పడుతున్నాయి. అలాంటి నీటి ఊటల్లోనే డెంగీ, చికున్‌గన్యా వంటి జ్వరకారక దోమలు వృద్ధి చెందుతున్నాయి. బహిరంగ ప్రదేశాలు, వీధుల్లో ఇళ్ల నడుమ పిచ్చిమొక్కలు, మురుగుకాల్వల్లో పూడిక తొలగించేందుకు నగరపాలిక/పురపాలిక, గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి. ఇంటా, బయట పారిశుద్ధ్య చర్యలపై ప్రజలు దృష్టి సారించాలి.

# జనమే బలం.. నిరూపించాలి మనం..!

కొత్తగూడెం: కొన్నేళ్లుగా దక్షణాది రాష్ట్రాల్లో జనాభాను పెంచటంపై జోరుగా చర్చ సాగుతోంది. ఆర్థికాభివృద్ధికి అధిక జనాభా ఆటంకం అనే భావన నుంచి అభిలషణీయమైన జనాభా పెరుగుదల అభివృద్ధికి ఊతమనే వాదన తెరపైకి వచ్చింది. జనాభాను నియంత్రించటమనేది రాజకీయంగానే కాకుండా ఆయా ప్రాంతాల ప్రగతి కారకాలపై ప్రభావం చూపుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతంలో జనాభా నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాయి. 'ఒక్కరు ముద్దు, ఇద్దరు హద్దు.. ముగ్గురు వద్దు' అంటూ భారత్ చాలా ఏళ్లుగా నినదిస్తోంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు ప్రస్తుతం అధిక మంది యువతతో అభివృద్ధిలో దూసుకుపోతున్నప్పటికీ సంతానోత్పత్తి రేటు క్షీణిస్తుండటం పెనుసవాల్‌గా మారనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాలక్రమేణా వృద్ధుల సంఖ్య పెరిగి, యువత శాతం క్షీణిస్తుందని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితులు ఎదురుకావటం వల్లే అనేక దశాబ్దాల పాటు పాటించిన ఏక సంతానం నిబంధనను చైనా తొలగించిందని గుర్తుచేస్తున్నారు. దృష్టిసారిస్తేనే మనుగడప్రభుత్వాలు జనాభా పెరుగుదలను ప్రోత్సహించాలని చెబుతున్నా.. జీవన వ్యయాలకు జడిసి చాలా జంటలు ఒకరికి మించి కనే ధైర్యం చేయలేకపోతున్నాయి. ఇందుకు నిరుద్యోగం ప్రధాన సమస్యగా మారుతోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ప్రస్తుతం 40శాతానికి పైగా జనాభా వయస్సు 35ఏళ్ల లోపే. వీరందరినీ మేలిమి మానవ వనరులుగా తీర్చిదిద్దటంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. యువతలో నైపుణ్యాలను ఇతోధికం చేయాలి. అప్పుడే భారీ జన సంఖ్య జిల్లాలకు నిజమైన శక్తిగా నిలుస్తుంది. కలవరపరుస్తున్న జననాల రేటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గడిచిన నాలుగు దశాబ్దాలతో పోల్చితే జననాల రేటు భారీగా తగ్గినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 1971-81 మధ్య 27.88శాతం ఉన్న జనాభా వృద్ధి రేటు 2011-21 మధ్య 6.87శాతానికి పడిపోయింది. 2031 నాటికి 3శాతానికి పరిమితమవుతుందని అంచనా. సంతానోత్పత్తి రేటు కలవరపరుస్తోంది. 1971లో 5 శాతంగా ఉన్న టీఎఫ్ఆర్(టోటల్ ఫర్టిలిటీ, 1.8శాతానికి తగ్గింది.

# రాయితీ యంత్రం వైపు..రైతు నేత్రం

నల్గొండ : రాయితీ వ్యవసాయ యంత్ర పరికరాల పథకానికి పలువురు దరఖాస్తు చేసినా.. నేటికీ అవి అందలేదు. ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా 2.63 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు. నల్గొండ జిల్లాలో ప్రచారం కొరవడటం, గడువు తక్కువగా ఉండటంతో అధిక సంఖ్యలో రైతులు అర్జీలు సమర్పించలేకపోయారు. త్వరలో వానాకాలం పంటలు మొదలుకానున్న నేపథ్యంలో అన్నదాతలు రాయితీ పరికరాల కోసం ఎదురు చూసున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరోసారి దరఖాస్తులకు అవకాశం కల్పించడటంతో పాటు గతేడాది మంజూరు చేసిన నిధులకు ఈ సంవత్సరం అదనంగా కేటాయిస్తే ఎక్కువ మంది రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

2024-25 సంవత్సరానికి సంబంధించి రాయితీ వ్యవసాయ పరికరాల కోసం నల్గొండ జిల్లాలో 820 యూనిట్లకు రూ.1.80 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటి మంజూరుకు అర్హులైన మహిళా రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలిచ్చింది. ఏఈవోల ద్వారా తీసుకున్నారు. అంతలోనే ఆర్థిక సంవత్సరం ముగియడంతో నిధులు వెనక్కివెళ్లాయి. గత ప్రభుత్వం హయాంలో ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 50 శాతం రాయితీపై పరికరాలు అందేవి. నిధుల కొరత



వల్ల ఈ పథకం ఆగిపోయింది. యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని పునరుద్ధరించాలని ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించింది. రాయితీతో వ్యవసాయ సంబంధ యంత్రాలు, పరికరాలు అందించాలని భావించింది. కానీ నిధులు మంజూరు కాకపోవడంతో రైతులంతా వాటికోసం ఎదురు చూస్తున్నారు.

పవర్ స్ప్రేయర్లు, పవర్ టిల్లరు, డ్రోన్లు, రోటోవేటర్లు, పవర్ వీడర్స్, బ్రష్‌కట్టర్స్, ట్రాక్టర్లు, విత్తనాల, ఎరువుల వేసే యంత్రాలు, దమ్ము, బోదలు చేసే పరికరాలు, బ్యాటరీ స్ప్రేయర్ యంత్రాలను ప్రభుత్వం రాయితీపై అందించనుంది. యంత్ర పరికరాల కోసం మహిళా రైతుల నుంచి దరఖాస్తులు ఏఈవోల స్థాయిలో తీసుకున్నారు. ఆర్థిక సంవత్సరం ముగియడంతో దరఖాస్తులు వారి వద్దనే ఉన్నాయి. రైతులు మాత్రం యంత్రపరికరాల కోసం ఎదురు చూస్తున్నారు. మంజూరు అయిన యంత్ర పరికరాలను డీలర్లు అప్పటికే తయారు చేసి పెట్టారు. జిల్లాలో సుమారు 1500 మంది మహిళా రైతులు దరఖాస్తులు చేసుకున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

**నిధులు రాగానే..** మార్చిలో రాయితీ యంత్ర పరికరాల కోసం మహిళ రైతుల నుంచి దరఖాస్తులు ఏఈవోల ద్వారా తీసుకున్నాం. వాటికి నిధులు రాగానే పంపిణీ చేస్తాం. పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

# నిధులందవు.. నిర్మాణాలు సాగవు

ధర్మపురి: గతంలో ఈ రహదారిని సీసీ రోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదించగా.. రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే కేవలం 15 శాతమే పనులు పూర్తయ్యాయి. రోడ్డు పక్కన తవ్వి వదిలేయడంతో ఆసుపత్రికి వెళ్లే రోగులు, నది స్నానానికి వెళ్లే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇదేకాక ధర్మపురి పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పలు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో స్థానికులు తమ ఇంటి ఎదుట కంకరతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి మీదుగా వెళ్లే రహదారిపై వేలాది భక్తుల వాహనాలు గోదావరికి వెళ్తుంటాయి.

**భక్తుల ఇబ్బందులు**

పట్టణంలోని తెనుగువాడ నుంచి బ్రాహ్మణసంఘం వరకు రెండు వరుసల రహదారి నిర్మాణానికి రూ.1.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 280 మీటర్ల వెడల్పుతో రెండు వైపులా మురుగు కాలువలు నిర్మించగా.. రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఎక్కువగా వాహనాలు ఇదే రహదారి నుంచి బ్రాహ్మణసంఘం, దేవస్థానం వరకు పెద్దఎత్తున వెళ్తుంటాయి. రహదారి నిర్మాణం ఆగిపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



**ప్రమాదకరంగా..**

అంబేద్కర్ కూడలి నుంచి అక్కపల్లి దేవస్థానం వరకు రోడ్డు వేసేందుకు రూ.కోటి నిధులు మంజూరు చేశారు. రెండు చోట్ల కల్వర్టులు నిర్మించారు. కేవలం 30 శాతం పనులు పూర్తవగా, మిగతావి నిలిచిపోయాయి. ఏడాదికిపైగా కంకర తేలి ఆయా కాలనీ ప్రజలకు అసౌకర్యంగా ఉంది.

**కంకర పోసి.. వదిలేసి**

పట్టణంలోని వివేకానంద కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నాలుగు వరుసల రహదారి ఏర్పాటుచేసి, మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించగా.. దీనికి రూ.6 కోట్ల నిధులు గతంలో మంజూరు చేశారు. అయితే రెండు వైపులా కంకర పోసి నిధులు విడుదల కాక వదిలేశారు. దీంతో రహదారి ప్రమాదకరంగా మారింది. అర్ధాంతరంగా నిలిచిన పనులను వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**ప్రతిపాదనలు పంపించాం**

నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. వీటిని పూర్తి చేసేందుకు మళ్లీ ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల కాగానే పనులు చేపడతాం. రాజశేఖర్, పురపాలక కమిషనర్ ధర్మపురి

# ‘శిక్షణ’ వరం.. ఉపాధికి ఊతం

వికారాబాద్ : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ వరంగా మారింది. ఏదో ఒక పరిశ్రమలో ఉపాధి పొందేందుకు ఈ శిక్షణ దోహదపడుతుంది. లేదంటే సొంతంగా ఏర్పాటు చేసుకొని పలువురికి ఉపాధి చూపొచ్చు. జిల్లాలో వికారాబాద్, తాండూరు, మర్పల్లిలో ప్రభుత్వ ఐటీఐలున్నాయి. తాండూరు, వికారాబాద్‌లో ప్రైవేటువీ కొనసాగుతున్నాయి. ఇవే కాకుండా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ) ఏర్పాటుకు భవనాలు నిర్మిస్తున్నారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తే ఐటీఐలో సీటు కేటాయిస్తారు.

**90 శాతం హాజరు తప్పనిసరి..**

ఐటీఐలో శిక్షణ పొందే విద్యార్థులు తప్పనిసరిగా 90 శాతం హాజరు ఉండాల్సిందే. విద్యార్థులతోపాటు శిక్షకులు, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలోని వికారాబాద్, మర్పల్లి, తాండూరులో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. మూడు ప్రాంతాల్లో దాదాపు భవన నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఈ కేంద్రాలను ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించొచ్చని అంటున్నారు.



**అందిస్తున్న కోర్సులు..**

వికారాబాద్, మర్పల్లి ఐటీఐలలో ఫిట్టర్, కోపా, దుస్తుల తయారీ, వెల్డర్, టర్నర్, మోటారు మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఎలక్ట్రీషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ రెండు కేంద్రాల్లో కలిపి సుమారు 400 సీట్లు ఉన్నాయి.

**సద్వినియోగం చేసుకోవాలి..**

ఐటీఐ శిక్షణ పొందిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువే. ప్రతి పరిశ్రమలో వారి అవసరముంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఆర్.నరేందర్‌బాబు, ప్రిన్సిపల్, ఐటీఐ, వికారాబాద్.

**26 వరకు దరఖాస్తులకు అవకాశం..**

ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మొదటి విడత ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశముంది. 2025–26 విద్యాసంవత్సరం, రెండేళ్ల కోర్సుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 10, 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఐటీఐ.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను తెరిచి అందులో వివరాలను నమోదు చేసుకోవాలి. అన్ని నిజ ధ్రువపత్రాలను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో ఉంచాలి. ఇతర సమాచారం కోసం 9177472488, 8555865421 నంబర్లలో సంప్రదించాలని అధికారులు తెలిపారు.

# విద్యుత్తు పాశాలు

జగిత్యాల :మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లోని ఓ వీధిలో నివాసముంటున్న పాండ్రవీసం లక్ష్మి ఇంటిపై చేతికందే ఎత్తులో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా కొంత మేర సరిచేసినా లాభం లేకుండా పోయింది. ఇంటిపైకి చిన్న పిల్లలను వెళ్లనివ్వడం లేదని, పెద్దలు ఎవరూ వెళ్లినా ముందుగానే హెచ్చరించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో వెల్లుల్ల వైపు వెళ్లే ప్రధాన రహదారిలో సుతారి నవీన్ ఇంటిని తాకుతూ విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. తీగలను పక్కకు జరిపేందుకు అయ్యే ఖర్చులు భరించాలని విద్యుత్తు అధికారులు చెబుతున్నారని కుటుంబసభ్యులు వాపోయారు. జగిత్యాల గ్రామీణ మండలం గుల్లపేటలో పోచమ్మ ఆలయం వద్ద విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. ఇప్పటికే పశువులకు ప్రమాదాలు జరిగాయి. నియంత్రిక చుట్టూ రక్షణ చర్యలు చేపట్టలేదు. విద్యుత్తు నియంత్రికను మార్చాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటంలేదని స్థానికులు వాపోయారు. జిల్లాలో ఒక్క బండ లింగాపూర్‌లోనే కాదు గ్రామాలు, పట్టణాల్లోనూ విద్యుత్తు తీగలు, స్తంభాలు, నియంత్రికలు ప్రమాదకరంగా ఉన్నాయి. నివాస సముదాయాలు, వ్యవసాయ పొలాల్లో వంగిన స్తంభాలు, చేతికందే ఎత్తులో వేలాడుతున్న తీగలు, రక్షణ లేని



నియంత్రికలు ఉన్నా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు చేపట్టడం లేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలో 321,776 గృహ కనెక్షన్లు ఉండగా 1,33,880 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. గ్రామాలు, పట్టణాల్లో ఫిర్యాదులు వచ్చినప్పుడు సరి చేస్తున్నా పొలాల్లో మాత్రం పట్టించుకోవటంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలంలో విద్యుత్తు ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. వ్యవసాయ పొలాల్లో వంగిన స్తంభాలు, వేలాడుతున్న తీగలు ట్రాక్టర్లు, ఇతర వాహనాలకు తాకి ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. ఇన్సులేటర్లు దెబ్బతిని విద్యుత్తు సరఫరాఅయి ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. గాలికి స్తంభాలు వంగిపోయి కిందపడిపోయే అవకాశం ఉంది. వేలాడుతున్న తీగలు, దెబ్బతిన్న ఇన్సులేటర్లను మార్చాల్సిన అవసరం ఉంది. లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు ప్రతి లైన్‌ను సరిచేయాల్సిన అవసరం ఉంది. శాఖలో సిబ్బంది కొరతతో ఉన్న వారితోనే వెళ్లతీస్తున్నారు. చాలా సార్లు ఫిర్యాదులు చేసిన వారి సమస్యలు పరిష్కరిస్తుండగా వాటిని అలాగే వదిలేస్తున్నారు.

**ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తాం: సాలియా నాయక్, ఎస్ఈ**

జిల్లాలో ఫిర్యాదులు వచ్చిన వాటిని వెంటనే పరిశీలన చేసి సరిచేస్తున్నాం. స్తంభాలు, తీగలు, నియంత్రికలు ప్రమాదకరంగా ఉన్న చోట సరి చేయాలని సిబ్బంది, అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. కాల్ సెంటర్‌కు, అధికారులకు ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తాం. వ్యవసాయ పొలాల్లో పరిశీలించి సరిచేయిస్తాం.

# లోటు వర్షపాతం.. రైతుకు అశనిపాతం



కరీంనగర్ : సాఫీగా సాగాల్సిన వానాకాలం సాగు నెమ్మదించింది. మే నెలలోనే ఊరించిన వానలు ఇప్పుడు ముఖం చాటేశాయి. సమృద్ధిగా కురుస్తాయన్న వాతావరణ శాఖ అంచనాలు తలకిందులవుతున్నాయి. ఇప్పటికీ జిల్లాలో ఒక్క పెద్ద వాన పడకపోవడంతో చెరువులు, కుంటల్లో నీరు చేరలేదు. భూగర్భ జలాలు పైకి వచ్చింది లేదు. ముందుగా పడిన వర్షాలను చూసి పత్తి విత్తనాలు వేసిన రైతులు దిగాలు చెందుతున్నారు.

నల్లరేగడి భూముల్లో ఉండే తేమ శాతంతో చాలా చోట్ల పత్తి విత్తనాలు మొలకెత్తాయి. కానీ కొన్ని చౌక భూముల్లో మాత్రం మొలకెత్తలేదు. నాట్లు ఆలస్యం కావడంతో వరి ముదురు దశకు చేరింది. ఈ నెలాఖరు వరకు దుక్కి దున్ని నాట్లు పడితే తప్పా నారు ఉపయోగపడని పరిస్థితి ఉంది. కర్షకులకు ప్రతి రోజు ఆకాశం వంక ఆశగా ఎదురుచూపులే మిగిలాయి. బావులు, బోర్లలో నీరు అందుబాటులో ఉన్న వాళ్లు సాగు మొదలుపెట్టారు.

**ఇప్పటికీ సాగైంది..**

ఈ వానాకాలంలో 2,76,500 ఎకరాల్లో వరి సాగు చేస్తారని అంచనా వేయగా, ప్రస్తుతానికి 38,459 ఎకరాల్లో మాత్రమే సాగు అయింది. పత్తి 48 వేల ఎకరాల అంచనాకుగాను 35,361 ఎకరాల్లో ఇప్పటికే సాగు చేశారు. వరి అంచనాలు అందుకోవాలంటే చెరువులు, కుంటల్లో నీరు చేరాలి. ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు పెరగాలి.

గతేడాది జూన్ 1 నుంచి జులై 10 వరకు సాధారణ వర్షపాతం కంటే 32 శాతం అధికంగా నమోదు కాగా, ఈ ఏడాది 19 శాతం తక్కువ నమోదైంది. గన్నేరువరం, చిగురుమామిడి, సైదాపూర్, శంకరపట్నం, హుజూరాబాద్ మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదు కాగా, మిగిలిన అన్ని మండలాల్లో సాధారణం కన్న తక్కువ వర్షపాతం నమోదైంది.

రైతులు ఆందోళన చెందొద్దు

వర్షాల ఆలస్యంతో రైతులు ఆందోళన చెందొద్దు. ఈ నెలలో మంచి వానలు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ నెలాఖరు వరకు వరి నాట్లు వేసినా పంట దిగుబడి తగ్గదు. ఇంకా ఆలస్యం అయితే స్వల్పకాలిక వరి నాట్లకు సిద్ధంగా ఉండాలి.జె.భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

# మొక్క.. నాటేందుకు ఓ లెక్క



కరీంనగర్ : వర్షాకాలం రానే వచ్చింది.. మొక్కలు నాటేందుకు సమయం వచ్చింది. తీరొక్క మొక్క నాటి రక్షించేందుకు ప్రతి ఒక్కరూ కదిలి రావాలి. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 7 నుంచి వన మహోత్సవం ప్రారంభించారు. కరీంనగర్ నగరంతోపాటు మిగతా పురపాలికల్లో ఇంటికి ఆరు మొక్కలు అందించేలా ప్రణాళికలు చేశారు. ఇందులో మూడు పండ్లు, మూడు పూల మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఎక్కడెక్కడ ఎలాంటి మొక్కలు నాటాలి. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపై ‘న్యూస్‌టుడే’ ప్రత్యేక కథనం..

**ఎక్కడ, ఎలాంటివి నాటాలంటే..**

ఇంటి ఆవరణ: మునగ, ఉసిరి, పనస, మామిడి, చింత, వేప, నిమ్మ, జామ, బొప్పాయి, దానిమ్మ, సపోట, కరివేపాకు, మందారం, సీతాఫలం.

కాలనీలు: టెకోమా, సీమ, తంగెడు, గుల్ మొహర్, వేప

చెరువుల వద్ద: నల్ల తుమ్మ, ఈత, తెల్లమద్ది, నేరేడు, వెదురు.

గుట్టలు: నెమలినార, కానుగ, సీమారుబా, వెలగ, నీరుద్ది.

రహదారికి ఇరువైపులా: గుల్ మొహర్, సీమ తంగెడు, రావి, కానుగ, వేప, నేరేడు, ఆకాశ మల్లే, పెల్టోఫాం, టేకు.

చేను గట్లు: టేకు, వెదురు, నీలగిరి, బ్లైరిసిడియా, సుబాబుల్, జామాయిల్, ఎర్ర చందనం.

పరిశ్రమల ఆవరణ: నెమలినార, మామిడి, కానుగ, వేప, సీమచింత, రావి, మర్రి, నేరేడు, సిస్సు, గుల్‌మొహర్, టేకు.

కార్యాలయాలు: వేప, నేరేడు, తంగేడు, టేకు, మామిడి.

**ఇలా చేస్తే మేలు..**

సంచి పరిమాణాన్ని దృష్టిలో ఉంచుకొని గుంత తవ్వాలి.

సారవంతమైన మట్టి, పశువుల ఎరువు లేదా డీఏపీ 2:1 నిష్పత్తిలో కలిపి సగం గుంత నింపి నీళ్లు పోయాలి.

మరుసటి రోజు వేపపిండితో గుంతను శుద్ధి చేస్తే మొక్క పురుగు పట్టకుండా ఉంటుంది.

సంచి నుంచి మొక్కను వేరు చేసి సగం మట్టి నింపిన గుంతలో పెట్టి పూడ్చాలి.

మొక్క వేళ్లకు బయటి గాలి తగలకుండా గుంత చుట్టూ గట్టిగా తొక్కాలి.

రహదారుల పక్కన నాటే వాటికి మధ్య దూరం 5, కాలనీల్లో నాటే వాటికి 3, పొదవుగా పెరిగే వాటికి 2 మీటర్ల వ్యత్యాసం ఉండాలి.

మూగజీవాల నుంచి రక్షణకు కంచె ఏర్పాటు చేయాలి.

చెట్ల కింద, విద్యుత్తు తీగల కింద నాటొద్దు.

చవుడు భూమిలో టేకు, వెదురు నాటితే చనిపోయే ప్రమాదముంది.

# మధ్యతరగతికి సన్నబియ్యం దన్ను



పెద్దపల్లి : రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీతో బహిరంగ మార్కెట్లో ధరలు తగ్గి కొనుగోలుదారులకు ఊరట కలుగుతోంది. జూన్ నుంచి క్రమంగా తగ్గుతున్న బియ్యం ధరలు జులై మొదటి వారం నాటికి భారీగా తగ్గాయి. నెల రోజుల వ్యవధిలో క్వింటాలు బియ్యం ధర రూ.200 నుంచి రూ.500 వరకు పడిపోయింది. ప్రధానంగా ‘సాంబా’ రకం బియ్యం ధర క్వింటాలుకు రూ.500 వరకు తగ్గింది. తగ్గిన బియ్యం ధరలతో మధ్య తరగతి ప్రజలకు మేలు కలగనుంది.

**పదిశాతం పడిపోయిన కొనుగోళ్లు**

ఉమ్మడి జిల్లాలో సుమారు 10 లక్షల రేషన్ కార్డులుండగా గత నెలలో మూడు నెలలకు సరిపడా 5,472 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేశారు. దీంతో ఒక్కో కుటుంబానికి కనీసం రెండు నెలలకు సరిపడా బియ్యం ఇంటికి చేరుకున్నాయి. రేషన్ కార్డులు లేని మరో రెండు లక్షల కుటుంబాలున్నాయి. ప్రస్తుతం వీరు మాత్రమే బహిరంగ మార్కెట్‌లో బియ్యం కొనుగోలు చేస్తుండగా వీరికి ఒక నెలలో సమారు 600 మెట్రిక్ టన్నులు (సుమారు 60 లారీలు) బియ్యం మాత్రమే సరిపోతాయి. కానీ సరఫరా మాత్రం 2 నుంచి 3వేల మెట్రిక్ టన్నుల వరకు ఉంటుంది. అవసరాన్ని బట్టి మరింత పెరిగే అవకాశముంది. డిమాండ్ సప్లయి సూత్రం తిరగబడటంతో బియ్యం ధరలు తగ్గాయి. దీనికి తోడు సన్న బియ్యానికి పొరుగు రాష్ట్రాల్లో గిరాకీ లేకపోవడం కూడా ధరలు పడిపోవడానికి మరో కారణం.

బియ్యం ధరలు పడిపోవడంతో వ్యాపారులు బియ్యం నాణ్యతపై దృష్టిపెట్టారు. ప్రజా పంపిణీ ద్వారా ప్రభుత్వం ఇచ్చే బియ్యంలో 20 నుంచి 30 శాతం వరకు నూక, ఇతర వ్యర్థాలు ఉండటంతో బహిరంగ మార్కెట్‌లోని వ్యాపారులు నూరుశాతం నూక లేని బియ్యంతోపాటు పొట్టు, దుమ్ము లేని బియ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ రకంగానూ కొనుగోలుదారులకు మేలు కలుగుతోంది.

# పారిశుద్ధ్యం.. పర్యవేక్షణ భారం

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ భారంగా మారుతోంది. గతంలో ఉన్న 50 డివిజన్లను 60 డివిజన్లకు పెంచారు. ఆ తర్వాత 66 డివిజన్లుగా మార్చడంతో పారిశుద్ధ్య కార్మికులు సంఖ్య కూడా పెరిగింది. డివిజన్ల వారీగా ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఉన్నారు. అయితే వీరందరితో పనులు చేయించడానికి పారిశుద్ధ్య పర్యవేక్షకులు తప్పనిసరిగా ఉండాలి. జవాన్లకు పెత్తనం ఇవ్వడం, ఇన్‌స్పెక్టర్ల విధులను నామమాత్రం చేయడంతో క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణ భారమవుతోంది. కార్మికులకు బాధ్యతలు అప్పగించడంతో పట్టింపు లేకుండా పోతోంది. శుభ్రం చేయడంతోపాటు పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. ప్రధాన రహదారులు, వీధులు తప్ప శివారు కాలనీల్లో శుభ్రం చేసేందుకు కార్మికులు కనిపించడంలేదనే ఫిర్యాదులు వస్తున్నాయి.

**ఇన్‌ఛార్జులతోనే..**

నగర పరిధిలో అయిదు చొప్పున శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండేళ్లుగా పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఇన్‌ఛార్జులతోనే నెట్టుకొస్తున్నారు. ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న పర్యావరణ ఇంజినీర్లు, పశు వైద్యాధికారికి బాధ్యతలు అప్పగించారు. పెరిగిన డివిజన్లలో కార్మికులు ఎంతమేర పని చేస్తున్నారో గుర్తించడం కష్టంగా మారుతోంది. జవాన్లకు కూడా ఈ విషయంలో స్పష్టత లేదు. పర్యవేక్షణ లేకపోవడంతో పలువురు కార్మికులు నామమాత్రంగా పనిగంటలు ముగిస్తే చాలన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

**ఆరోగ్య అధికారి ఎక్కడ?**

పారిశుద్ధ్య విభాగానికి ఆరోగ్య అధికారి (ఎంహెచ్‌వో) కీలకం. 20 ఏళ్లుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో మాంసం దుకాణాలు, హోటళ్లు, ఇతరత్రా శుభ్రత చర్యలు పరిశీలించే అధికారి కొరత కనిపిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పరిశీలించి ఖాళీగా ఉన్న శానిటరీ సూపర్‌వైజర్ పోస్టులతోపాటు ఎంహెచ్‌వోను తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు.

# ఉపాధి తోడుగా.. కష్టాలు తీరగా

సారంగాపూర్: జిల్లాలో ఉపాధిహామీ ద్వారా పశువుల పాక, కోళ్ల షెడ్లు, గొర్రెలపాకలు, వర్మీ కంపోస్టు, నీటి నిల్వ గుంతలు, భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు, పొలం బాటలు తదితర అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. జిల్లాలో పశువుల పాకలు 769, కోళ్ల షెడ్లు 386 ఏర్పాటుకు లక్ష్యం నిర్దేశించారు. వర్మీ కంపోస్టు నిర్మాణాలు 193, అజోలా ఎరువు తయారీ గుంతలు 193, ఫారంపాండ్‌లు 386 లక్ష్యాన్ని నిర్దేశించగా పనులు కొనసాగుతున్నాయి.పాకల నిర్మాణాలపై అవగాహన

జిల్లాలో వివిధ రకాల పశువులు, గొర్రెలు, కోళ్ల పాకల నిర్మాణాలపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. పశువుల పాకకు రూ.85,000 చెల్లిస్తుండగా 18ఐ16 ఫీట్ల పొడవు, వెడల్పుతో నిర్మించుకోవాల్సి ఉంటుంది. గొర్రెల పాకకు రూ.లక్ష చెల్లిస్తుండగా 21ఐ16తో, కోళ్ల షెడ్డుకు రూ.3 లక్షలుకాగా 50ఐ16 పొడవు, వెడల్పుతో నిర్మించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం పశువుల పాకలు 769 లక్ష్యంకాగా 726 మంజూరు చేయగా 43 నిర్మాణాలు సాగుతున్నాయి. కోళ్ల షెడ్ల నిర్మాణాల కోసం 386 లక్ష్యాన్ని నిర్దేశించగా 363 మంజూరు చేయగా 19 నిర్మాణాలు, గొర్రెల షెడ్లు 91 మంజూరుకాగా 68 నిర్మాణాలు కొనసాగుతున్నాయి. 193 మంది రైతులకు వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ గుంతలు నిర్మించాలని భావించగా 167 నిర్మాణాలు మంజూరు చేశారు. ఒక్కో నిర్మాణానికి రూ.12,500, అజోలా తయారు చేసే గుంత నిర్మాణానికి రూ.6 వేలు చెల్లించనున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఆయా నిర్మాణాలు చేపట్టేలా ఉపాధి సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

**భూగర్భ జలాల పెంపుపై దృష్టి**

భూగర్భ జలాల పెంపునకు ఉపాధిహామీ పనుల ద్వారా పలు



నిర్మాణాలు చేపడుతున్నారు. రూ.4.50 లక్షలతో పర్క్‌లేషన్ ట్యాంకు నిర్మాణాలను పూర్తిగా కూలీల ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 96 నిర్మాణాలు లక్ష్యంకాగా 88 నిర్మాణాలు మంజూరు చేయగా పనులు కొనసాగిస్తున్నారు. 1,922 ఇంకుడు గుంతల నిర్మాణాలు లక్ష్యంకాగా 410 ప్రగతిలో ఉన్నాయి. రైతుల పంట పొలాలకు వెళ్లే రహదారుల నిర్మాణాలు చేపడుతుండగా ప్రతీ మండలానికి 10 కిలోమీటర్ల చొప్పున నిర్మించాలని లక్ష్యాన్ని నిర్దేశించగా ప్రస్తుతం 764 కి.మీ. మేర రహదారులు పూర్తి చేశారు.

**కూలీలకు ఉపాధి..**

ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు అవసరమైన కోళ్లు, పశువులు, గొర్రెల షెడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. భూగర్భ జలాల పెంపునకు చేపట్టిన పనులు కొనసాగిస్తుండగా దీని ద్వారా కూలీలకు ఉపాధి లభిస్తుంది. రైతుల పంట పొలాలకు రహదారుల నిర్మాణాలు చేపడుతున్నారు.శివప్రసాద్, సాంకేతిక సహాయకుడు

# ఆహారశుద్ధి.. అతివల ఆర్థిక వృద్ధి

సంగారెడ్డి టౌన్: పొదుపులు.. బ్యాంకు రుణాలు.. వాయిదాల చెల్లింపులు.. మహిళా సంఘాలు అంటే గుర్తుకు వచ్చేవి ఇవే. ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కాలన్న లక్ష్యంతో మహిళలు పొదుపు సంఘాల్లో చేరుతున్నా ఆశించిన స్థాయిలో స్థితిగతుల మారడం లేదు. బ్యాంకు రుణాలు అంతంతమాత్రంగా ఉండటంతో స్వయం ఉపాధికి బాటలు వేసుకోలేకపోతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటు దిశగా వారిని అడుగులు వేయించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) నిర్ణయించింది. ఇందుకోసం రాయితీ రుణాలు మంజూరు చేస్తున్నారు.

**లక్ష్యం 100 యూనిట్లు**

జిల్లాలో మిరప, పసుపు, పప్పు మిల్లులు, పాలపదార్థాల ఉత్పత్తి, చిరుధాన్యాలు, నూనె, చిన్న రైస్‌మిల్లులు, పాపడాలు, పచ్చళ్లు తదితర యూనిట్లతో మహిళలు ఇప్పటికే ఉపాధి పొందుతున్నారు. పీఎం ఫార్మలేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రెన్యూర్ స్కీమ్(పీఎంఎఫ్ఎంఈ) పథకం కింద రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్నారు. దీనివల్ల యూనిట్ల విస్తరణకు మార్గం సుగమం అవుతోంది. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 100 యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. ఎంపికైన యూనిట్లకు 35 శాతం రాయితీపై రుణాలు మంజూరు చేయనున్నారు.

**నాణ్యమైన ఉత్పత్తుల కోసం..**

మహిళా సంఘాలకు చెందిన సభ్యుల్లో కొందరు ఇప్పటికే ఆహార సంబంధిత రంగంలో ఉపాధి పొందుతుండగా ఆహారశుద్ధి యూనిట్ల విస్తరణకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించనుంది. తద్వారా మరింత మంది మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించనున్నారు. నాణ్యతకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. యూనిట్ల విస్తరణకు అవసరమైన సాంకేతిక, ఆర్థికపరంగా సాయం అందించనున్నారు. శిక్షణ ఇవ్వడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు మహిళా సంఘాల ద్వారా వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి.

**సద్వినియోగంతో సత్ఫలితాలు**

జంగారెడ్డి, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి

ఆహారశుద్ధి యూనిట్లతో మహిళా సంఘాల సభ్యులకు ప్రయోజనం ఉంటుంది. యూనిట్ల విస్తరణతో మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుంటుంది. వినియోగదారులకు కల్తీలేని ఆహార ఉత్పత్తులు అందించినట్లు అవుతుంది. మహిళా సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎంపిక చేసిన మహిళా సంఘాల సభ్యులకు రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేయించడంతోపాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 695

మహిళా సంఘాలు: 18,213

ఆయా సంఘాల్లో సభ్యులు: 1.90లక్షల మంది

చురకలు



# రైల్వే గేటు.. తప్పని పాట్లు

హైదరాబాద్ : అధునాతన హంగులతో రైల్వేస్టేషన్ల ఆధునీకరణ జరుగుతున్నా రైల్వే క్రాసింగ్‌ల వద్ద వాహనదారులకు పడిగాపులు తప్పడం లేదు. గేటు పడిందంటే సహనానికి పరీక్షే. ప్రతిపాదనలు సిద్ధం చేసినా నిధుల మంజూరు, భూసేకరణలో స్థానికుల నుంచి వ్యతిరేకత, కోర్టు వివాదాలతో పనులు ముందుకు సాగడం లేదు. సుమారు 18 ప్రాంతాల్లో ఆర్‌యూబీలు, ఆర్‌వోబీలు నిర్మించాలి.

**వాహనదారుల అవస్థలు**

సఫిల్‌గూడ వద్ద గేటు పడితే ఆర్‌కేనగర్ అండర్‌పాస్ మీదుగా 2 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. బొల్లారం కావల్రీ బ్యారక్స్ ప్రాంతంలో మూడు లెవల్ క్రాసింగ్‌లతో పాటు అల్వాల్‌లోని లయోలా కాలేజీ సమీపంలోని మరో క్రాసింగ్ వల్ల వాహనదారులు రోజుల్లో 25 సార్లు వేచి ఉండాల్సి వస్తోంది. మేడ్చల్ – గుండ్లపోచంపల్లి మార్గంలోనూ ఇదే పరిస్థితి. ఖైరతాబాద్ రైల్వే గేట్ పడితే వాహనదారులు కనీసం 20 నిముషాలు ఆగాల్సిందే. మెట్రోస్టేషన్ సమీపంలోని ఐసీఐసీఐ బ్యాంకు పక్కనే ఆర్‌యూబీ ఉన్నప్పటికీ ఆ స్థలం ఆక్రమించడం, పలు వివాదాలు ఉండటంతో వాడుకలో లేదు. రాజ్‌భవన్ ఎదురుగా ఉన్న మక్తాకు వెళ్లే దారిలో ఆర్‌వోబీ లేదా ఆర్‌యూబీ నిర్మించాలన్న ప్రతిపాదనలున్నా సాధ్యమయ్యే పని కాదని అధికారులు తేల్చారు. సనత్‌నగర్- అమ్ముగూడ ప్రాంతంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఏళ్లు గడుస్తున్నా మోక్షం కలగలేదు. దయానంద్‌నగర్ – మౌలాలీ మార్గంలో 2019లోనే ఆర్‌వోబీ మం



జూరైంది. రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించకపోవడంతో కాలయాపన జరిగింది. దీంతో 100శాతం ఖర్చు భరిస్తూ పనులు చేపట్టినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

మౌలాలీ యార్డ్ వద్ద ఆర్‌వోబీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉంది.

**ప్రజాప్రతినిధుల సూచనలు..**

ఆర్‌యూబీ అనుమతికి ప్రయత్నిస్తే ఏడాది సమయం పట్టిందని మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి వాపోగా...సనత్‌నగర్ ఫతేనగర్ మధ్య ఉన్న బస్తీవాసులు రైల్వే ట్రాక్‌ను దాటుతూ మృత్యువాత పడుతున్నారని అవసరమైన చోట్ల ఆర్‌యూబీల నిర్మాణం చేపట్టాలని ఎంపీ ఈటల బల్దియాకు సర్వసభ్య సమావేశంలో సూచించారు.

**పరిష్కార మార్గాలివే..**

వాహనదారులకు, ప్రయాణికులకు ఉపయోగపడేలా రైళ్ల రాకపోకలు అనుసంధానించిన రియల్ టైమ్ క్రాసింగ్ స్టేటస్ యాప్‌ను రూపొందించాలి. తద్వారా వాహనదారులు వేచి ఉండే సమయం తగ్గడంతో పాటు ఇంధన పొదుపు ఉంటుందని ఢిల్లీకి చెందిన ఇండియన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ(ఐఎస్‌పీపీ) సూచించింది. రైల్వే ప్రమాదాలను నివారించేందుకు ఆటోమెటిక్ వార్నింగ్ సిస్టమ్‌ను ఉపయోగించి రెడ్‌లైట్ ఫ్లాషింగ్ ద్వారా రైళ్ల రాకపోకలపై పట్టాలు దాటేవారిని అప్రమత్తం చేయొచ్చు.

# నిర్వహణపై నిర్లక్ష్యం

వేములవాడ: ప్రజలు ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ల నిర్వహణపై అధికారుల పట్టింపు కరవైంది. కొన్ని వ్యాయామ పరికరాలు ఊడిపోగా మరికొన్ని వదులుగా మారాయి. మున్సిపల్ అధికారులు మరమ్మతులకు పూనుకోకపోవడం తో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రయోజనమున్నా పట్టింపేదీ?**

పట్టణంలో క్రీడా మైదానాలు లేవు. పట్టణ ప్రజలు నడకకు రెండు బైపాస్ రహదారుల వెంబడి, మండల పరిషత్తు కాంప్లెక్స్ ఆవరణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం ఉపయోగించుకుంటారు. ఇదే ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లను నెలకొల్పడంతో అవి ఉపయోగకరంగా ఉన్నాయి. సెలవు రోజుల్లో మరింత ఎక్కువగా జనం వస్తున్నారు. గుడి చెరువు కట్ట ప్రాంతంలో తొలగించిన జిమ్ పరికరాలను మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఆ పరికరాలను మున్సిపల్ కార్యాలయం వెనుక ప్రాంతంలో ఓ మూలన పడేయంతో తుప్పు పట్టిపోతున్నాయి.

రెండు నెలల క్రితం ఓపెన్ జిమ్‌లో మరమ్మతులు చేసేందుకు తొలగించిన పరికరం ఇప్పటి వరకు బిగించలేదు. మరో పరికరం ఊడి కిందపడింది. ఇప్పటికైనా జిమ్‌ల నిర్వహణపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని..



పట్టణంలో ముఖ్య కూడళ్లలో మరిన్ని ఓపెన్ జిమ్‌లను నెలకొల్పాలని స్థానికులు కోరుతున్నారు. "పరికరాల కాల పరిమితి ముగిసింది. వెల్డింగ్ చేయిస్తున్నప్పటికీ అవి ఊడిపోతున్నాయి. కొత్త పరికరాల బిగించడానికి చర్యలు తీసుకుంటామ"ని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ పేర్కొన్నారు.

**15 రకాల పరికరాలు**

వేములవాడ పట్టణంలో అయిదేళ్ల క్రితం మున్సిపల్ నిధులతో మండల పరిషత్తు కాంప్లెక్స్ ఆవరణలో, బైపాస్ రోడ్డులోని మూలవాగు గంగమ్మ గుడి ప్రాంతంలో, గుడి చెరువు కట్ట ప్రాంతంలోని జగిత్యాల బస్టాప్ కూడలి వద్ద ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో దానిలో దాదాపు 15 రకాల వ్యాయామ పరికరాలను బిగించారు. గుడి చెరువు కట్ట ప్రాంతంలోని జిమ్ పరికరాలను అభివృద్ధి పనుల్లో భాగంగా పూర్తిగా తొలగించారు. మిగతా రెండు ప్రాంతాల్లోని జిమ్‌లు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ వీటి నిర్వహణపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో పరికరాలు మరమ్మతులకు గురవుతుండటంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నాయి. ఎప్పుడు ఏ పరికరం ఊడిపోతుందో తెలియని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# చెంతనే మాటేసి.. జీవితాలను కాటేసి



సికింద్రాబాద్ : నగరంలో విద్యుత్తు తీగలు యమపాశాలుగా మారుతున్నాయి. నిర్వహణ లోపాలకు తోడు గాలివానలకు తీగలు రపీమని తెగిపడుతున్నాయి. సాగర్ రోడ్డు సమీపంలో 11కేవీ తీగ తెగి పాదచారుల బాటపై పడటంతో 11వేల వోల్ట్‌ల విద్యుత్తు ప్రసారమై ఇద్దరు కాలిపోయారు. నగరంలో తరచూ ఈ తరహా ఘటనలు జరుగుతున్నా నిర్వహణపై విద్యుత్తు పంపిణీ సంస్థ దృష్టి పెట్టడం లేదు. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో పరిశీలించగా.. అనేక లోపాలు, సమస్యలు వెలుగుచూశాయి.

నల్లగొండ జిల్లాకు చెందిన రమేష్ సంధ్య దంపతులు 20 ఏళ్లుగా జగద్గిరిగుట్ట శ్రీనివాసనగర్‌లో ఉంటున్నారు. రమేష్ భవన నిర్మాణ కార్మికుడు. పదేళ్ల క్రితం నిర్మాణంలో ఉన్న ఓ భవనంపై పనిచేస్తుండగా విద్యుత్తు తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆసుపత్రిలో చేర్పించగా వైద్యులు అతని రెండు కాళ్లు, చేతులు తొలగించారు.

**ప్రాణాలు బలి..**

కుత్బుల్లాపూర్ పరిధి శివాలయనగర్‌లో ఆరున్నరేళ్ల క్రితం ఏసయ్య(11) 130 కేవీ విద్యుత్తు తీగల కింద ఆడుకుంటున్నాడు. విద్యుదాఘాతంతో ఆ బాలుడు చనిపోయాడు. ఇటీవల ఎంఎస్ మక్తాకు చెందిన 12ఏళ్ల బాలుడు నెక్లెస్ రోడ్డులోని ఈద్గాలో క్రికెట్ ఆడుకుంటూ అక్కడే ఉన్న స్తంభాన్ని పట్టుకుని మృతిచెందాడు. మరో ఘటనలో ఓ మహిళ ఇంటిపై దుస్తులు ఆరేస్తుండగా పైనుంచి వెళ్తున్న హైటెన్షన్ వైర్లు తగిలి మరణించింది.

నాలుగేళ్ల క్రితం జవహర్‌నగర్ అంబేద్కర్‌నగర్ నోబెల్ పాఠశాల వద్ద ఓ వ్యక్తి రేకులు వేస్తుండగా ఎల్‌టీలైను తగిలి అపస్మారకస్థితికి వెళ్లాడు. ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడు.

జవహర్‌నగర్ మల్కారం ప్రాంతంలో ఎనిమిదేళ్ల బాలుడు విద్యుత్తు నియంత్రిక వద్ద తీగలు తగిలి విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాడు. శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన పట్నూరు సత్యనారాయణ బతుకు దెరువు కోసం 18 ఏళ్ల క్రితం నగరానికి వచ్చాడు. గాజులరామారం షాపూర్‌నగర్‌లో ఉంటూ కూలి పనులు చేస్తున్నాడు. 2022 మేలో ఓ దుకాణంపైన బోర్డు ఏర్పాటు చేస్తుండగా విద్యుత్తు తీగలకు తగిలి రెండు చేతులు కాలిపోయాయి.

**అస్తవ్యస్తంగా..**రహదారులపై అడ్డంగా స్తంభాలు, విరిగిన స్తంభాలు, కిందికి వేలాడే తీగలు.. కాలం చెల్లిన కండక్టర్లు.. ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు, సరిగ్గా ఎర్తింగ్ లేని స్తంభాలు, రింగ్ మెయిన్ యూనిట్లు, ఇళ్లపై వేలాడే తీగలు భయపెడుతున్నాయి. వానాకాలం వచ్చిందంటే ప్రమాదం ఏ రూపంలో ముంచుకొస్తుందోనని వణికిపోతున్నారు. ప్రమాదాలను పసిగట్టి స్థానికులు విద్యుత్తు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా స్పందన ఉండటం లేదు. ఎండాకాలం, వానాకాలం ముందు షెడ్యూల్ రూపొందించుకుని నిర్వహణ చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మమ అనిపిస్తున్నారు.

అడ్డదిడ్డంగా లైన్లు..

సాగర్ రోడ్డులో జరిగిన ప్రమాదానికి లారీ స్తంభాన్ని ఢీకొట్టడం అని విద్యుత్తు అధికారులు చెబుతున్నారు. రహదారి మధ్యలోనే చాలాసార్లు స్తంభాలు ఉంటున్నాయి. వీటిని తొలగించడంలో డిస్కం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. విద్యుత్తు లైన్లు లాగేటప్పుడు ఒక ప్రామాణికమైన అలైన్‌మెంట్ లేకుండా.. ఇష్టారీతిగా వేస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా తీగలు లాగకూడదు. కాలనీల్లో పలుచోట్ల ఇలాంటి ఉల్లంఘనలు కనిపిస్తున్నాయి.

**తొలగింపు ఎప్పుడు?**

బస్తీలు, శివార్లలోని పలు కాలనీల్లో జనావాసాల నడమ హైటెన్షన్ తీగలున్నాయి. ఇళ్ల పైనుంచి చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్నాయి. దుస్తులు ఆరేయబోయి, పనులు చేస్తూ, పిల్లలు పతంగులు తీయబోయి ఇలా ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. నగరంలోని ఇళ్లపై విద్యుత్తు తీగల తొలగింపునకు గతంలో సర్వే చేయగా రూ. 250 కోట్లు అవుతుందని తేల్చారు. అంచనాలు పెరిగి ఇప్పుడు ఆ వ్యయం ఆరేడు వందల కోట్లకు చేరిందని అధికారులు చెబుతున్నారు.

**నడవ లేని స్థితిలో....**

సీతారాంబాగ్ న్యూఇంద్రానగర్‌లో తీగలు ఇళ్లపైనుంచి లాగారు. ఏడో తరగతి చదివే సంపత్ గాలిపటం ఎగరేస్తుండగా షాక్‌కొట్టి తొడలు, అవయవాలు కాలిపోయాయి. పైనుంచి పడటంతో తుంటి ఎముక విరిగింది. ఓవర్‌హెడ్ తీగల స్థానంలో ఎయిర్‌బంచ్‌డ్ కేబుల్స్ వేస్తామని అధికారులు హామీ ఇచ్చి మరిచారు.

**తీగలు తెగి పడిన ఘటనల్లో..**

కాటేదాన్ మధుబన్ సమీపంలో 5 నెలల క్రితం నియంత్రిక తీగ తెగి డీసీఎంపై పడింది. డ్రైవర్ మృతి చెందాడు. 2 ఆవులు, 3 మేకలు మృత్యువాత పడ్డాయి.పద్మారావు నగర్‌లో కవర్ కండక్టర్ తెగి ఉదయపు నడకకు వెళ్లిన వ్యక్తిపై పడడంతో చనిపోయాడు.

దుండిగల్ పురపాలికలో రెండు సంవత్సరాల క్రితం మల్లంపేట ఆకాశ్ లేవుట్ సమీపంలో కరెంట్ తీగ రోడ్డుపై పడింది. బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు.

# పల్లె పోరుకు సై..



వికారాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనతో జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కిం ది. ముందుగా జడ్పీటీసీ, ఎంపీటీసీ.. అనంతరం సర్పంచి ఎన్నికలు నిర్వహిస్తామనడంతో ఆశావహులు ఇప్పట్నుంచే దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవడం మొదలైంది. స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడం లేదు. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు రావడంతో నెలాఖరుకు ప్రక్రియ ప్రారంభం కానుందని భావిస్తున్నారు.

**పాతదా.. కొత్త విధానమా?**

జిల్లాలోని 20 మండలాల్లో 2019 జనవరి 21, 25, 28వ తేదీల్లో మూడు దశల్లో పంచాయతీ.. మే 6, 10, 14న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించారు. 2024 ఫిబ్రవరి 1 నుంచి గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండగా, జులై 4న జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం ముగిసింది. రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్ విధానం ఉండేలా గత ఎన్నికల్లోనే నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చింది. తరవాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పాత విధానాన్నే కొనసాగిస్తారా.. ఏవైనా మార్పులు చేస్తారా.. అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. పాత విధానమే అమలు చేస్తే మరోమారు గతంలో ఉన్న వారికి అవకాశాలు లభిస్తాయి. బీసీ ఓటర్ల సంఖ్య పెరగడంతో రిజర్వేషన్లలో మార్పులు చోటుచేసుకునే అవకాశమున్నట్లు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు భావిస్తున్నారు. రెండు మాసాల వ్యవధిలో ప్రాదేశిక, సర్పంచి ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆశావహులు ఇప్పటికే ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

**రైతుల్లో సంతోషం..**

ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందనే సమాచారం అన్నదాతల్లో సంతోషం నింపుతోంది. ఎన్నికలొస్తే రైతు భరోసా అందనుందని వారు చర్చించుకుంటున్నారు. దీనికనుగుణంగానే త్వరలో రైతు భరోసా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం..–జయసుధ, జిల్లా పంచాయతీ అధికారి**


గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్, లెక్కింపు కేంద్రాలు, ఎన్నికల అధికారుల నియామకం తదితర ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నాం.

# మార్పులు, చేర్పులపై ఉత్కంఠ

కరీంనగర్ : ఓ వైపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండగా.. మరో వైపు నగరంలో డివిజన్ల పునర్విభజన ప్రక్రియ పూర్తి కానుంది. ఎలాగైనా మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తారనే సంకేతాలు రావడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో డివిజన్ల పునర్విభజన ముసాయిదా అభ్యంతరాల పరిష్కార గడువు ముగియనుంది. అభ్యంతరాలలో మార్పులు, చేర్పులు ఏవిధంగా ఉంటాయనేది ఆసక్తిగా మారింది.

**ఆందోళనలో ఆశావహులు**

ఒక్కో డివిజన్‌లో పది వరకు ఫిర్యాదులు రాగా వాటన్నింటిని క్షేత్రస్థాయిలో క్షుణ్నంగా పరిశీలించారు. ఓటర్లు, సరిహద్దులు, సామాజిక ఇళ్లు పూర్తిగా మారిపోవడంతో రిజర్వేషన్లు దెబ్బతీస్తాయనే కోణంలో ప్రధాన పార్టీల నాయకులు, మాజీ కార్పొరేటర్లు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగడంతోపాటు జిల్లా కలెక్టర్‌కు, కమిషనర్‌కు ఫిర్యాదులు అందించిన విషయం తెలిసిందే. నగరంలో 60 డివిజన్ల నుంచి 66కు పెరగడంతో పునర్విభజన తప్పనిసరిగా మారింది. అభ్యంతరాలు స్వీకరించడంతో 242 రాగా వీటన్నింటిని క్షేత్రస్థాయిలో ఒకటికి, రెండుసార్లు ఆయా ప్రాంతాలను పరిశీలించి వివరాలు సేకరించారు. కనిష్ఠం, గరిష్ఠంగా పది శాతానికి మించకుండా ఓటర్లు లెక్కల్లోకి తీసుకోవాలని భావిస్తున్నారు.కొత్తగా ఏర్పడిన పది డివిజన్ల నుంచి అసలే అభ్యంతరాలు లేకపోగా, 39 డివిజన్ల నుంచి నామమాత్రంగా, 17 డివిజన్ల నుంచి అత్యధికంగా ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో సామాజిక పరిస్థితులు, ఓటర్లు, ఇళ్ల సంఖ్య, సరిహద్దులు, ఓటర్ల తక్కువ, ఎక్కువ విషయాలను పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం.న్యాయబద్ధంగా



అభ్యంతరాలు పరిశీలించాలని ఇప్పటికే కమిషనర్ ఆదేశించడంతో అదేవిధంగా చేపడుతున్నారు. తాము సూచించినట్లుగా అభ్యంతరాలు పరిష్కారం అవుతాయా? కావా? అనే విషయాలపై ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. చివరి ప్రయత్నంగా పట్టణ ప్రణాళిక, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి పెంచినట్లుగా ప్రచారం జరుగుతుంది.

కొందరు అధికారులు ఈ విషయాలను వింటున్నప్పటికీ.. నిబంధనల ప్రకారం ఏదీ ఎలా ఉంటే అలాగే చేసి చేతులు దులుపుకొనే పనిలో ఉన్నారు.

**నేటితో పరిశీలన పూర్తి**

డివిజన్ల పునర్విభజనపై వచ్చిన అభ్యంతరాలు 5 గంటలకల్లా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత వచ్చిన వాటికి సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈనెల 17 నుంచి 18 వరకు జిల్లా కలెక్టర్ ఆమోదం కోసం పంపిస్తారు. ఆ తర్వాత తుది ప్రకటన జారీ చేస్తారు.

# బైపాస్.. ఇక నిరీక్షణకు చెక్

పెద్దపల్లి: పెద్దపల్లి బైపాస్ నిర్మాణం కాకపోవడంతో.. జిల్లా కేంద్రంలోని కమాన్, కునారం రోడ్డు, బస్టాండ్, మంథని ఆర్వోబీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ కష్టసాధ్యమవుతోంది. నిత్యం రద్దీగా ఉండే రాజీవ్ రహదారిపై రోడ్డు దాటేందుకు నిరీక్షించాల్సి వస్తోంది. ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటుచేసిన సిగ్నల్స్, బారికేడ్స్‌ను వాహనదారులు పట్టించుకోవడంలేదు. ఎట్టకేలకు పుష్కరకాలం తరువాత రూ. 82 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం బైపాస్ నిర్మాణానికి కార్యాచరణ మొదలుపెట్టింది.

**తప్పని ఎదురుచూపులు**

2013లో మొదటి విడతలో పెద్దపల్లి బైపాస్ నిర్మాణానికి రూ. 110 కోట్లు విడుదలయ్యాయి. సర్వే పనులు పూర్తిచేసిన అధికారులు భూసేకరణకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆ సమయానికి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రకటన రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం అధికారంలోకి వచ్చిన పాలకులు పట్టించుకోకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి.

**ఇటీవలి ప్రమాదాలు**

జిల్లా కేంద్రంలో మూడు నెలల క్రితం కోర్టు సమీపంలో వెళుతున్న



మహిళలను కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. గత నెలలో కూనారం కూడలిలో ఓ ద్విచక్ర వాహనదారుడిని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. ఇటీవల కలెక్టరేట్ సమీపంలో ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తి ప్రమాదంలో మృతిచెందాడు.

**15 కిలోమీటర్ల మేర నిర్మాణం**

ప్రస్తుతం పెద్దకాల్వల డిగ్రీ కళాశాల వెనుకవైపు నుంచి హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ పైప్‌లైను మీదుగా.. పెద్దపల్లి, చందపల్లి మినీ హైడల్ వరకు నిర్మించనున్నారు. పైప్‌లైన్ కోసం గతంలో సేకరించిన వంద అడుగుల స్థలంలో.. 40 అడుగులను రోడ్డు నిర్మాణానికి ఇచ్చేందుకు సంబంధిత అధికారులు అంగీకరించారు. మిగతా భూమిని సేకరించాల్సి ఉంది. ఈ మార్గంలో రోడ్డు పొడవు 15 కిలోమీటర్ల వరకు ఉండే అవకాశముంది.

**పాలకుల నిర్లక్ష్యం**

జిల్లా కేంద్రంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత భారాస, ప్రస్తుత కాంగ్రెస్ పాలకులకు దీనిపై చిత్తశుద్ధి లేదు. తప్పని పరిస్థితుల్లో అపసవ్య దిశలో వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల నిర్మాణానికి గతంలో కంటే తక్కువ నిధులు విడుదల చేశారు. రాజ్‌గోపాల్, భాజపా పట్టణాధ్యక్షుడు

**చిత్తశుద్ధి కొరవడింది**

వాహనాల రద్దీతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. బైపాస్ రహదారితో సమస్య తీవ్రత తగ్గుతుంది. నిధుల విడుదల జీవో వచ్చి ఆరు నెలలు గడిచినా.. నిర్మాణానికి సర్వే చేయడంలేదు. పెద్దకల్వల నుంచి నిట్టూరు మీదుగా, పెద్దబొంకూర్ నుంచి చీకురాయి, హన్మంతునిపేట మీదుగా పట్టణానికి ఇరువైపులా రాజీవ్ రహదారిని అనుసంధానం చేసేలా వలయ రోడ్డును నిర్మించాలి.

రాజ్‌కుమార్, భారాస పట్టణాధ్యక్షుడు

# నిబంధనలు అతిక్రమించి.. రోడ్లు ఆక్రమించి

సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణం జిల్లా కేంద్రం అయిన తరువాత జనాభాతోపాటుగా నివాస గృహాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దానికితోడుగా పట్టణంలో బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. ఏ రహదారి చూసినా వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా మారుతోంది. ఈ క్రమంలో మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను ఆక్రమించి ర్యాంపులు నిర్మిస్తున్నారు. దీంతో ఉన్న రోడ్ల విస్తీర్ణం కాస్త కుచించుకుపోయి ఇరుకుగా తయారవుతుండగా రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది.

**పర్యవేక్షణ కరవై..**

సిరిసిల్ల పురపాలికలో దాదాపు 33 వేల నివాసాలు ఉన్నాయి. అధికారులు కొత్త ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇస్తున్నారు కానీ.. మళ్లీ పర్యవేక్షణ చేయడం లేదు. దీంతో ఇంటి యజమానులు నిబంధనలు అతిక్రమించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకరికి మించి మరొకరు ఇంటి ముందున్న రోడ్లను పెద్దమొత్తంలో అక్రమించుకొని మెట్లను లేదా ర్యాంపులను నిర్మించుకుంటూ పోతుండటంతో సమస్య తీవ్రరూపం దాల్చుతోందని



పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఏ వార్డులో చూసినా ఇదే పరిస్థితి దాపురించిందని చెబుతున్నారు. మున్సిపల్ యంత్రాంగం క్షేత్ర స్థాయిల్లో పర్యటించి ఎక్కడికక్కడ శాశ్వత పరిష్కార మార్గాలు చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**నోటీసులు జారీ చేస్తాం** సిరిసిల్ల పట్టణంలోని వీధుల్లో ఇళ్ల యజమానులు మున్సిపల్ రోడ్లను ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా మెట్లు లేదా ర్యాంపులు నిర్మిస్తే ఆ యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. సమస్య నివారణకు తదుపరి శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. వాణి, సిరిసిల్ల మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్

# తొలగించేస్తారు



చిత్తూరు : వైకాపా ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో భారీగా అక్రమాలు జరిగాయి.. ఇళ్ల నిర్మాణాలు జరగకపోయినప్పటికీ అప్పటి వైకాపా నేతల ఆదేశాలతో విద్యుత్తు సంస్థ కోట్లాది రూపాయలు వ్యయం చేసి విద్యుత్తు లైన్లు, నియంత్రికలు అమర్చింది. వైకాపా అంటకాగిన అధికారులు ఈ పనుల్లో కోట్లాది రూపాయల నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా నిరుపయోగంగా ఉన్న నియంత్రికల లెక్క సరిచూసి.. ఇతర ప్రాంతాల్లో అమర్చేందుకు సంస్థ కసరత్తు చేస్తోంది. జిల్లాలోని 535 జగనన్న కాలనీల్లో రూ.252 కోట్లు ఖర్చు చేసి.. ఇష్టానుసారంగా విద్యుత్తు లైన్లు, నియంత్రికలు, పరికరాలు అమర్చారు. ప్రస్తుతం పెద్ద సంఖ్యలో నియంత్రికలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. చాలా కాలనీల్లో పదుల సంఖ్యలో ప్రజలు నివాసం లేనట్లు అధికారుల తనిఖీల్లో తేలింది. ఈ క్రమంలో కొన్ని చోట్ల నియంత్రికలు, విద్యుత్తు తీగలు చోరీకి గురవుతున్నాయి. ఇలాగే వదిలేస్తే కోట్లాది రూపాయలు వెచ్చించి అమర్చిన నియంత్రికలు పనికిరాకుండా పోతాయి. **కొత్త సర్వీసులకు..** జిల్లాలో పలువురు వినియోగదారులు నూతన సర్వీసులు, ఇప్పటికే ఉన్నవాటిపై అదనపు లోడ్ కోసం దరఖాస్తులు పెట్టుకున్నారు. వీటి పరిశీలన అనంతరం అంచనాలు తయారుచేసి ఉన్నతాధికారుల ఆమోదం తీసుకున్నారు. నూతన సర్వీసులు, సరఫరాలో సమస్యల పరిష్కారానికి జగనన్న కాలనీల్లో నిరుపయోగంగా ఉన్న నియంత్రికలు, పరికరాలు అమర్చాలని అధికారులు కసరత్తు మొదలుపెట్టారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

నిరుపయోగంగా ఉన్న నియంత్రికలు, పరికరాలు అవసరమైన ప్రాంతాల్లో అమర్చి వినియోగంలోకి తేవాలనే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో తదుపరి చర్యలు చేపడతాం.

ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ

మొత్తం లేఅవుట్లు: 535

విద్యుత్తు సర్వీసులు: 8,100

లైన్లు, నియంత్రికల ఏర్పాటు ఖర్చు: రూ.252 కోట్లు

# మునక పొలం.. వెనుక బేరం

నందికొట్కూరు : శ్రీశైల జలాశయం వెనుక జలాల్లో 'భూ'పంచాయితీలు తారస్థాయికి చేరాయి. నదిలో నీటి నిల్వ తగ్గడంతో మైదాన ప్రాంతంగా మారింది.. ఒండ్రు మట్టితో కూడుకుని ఉన్న ఆయా భూముల్లో పంటలు సాగు చేసుకొంటున్నారు. పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువగా ఉండటంతో సొంతం చేసుకోవడానికి రైతుల మధ్య పోటీ పెరిగింది. ఈ కారణంగా వారి మధ్య వివాదాలు తలెత్తి ఘర్షణలు జరుగుతున్నాయి. డిమాండ్ పెరగడంతో మరికొందరు అనధికారికంగా పొలాలను విక్రయిస్తున్నారు.

**ఏటూ తేల్చని అధికారులు**

శ్రీశైలం జలాశయం నిర్మాణానికి పూర్వం కొత్తపల్లి మండలంలోని జానాలగూడెం, బలపాలతిప్ప, సిద్ధేశ్వరం గ్రామాల్లో సుమారు 250 కుటుంబాల వారు నివసించే వారు. వీరు 1,300 ఎకరాల భూమిని సాగు చేసుకునే వారు. ముంపు తర్వాత పునరావాస ప్రాంతాల్లో స్థిరపడ్డారు. నీరు తగ్గి తర్వాత పంటలు సాగు చేసుకొంటున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన మరికొందరు ఆయా గ్రామాలకు చేరుకొని అవన్నీ మా భూములే అంటూ పంచాయితీలు చేస్తున్నారు. గతేడాది ఈ అంశం అధికారుల దృష్టికి వెళ్లడంతో 145 సెక్షన్ విధించి సాగు ఆపేశారు. వాటిని నమ్ముకొన్న కుటుంబాలకు జీవనాధారం కరవైంది. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విన్నవిస్తున్నారు.

**అక్రమంగా విక్రయాలు**



నీటి ముంపు నుంచి తేలిన పొలాల్లో భూసారం ఎక్కువగా ఉండటంతో విత్తనం వేస్తే చాలు మంచి పంట దిగుబడి వస్తోంది. ఆయా భూముల్లో మొక్కజొన్న, మినుము, శనగ, కంది, పొగాకు పంటలు సాగు చేస్తున్నారు.

**రెండు పంటలు పండించుకుంటారు.**

ముంపు నుంచి బయటపడే సమయాన్ని బట్టి పొలానికి ధర నిర్దేశిస్తున్నారు. ఎకరం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు కౌలుకు ఇస్తున్నారు. నది గర్భంలో ఉన్న పొలాలకు కౌలు ఎకరం రూ.5 వేలు పలుకుతోంది. నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలాల పరిధిలో సమస్యలు లేని భూములను స్థానికులు ఎకరం రూ.లక్ష నుంచి రూ.3 లక్షలకు విక్రయించారు. రూ.10 వేల వరకు కౌలు వసూలు చేస్తున్నారు. ఈ మూడు మండలాల్లో సుమారు 200 ఎకరాల వరకు విక్రయించినట్లు సమాచారం. వీటికి రిజిస్ట్రేషన్లు లేకున్నా కాగితంపై రాసుకుని విక్రయాలు సాగిస్తున్నారు.

**63 గ్రామాలు.. 35 వేల ఎకరాలు**

నందికొట్కూరు నియోజకవర్గంలో 63 గ్రామాలు శ్రీశైలం జలాశయం నిర్మాణ సమయంలో ముంపునకు గురయ్యాయి. వాటి పరిధిలో సుమారు 35 వేల ఎకరాల వరకు పొలం ఉంటుంది. ఆయా భూములు జులై నుంచి నవంబరు వరకు నీటిలో మునిగి ఉంటాయి.

డిసెంబరు మొదటి వారం నుంచి కృష్ణానదిలో క్రమంగా నీరు తగ్గిపోయి భూములు తేలుతాయి. నిర్వాసితుల్లో చాలామంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇక్కడే ఉన్న కొందరు ఆయా భూముల్లో ఏటా పంటలు సాగు చేసుకొంటారు.

మునక భూములు సారవంతంగా ఉండటంతో పంటల దిగుబడి అధికంగా వస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని అక్రమార్కులు వాటిని సొంతం చేసుకొనే పనిలో పడ్డారు. గ్రామాలు వదిలివెళ్లిన వారు తిరిగొచ్చి తమ భూములు తామే సాగు చేసుకుంటామనడంతో ముంపు గ్రామాల్లో గొడవలకు దారి తీస్తోంది.

# ఏమీ లేదు గర్వకారణం

గిద్దలూరు : వైద్య విధాన పరిషత్ వైద్యశాల పరిధిలోని ప్రాంతీయ, సామాజిక ఆరోగ్య కేంద్రం, మాతా శిశు వైద్యశాలల్లో అందిస్తున్న సేవలు, రోగుల సంఖ్య, వసతుల ఆధారంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ప్రతి నెలా ఆసుపత్రులకు గ్రేడ్‌లను కేటాయిస్తారు. జిల్లాలో వైద్యవిధాన పరిషత్ వైద్యశాల పరిధిలో 2 ప్రాంతీయ వైద్యశాలలు, ఒంగోలు మాతాశిశు వైద్యశాల, మరో ఎనిమిది సామాజిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఏప్రిల్ నెలకు సంబంధించి వీటిలో ఏ ఒక్కటీ ఎ గ్రేడ్ సాధించలేదు. యర్రగొండపాలెం ప్రాంతీయ వైద్యశాలకు, కొండపిలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి మాత్రమే బి గ్రేడ్ దక్కింది. మిగిలిన గిద్దలూరు ప్రాంతీయ వైద్యశాల, ఒంగోలు మాతాశిశు వైద్యశాల, కనిగిరి, కంభం, చీమకుర్తి, దోర్నాల, దర్శి, పామూరు, పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రాలు సి గ్రేడ్‌తో సరిపుచ్చుకున్నాయి.

**ఇవీ వేధిస్తున్న వెతలు:**

కూటమి ప్రభుత్వం స్పెషలిస్టు వైద్యులను నియమించింది. అదే సమయంలో పూర్తిస్థాయిలో అధునాతన పరికరాలు అందుబాటులో లేకపోయాయి. దీంతో రోగులకు శస్త్రచికిత్సలు చేయలేని పరిస్థితి.

గత ప్రభుత్వం ప్రైవేట్ వైద్యశాలల్లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కాన్పులు, సిజేరియన్లకు అవకాశం కల్పించింది. దీంతో ప్రసవాల కోసం గర్భిణులను వారి కుటుంబ సభ్యులు ప్రైవేట్ వైద్యశాలలకు తీసుకెళ్లేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్య తగ్గిపోయింది. జిల్లాలోని పలు వైద్యశాలల్లో వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. పామూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే యంత్రం మూలకు చేరింది. దోర్నాల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే యంత్రం అందుబాటులో లేదు. పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే యంత్రం మంజూరైనప్పటికీ వినియోగంలోకి తేలేదు.

గత వైకాపా పాలనలో గిద్దలూరు వైద్యవిధాన పరిషత్ వైద్యశాల భవనాన్ని గుత్తేదారుడు అసంపూర్తిగా నిర్మించి అప్పగించారు. కంటి శస్త్రచికిత్స, ఎముకల చికిత్స విభాగం, చెవి, ముక్కు, గొంతు విభాగాలకు చెందిన శస్త్ర చికిత్స పరికరాలు అందుబాటులోకి రావాల్సి ఉంది.

నిధులకు చొరవ చూపితే మేలు: వైద్యశాలల్లో మౌలిక వసతులతో పాటు, అధునాతన పరికరాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాల్సి ఉంది.

కంభం, దర్శి, దోర్నాల, పామూరు, పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో జనరేటర్ల ఏర్పాటుకు రూ.60 లక్షలు అవసరం. దర్శి, దోర్నాల, కొండపి, పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో డిజిటల్ ఎక్స్‌రే క్యాస్ట్ రీడర్ ఏర్పాటుకు రూ.32 లక్షలు కావాలి. గిద్దలూరు, యర్రగొండపాలెం ప్రాంతీయ వైద్యశాలల్లో చెవి, ముక్కు, గొంతు సేవల విభాగానికి శస్త్ర చికిత్సల పరికరాల కోసం రూ.88.72 లక్షలు ఇవ్వాలి. కంటి చికిత్సల పరికరాల కోసం రూ.36.20 లక్షలు, ఎముకల విభాగం పరికరాల కోసం రూ.47 లక్షల నిధుల అవసరం. ఈ మేరకు జిల్లా అధికారులు రాష్ట్ర వైద్యశాఖ ఉన్నతాధికారులకు నివేదించారు. ఖాళీగానే పోస్టులు: జిల్లా వ్యాప్తంగా వైద్యవిధాన పరిషత్ వైద్యశాల పరిధిలో 21 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, పదోన్నతి ద్వారా వచ్చే డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులు 19, జనరల్ మెడిసిన్ పోస్టులు 2, సీఎస్ఆర్ఎంవో 2 ఖాళీగా ఉన్నాయి.

# బతుకు.. చేజారనీకు



తిరుపతి : పొట్టకూటి కోసం భవన నిర్మాణ కార్మికులు నిత్యం సాహసాలు చేస్తున్నారు. సదుపాయాలు, సౌకర్యాలు, భద్రత గురించి ప్రశ్నిస్తే మళ్లీ పనికి పిలవరనే భయం వారితోపాటు వారి కుటుంబాలను అగాథాల్లోకి నెడుతోంది. చెప్పినట్లు చేస్తున్నారని గుత్తేదారులు.. పని అప్పగించామని భవన యజమానులు, అవగాహన కల్పిస్తున్నాం కదా.. అని కార్మికశాఖ ఎవరికివారు పట్టించుకోకపోవడంతో కార్మిక కుటుంబాలు 'కూలి'పోవడం కొనసాగుతోంది.

**ప్రమాద ఘటనలు ఇలా..**

మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీలో భవన నిర్మాణ పనులు చేస్తూ ముగ్గురు కార్మికులు మృతి చెందారు. ప్లాస్టరింగ్ పనులు చేస్తుండగా కర్రల మేర విరగడంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఘటనలో రంగులు వేస్తుండగా ఒకరు మృతి చెందాడు. ఇలా మూడు నెలల్లో ఎనిమిదిమంది వరకు దుర్మరణం పాలవగా కుటుంబాలు వీధినపడ్డాయి.

**ప్రయోజనాలు ఇలా**

పని ప్రదేశంలో చనిపోతే చంద్రన్న బీమా కింద రూ.5 లక్షలు అందజేస్తారు. తక్షణం రూ.20 వేలు మంజూరు చేస్తారు. అంగవైకల్యానికి రూ.లక్ష నుంచి రూ.25 వేల వరకు అందజేస్తారు. సాధారణ మరణం పొందినా రూ.60 వేలు చెల్లిస్తారు. మహిళా కార్మికులకు రెండు కాన్పుల నిమిత్తం రూ.20 వేలు చొప్పున అందజేస్తారు.

**భద్రతా ప్రమాణాలు**

కార్మికులు నిబంధనల ప్రకారం సేఫ్టీ బెల్టు ధరించాలి. అదుపుతప్పితే జారకుండా మరో గోడకు రక్షణ వలయం ఏర్పాటు చేయాలి. హెల్మెట్ పెట్టుకోవాలి. నేలపై నిలబడి పనిచేసే కార్మికులు, విద్యుత్తు పనిచేసేవారు కాళ్లకు షూలు, చేతులకు గ్లౌస్‌లు ధరించాలి.

**అర్హులు ఎవరంటే..**

18- 59 మధ్య వయసువారు అర్హులు. నమోదు చేసుకునే ఏడాదికి 90 రోజులు నిర్మాణ రంగంలో పనిచేసి ఉండాలి. కార్మికశాఖ అధికారులకు రూ.110 చెల్లించి గుర్తింపుకార్డు పొందవచ్చు. ఐదేళ్ల తర్వాత రూ.60 చెల్లించి రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది.

**నిర్మాణ కార్మికుల భద్రతకు చర్యలు**

కార్మిక సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నాం. దరఖాస్తు చేసుకున్న రెండుమూడు రోజుల్లోనే గుర్తింపు కార్డులు వస్తాయి. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుడి కుటుంబం పోలీసు కేసు నమోదు చేసుకుంటే నష్టపరిహారం ఇప్పిస్తాం. ఎన్.సురేష్‌కుమార్, ఇన్‌ఛార్జి ఉప కార్మిక కమిషనర్

ఉమ్మడి జిల్లాలోని కార్మికులు : 1,45,049

ఆర్థిక సాయానికి ఎదురుచూస్తున్న కుటుంబాలు : 1,763

# పల్లెలకు నిధుల పండగ!



గిద్దలూరు :ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లె ప్రగతి పట్టాలెక్కింది. గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించిన సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా గతేడాది ఆగస్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు నిర్వహించిన గ్రామసభల ద్వారా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపింది. అనంతరం అక్టోబరు 14 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించిన పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలో మంజూరైన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో ఉపాధిహామీ పథకం అనుసంధాన నిధులతో పల్లెల్లో సిమెంటు, తారు రహదారులు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మెటీరియల్ కాంపొనెంట్ కింద మొదట్లోనే రూ.106 మేర నిధులు విడుదల కాగాబీ మిగతా పనులకు జనవరి నుంచి బిల్లులు పెండింగ్ ఉన్నాయి. తాజాగా జిల్లాకు రూ.64.85 కోట్లు విడుదల కావడంతో నిరీక్షణకు తెర పడింది.

**మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.121 కోట్లు**

2024-25 ఆర్థిక సంవత్సరానికి మెటీరియల్ కాంపొనెంట్ కింద చేపట్టిన పనులకు రూ.121 కోట్లు పెండింగ్ ఉండగా, అందులో రూ.53.50 కోట్లు విడుదలయ్యాయి. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజక వర్గాల్లోనూ సీసీ, బీటీ రహదారులతోపాటు మురుగు కాలువల నిర్మాణానికి సంబంధించి మొత్తం 1,182 పనులను రూ.133.28 కోట్లతో పూర్తి చేశారు. పనులన్నీ స్థానిక అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు చేపట్టారు. పనులు పూర్తయ్యాక బిల్లుల చెల్లింపు నిమిత్తం అప్‌లోడ్ చేసి గత ఆరు నెలలగా నిరీక్షిస్తున్నారు. ఇందులో ఇప్పటికే రూ.32.40 కోట్ల మేర చెల్లింపులు జరగ్గా, రూ.100.88 కోట్ల మేర బిల్లులు పెండింగ్ ఉన్నాయి. తాజాగా వాటి చెల్లింపులకు రూ.45 కోట్ల మేర విడుదలయ్యాయి. గతేడాది నవంబరు, డిసెంబరులలో పాడి రైతులు నిర్మించిన మినీ గోకులం షెడ్లను జనవరిలో స్థానిక ఎమ్మెల్యేలు, అధికారుల చేతులమీదుగా ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 912 షెడ్లు నిర్మించగా, రూ.8.50 కోట్లు విడుదలయ్యాయి. వీటిని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారు. అనంతరం చేపట్టిన ఇంకుడు గుంతలు, పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు పెండింగ్ ఉన్నాయి. 2015-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన సీసీ రహదారులకు 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం విజిలెన్స్ విచారణ పేరుతో బిల్లుల చెల్లింపులు నిలిపేసింది. తాజాగా ఆ సమయంలో పనులు చేపట్టిన గుత్తేదారులకు చెల్లింపుల నిమిత్తం రూ.11.35 కోట్లు కేటాయించింది. దీంతో గత రెండు రోజులుగా గ్రామ పంచాయతీ ఖాతాలకు జమవుతున్నాయి. దీంతో కొత్తగా చేపట్టనున్న పనులు ఊపందుకోనున్నాయి.

ఉపాధిహామీ పథకం కింద విడుదలైన నిధులు (రూ.కోట్లలో)

సీసీ, బీటీ రహదారులు, మురుగు కాలువలు : 45

మినీ గోకులం షెడ్లు : 8.50

2015-19 మధ్య పాత బకాయిలు : 11.35

# రెండు కి.మీ. దూరం.. నిత్యం ప్రాణసంకటం..

పెందుర్తి : అనకాపల్లి-ఆనందపురం ఆరు వరుసల జాతీయ రహదారి ప్రమాదకరంగా మారింది. దీన్ని 2014-19 మధ్య కాలంలో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం నిర్మించింది. అప్పట్లో పలుచోట్ల భూ వివాదాలు తలెత్తాయి. వాటన్నింటినీ పరిష్కరించినా.. పెందుర్తి మండలం సరిపల్లి సమీపంలో నెలకొన్న వివాదం నేటికీ అపరిష్కృతంగానే ఉండిపోయింది. దీంతో రాంపురం సమీపం నుంచి పాత పెందుర్తి వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర జాతీయ రహదారి పనులు పూర్తికాలేదు. ముఖ్యంగా రింగు రోడ్డు నిర్మాణం జరగకపోవడంతో నగరంలోకి వచ్చే వాహన చోదకులు కిలోమీటర్ల దూరం ముందుకెళ్లి.. తిరిగి వెనక్కి రావాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఎందరో ప్రమాదాలకు గురవుతున్నారు.

ఈ సమస్య పరిష్కారానికి గత వైకాపా ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదు. పరిహారం విషయమై రైతులు కోర్టును ఆశ్రయించడంతో ఎక్కడి పనులు అక్కడే స్తంభించిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఈ సమస్యను పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**సంఘటన-1**



రెండేళ్ల క్రితం రాంపురం సమీపంలో ఓ కారు ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందారు. ఇదే ప్రదేశంలో గతంలోనూ రెండు వేర్వేరు ప్రమాదాల్లో రోడ్డు దాటుతున్న ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల అక్కడే ఇసుక లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది.

**సంఘటన-2**

ఈ నెల 1న పెందుర్తి పెద్ద చెరువు సమీపంలో ద్విచక్ర వాహన ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. గతంలో ఒక అంబులెన్సు బోల్తా పడి రోగి సహా నలుగురు గాయాల పాలయ్యారు. ఇటీవల ఓ లారీ కాలిబాటపైకి దూసుకెళ్లడంతో రెయిలింగ్ ధ్వంసమైంది.

**ఆ రోడ్డు మలుపు.. ప్రమాదాలకు పిలుపు..**

పెందుర్తి పెద్ద చెరువు సమీపంలో నిలిచిపోయిన పనుల వద్ద రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ పల్లంగా ఉన్న మలుపు వద్ద వాహనాలు వేగంగా వెళుతూ అదుపు తప్పుతున్నాయి. అదే విధంగా అసంపూర్తి రహదారిలో పలువురు యువకులు ద్విచక్ర వాహనాలతో ఫీట్లు చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించి ఈ పనులు పూర్తయ్యేందుకు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

# ఫార్మాసిటీలో రసాయన జలాల కలకలం

పరవాడ : జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో ఫార్మా వ్యర్థ జలాలు కలకలం రేపుతున్నాయి. రాంకీ కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (సీఈటీపీ) ప్రహరీ ఆనుకుని ఉన్న వరద నీటి కాలువల్లో ఆదివారం నలుపు రంగులో ఉన్న ఫార్మా వ్యర్థ జలాలు ప్రవహించడం స్థానికుల్లో ఆందోళన కలిగించింది. వీటిని శుద్ధి చేయకుండా బయటికి వదిలేస్తుండడంతో ఈ ప్రాంతం కాలుష్య కాసారంగా మారుతోందని వాపోతున్నారు. గత నెలలో వర్షాల సమయంలో రెండు పర్యాయాలు రాంకీ ఫార్మా రసాయన జలాలను బయటికి విడిచిపెట్టడంతో అవి భరణికం మొల్లోడు గెడ్డవాగులోకి చేరి దుర్గంధం వ్యాపించింది. అప్పట్లో స్థానికులు, రైతులు ఆందోళనలు చేయడంతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గతనెల 18, 19 తేదీల్లో మొల్లోడు గెడ్డ వాగులో నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్‌లో జరిపిన పరీక్షల్లో



గెడ్డవాగులో ఫార్మా రసాయనాలు కలిశాయని, సీటీవో అండ్ హెచ్‌డబ్ల్యూఏ నిబంధనలు పాటించలేదని నిర్ధారించారు. దీనిపై కొద్దిరోజుల క్రితం రాంకీ సంస్థకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నోటీసులు జారీ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర పీసీబీ ప్రధాన కార్యాలయానికి నివేదిక పంపారు. ఇప్పుడు మళ్లీ రాంకీ సంస్థ ఫార్మా రసాయనాలను బయటికి విడిచిపెట్టడంపై రాష్ట్ర పీసీబీ బోర్డు ఛైర్మన్ కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఫార్మాసిటీలో సీఈటీపీ ప్రహరీని ఆనుకుని వరద నీటి కాలువల్లోకి చేరుకున్న రసాయన జలాలు వర్షాలు పడితే మొల్లోడు గెడ్డ వాగులోకి ప్రవహిస్తాయని, దీంతో చెరువులు, గెడ్డవాగులు కాలుష్య కాసారంగా మారుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పీసీబీ ఈఈ ముకుందరావును సంప్రదించగా కాలువల్లోని ఫార్మా వ్యర్థ జలాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## నాడు వదిలేస్తే.. నేడు నిధులిస్తే..!

కుప్పం : క్రీడలంటే మక్కువ ఉన్నా సరైన క్రీడా స్థలం లేదు.. నియోజకవర్గం మొత్తానికి ఉన్నది ఒకేఒక మైదానం.. దానినీ ఐదేళ్ల వైకాపా పాలనలో పట్టించుకునే వారు కరవయ్యారు. దీంతో క్రీడలకు దూరమై.. తమలో ప్రతిభను వెలికితీసే పరిస్థితి క్రీడాకారులకు లేకపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం పురపాలిక పరిధిలోని వడ్డిపల్లె వద్ద గత తెదేపా హయాంలో ఎన్టీఆర్ క్రీడా మైదానం పేరుతో.. ఓపెన్ స్టేడియం, ఇండోర్ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేశారు. వైకాపా పాలనలో పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా చర్యలు చేపట్టడంతో క్రీడాకారుల్లో ఆశలు చిగురించాయి.

**మైదానం అభివృద్ధికి రూ.22 కోట్లు..** కుప్పం ఎన్టీఆర్ క్రీడా మైదానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.22 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతోపాటు నాలుగు మండలాల పరిధిలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు.

చురకలు

మంగళవారం 15 జూలై 2025

## నిఘా కళ్లతో.. కక్ష సాధింపులు

తిరుపతి : భద్రత, సేవల్లో పారదర్శకత కోసం సీసీ కెమెరాల పర్యవేక్షణ సాధారణమైతే.. ఆ బ్యాంకులో రాజకీయ కక్ష సాధింపులకు వినియోగించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదెక్కడా అనుకుంటున్నారా.. సాక్షాత్తూ వందేళ్ల చరిత్రగల తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకులో రోజూ జరుగుతున్న తంతు ఇది. దీంతో ఖాతాదారులు, డిపాజిటర్లు, ఉద్యోగుల నుంచి భయాందోళన వ్యక్తమవుతోంది. రూ.525 కోట్ల లావాదేవీలు, 1.75 లక్షల మంది ఖాతాదారులతో పటిష్టంగా ఉన్న తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు వైకాపా హయాంలో రాజకీయ పునరావాస కేంద్రంగా మారిపోయింది. 2022లో వైకాపా పాలకవర్గం అధికారం చేపట్టినప్పటి నుంచి అనేక వివాదాస్పద ఘటనలకు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. బంగారు రుణాల్లో అక్రమాలు, వైకాపా సానుభూతిపరులు, నాయకులు, కార్యకర్తలకు పూచీకత్తు రుణాల మాఫీ, పాలకవర్గ వ్యతిరేక విధానాలపై ఆర్బీఐ విచారణ.. ఇలా లెక్కకు మిక్కిలి అవకతవకలు కొనసాగాయి. ఇంత జరిగినా ఇప్పటికీ పాలకవర్గం బాధ్యతాయుతంగా వ్యవహరించట్లేదు. పొరపాట్లను సరిదిద్దుకునే ప్రయత్నం చేయకుండా మరింత దిగజారుడు కార్యకలాపాలకు పాల్పడుతోంది. అక్రమాలు, వ్యతిరేక విధానాలు,



పాలకవర్గ నిర్ణయాలు బయటకు పొక్కకుండా మరింత ఉక్కుపాదం మోపుతున్నారు.

**వచ్చివెళ్లే వారిపై ఆరా**సాధారణంగా బ్యాంకుకు పార్టీలతో సంబంధం లేకుండా ఖాతాదారులు, డిపాజిటర్లు వచ్చివెళ్తుంటారు. కానీ వారిలో కూటమి నేతలు ఎవరెవరు వస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? ఎంత సమయం ఉంటున్నారో నిరంతరం నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. వారు వెళ్లిన తర్వాత సదరు ఉద్యోగులను పిలిపించి వేధింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇక్కడి వాతావరణం చూసి సగటు ఖాతాదారులు భయపడుతున్నారని, వారిపైనా ఎక్కడ రాజకీయ ముద్ర వేస్తారోనని రావడం లేదని, చివరకు వారిని కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. మరోవైపు ఉద్యోగులు వేధింపులకు గురవుతున్నా సంఘం నాయకులు స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## భారం తగ్గింది.. భరోసా పెరిగింది..

అనకాపల్లి : రూపాయి రూపాయి కూడబెట్టి సొంత గూడు అమర్చుకునే పేదలకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఇళ్ల నిర్మాణాల అనుమతులకు ఆర్థిక భారం తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. 50 చదరపు మీటర్లలోపు విస్తీర్ణం ఉండే స్థలంలో గృహ నిర్మాణాలకు ఒక్క రూపాయి రుసుంతో అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. వీరు ఒక అంతస్తు వరకు భవనం నిర్మించుకోవచ్చు. ముందుగా అనుమతి పొందిన ఇంజినీర్‌తో ఇంటి నిర్మాణానికి సంబంధించి ప్లాన్ గీయించుకోవాలి. ఇంతవరకు ఇందుకు రుసుంగా రూ. 3 వేలు చెల్లించాలి. తర్వాత భవన విస్తీర్ణాన్ని బట్టి రూ. 15 నుంచి రూ. 18 వేల వరకు చెల్లించాల్సి ఉండేది. ఇక నుంచి ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. కేవలం ఒక్క రూపాయి కడితే చాలు.. భవన నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఇస్తారు.

అనకాపల్లిలో ఏటా 350 నుంచి 450 మంది ఇళ్ల నిర్మాణానికి అనుమతులు తీసుకుంటారు. వీటిలో పది నుంచి ఇరవై శాతం వరకు 50 చదరపు మీటర్లలోపు విస్తీర్ణం ఉండేవే. నిబంధనల పేరుతో ఇంత వరకు పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బంది ఇంటి నిర్మాణదారులను అనేకరకాలుగా ఇబ్బంది పెట్టేవారు. దీనిపై అనేక ఫిర్యాదులు రావడంతో కూటమి ప్రభుత్వం నిబంధనలు సరళతరం చేసింది. మూడు మీటర్ల ఎత్తు దాటిన భవనాలకు బాల్కనీలు గరిష్ఠంగా 1.5 మీటర్ల వెడల్పుతో నిర్మించుకుంటే సరిపోతుంది. చిన్న ప్లాట్లకు రహదారి విషయంలో సడలింపులు ఇచ్చారు. వంద చదరపు మీటర్ల ప్లాట్‌కు రెండు మీటర్ల వెడల్పుగల అంతర్గత రహదారి ఉంటే సరిపోతుంది. అంతకంటే ఎక్కువ ఉంటే 3.6 మీటర్ల వెడల్పుగల రహదారి ఉండాలి. ఇంత వరకు ఎంత విస్తీర్ణం కలిగిన భవనానికైనా ఇంటికి నాలుగు వైపులా ఖాళీ స్థలాలు విడిచిపెట్టాల్సి ఉండేది. గతంలో



ఉన్న నిబంధనల ప్రకారం ఖాళీ స్థలాలు విడిచిపెట్టడం చాలామందికి సాధ్యమయ్యేది కాదు. దీన్ని అడ్డుపెట్టుకొని భవన యజమానుల నుంచి భారీగా మామూళ్లు దండుకునేవారు. ఇక నుంచి వంద చదరపు మీటర్లలోపు ప్లాట్‌కు అన్నివైపులా ఖాళీ స్థలాలు విడిచిపెట్టాల్సిన అవసరం లేదు. వంద నుంచి అయిదు వందల చదరపు మీటర్ల విస్తీర్ణం ఉంటే ముందుభాగంలో 0.75 నుంచి 2 మీటర్ల స్థలం విడిచిపెడితే సరిపోతుంది. వీటివల్ల పేద, మధ్య తరగతి గృహనిర్మాణదారులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. నిబంధనలు మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పట్టణ ప్రణాళికా విభాగం అధికారి కె.వెంకటరావు తెలిపారు. కేవలం ఒక్క రూపాయితో 50 చదరపు మీటర్ల లోపు విస్తీర్ణం ఉన్న స్థలాలకు భవన అనుమతులు ఇస్తామన్నారు. వీటిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చదువుల గుడికి 110 ఏళ్లు



అనంతపురం : 1916లో జులై 8న అనంతపురంలో బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్ట్స్ కళాశాలకు 110 ఏళ్ల విశిష్ట చరిత్ర సొంతం. ఎందరో కీర్తి కిరీటాలను సమాజానికి అందించి మరెంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నదీ సరస్వతీ నిలయం. ఇద్దరు రాష్ట్రపతులతో అనుబంధం ఉన్న కళాశాల ఇది. భారత రాష్ట్రపతిగా పనిచేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆ సంవత్సరంలోనే అధ్యాపకుడుగా ఆర్ట్స్ కళాశాలలో విధుల్లో చేరారు. మొదట ఆర్ట్స్ గ్రూపులు మాత్రమే ఏర్పాటు చేశారు. కళాశాల ఏర్పడినపుడు 41 మంది విద్యార్థులుండేవారు. ప్రస్తుతం సుమారు 4 వేలమంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రంలో సైన్స్, ఆర్ట్స్ అన్నీ డిగ్రీ కోర్సులు ఈ కళాశాలలో అందుబాటులో ఉన్నాయి. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు అందిస్తోంది. 156 మంది అధ్యాపకులు ప్రస్తుతం ఇందులో పనిచేస్తున్నారు. వర్చువల్, డిజిటల్ ల్యాబ్‌లు, తరగతి గదులు, డిజిటల్ గ్రంథాలయం, ఆన్‌లైన్ పరీక్షల విభాగం, అధునాతన వ్యాయామశాల, విశాల క్రీడా ప్రాంగణం, సార్వత్రిక విశ్వవిద్యాలయం అధ్యయన కేంద్రం, కళాశాలలో ఉన్నాయి. ఆర్ట్స్ కళాశాలకు 2016లో స్వయంప్రతిపత్తి హోదా లభించింది. 2005, 2011, 2017, 2023లో నాక్‌ఏ గ్రేడ్ గుర్తింపు లభించింది. ప్రతి ఏటా జనవరి 26దిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఈ కళాశాల నుంచి ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొంటున్నారు. పారా ఒలంపిక్ క్రీడలకు కూడా ఈ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పాల్గొన్నారు.

నీలం సంజయరెడ్డి, స్వప్న పారా ఒలంపిక్స్‌లో పాల్గొని పతకాలు సాధించారు. జిల్లా నుంచి భారత రాష్ట్రపతి పీఠాన్ని అధిష్ఠించిన నీలం సంజీవరెడ్డి కూడా ఆర్ట్స్ కళాశాలలో చదివారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన దామోదరం సంజీవయ్య, రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా పనిచేసిన వేణుగోపాల్‌రెడ్డి, శాస్త్రవేత్త యూఆర్ రావు ఈ కళాశాల పూర్వ విద్యార్థులే. ఎంతోమంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, న్యాయమూర్తులు, మేధావులను ఈ కళాశాల అందించింది. స్వాతంత్ర్యోద్యమంలోనూ ఈ కళాశాల జిల్లాకు ప్రధానకేంద్రంగా నిలిచింది.

సర్వేపల్లి రాధాకృష్ణన్ కూర్చున్న కుర్చీ

భారత రాష్ట్రపతిగా పనిచేసిన (1962- 1967) సర్వేపల్లి రాధాకృష్ణన్ అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేసినపుడు ఆయన కూర్చొనే కుర్చీ ఇది. ప్రస్తుతం ఆర్ట్స్ కళాశాలలో ఈ కుర్చీని భద్రపరిచారు. ఆయన 1916-17 సంవత్సరాల్లో ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపకులుగా బోధన అందించారు. ఆర్ట్స్ కళాశాలలోని ప్రిన్సిపల్ ఛాంబర్‌లో ఈ కూర్చున్న కుర్చీ ఇప్పటికీ దర్శనమిస్తుంది

ఇక్కడే చదివి ప్రిన్సిపల్ అయ్యా..

ఆర్ట్స్ కళాశాలలో చేరాలనే ఆకాంక్షతో మెడిసిన్‌లో సీటు వచ్చినా వెళ్లలేదు. ఆర్ట్స్ కళాశాలలో చేరాను. 1987-90లో డిగ్రీ పూర్తి చేశాను. అధ్యాపకురాలిగా ఇక్కడే పనిచేశాను. ప్రిన్సిపల్ పదవి చేపట్టాను. అప్పట్లో అధ్యాపకులు అందించిన బోధనతో ఉన్నత స్థాయికి చేరాను. ఆ రోజుల్లో చదువులంటే ఎంతో క్రమశిక్షణ ఉండేది. నాతోపాటు చదివిన పలువురు ప్రిన్సిపాళ్లు అయ్యారు. ప్రస్తుతం అధ్యాపకులుగా పనిచేస్తున్న వారు చాలామంది పూర్వ విద్యార్థులే.

\- డాక్టర్ పద్మశ్రీ, ప్రిన్సిపల్, ఆర్ట్స్ కళాశాల

# ఊచలు కోస్తారు.. ఉన్నదంతా దోచేస్తారు



కదిరి : ఒకే తరహాలో జరుగుతున్న చోరీలు ప్రజలకు వణుకు పుట్టిస్తున్నాయి. యజమానులు ఇంట్లో ఉండగానే ఎలాంటి అలకిడి లేకుండా కిటికీలు తొలగించి దొంగలు ఉన్నదంతా దోచేస్తున్నారు. కదిరి, ధర్మవరం ప్రాంతాల్లో ఇటీవల ఈ తరహా దొంగతనాలు వరుసగా జరుగుతున్నాయి. మరికొన్నిచోట్ల తాళం వేసిన ఇళ్లలోకి చొరబడి దొంగతనాలు చేస్తున్నారు. నగలు, నగదు ఎత్తుకెళ్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

**ఇటీవల దొంగతనాల తీరును పరిశీలిస్తే..**

తనకల్లు మండలం మండ్లిపల్లికి చెందిన మల్లికార్జునరెడ్డి కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. దొంగలు జనవరి 19న కిటికీల ద్వారా ఇంట్లోకి ప్రవేశించి 24 తులాల బంగారు నగలు, 26 తులాల వెండి వస్తువులతోపాటు రూ.3 లక్షల నగదు ఎత్తుకెళ్లారు.

మార్చి 17న కదిరి ఆలంఖాన్‌వలి మసీదువీధికి చెందిన బాబాఫకృద్దీన్ ఇంట్లో తాళం పగులగొట్టి బీరువాలోని రూ.9.70 లక్షలు, రెండుతులాల బంగారు నగలను దుండగుడు ఎత్తుకెళ్లాడు. పోలీసులు దొంగను పట్టుకుని నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నారు.

కదిరిపట్టణం నిజాంవలి కాలనీలో తాళం వేసిన ఇంట్లోకి శనివారం కిటికీల నుంచి ప్రవేశించిన దొంగలు 15 తులాల బంగారం, రెండున్నర కిలోల వెండిని ఎత్తుకెళ్లారు. కుటుంబ సభ్యులు అమెరికాకు వెళ్లడంతో చోరీ విషయాన్ని బంధువులు ఆలస్యంగా గుర్తించి, వారికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు.

మే 29న ధర్మవరంలోని గీతానగర్‌లో కుటుంబసభ్యులు మరో గదిలో నిద్రిస్తుండగా కిటికి తెరిచి ఇంట్లోకి వెళ్లిన దొంగలు రూ.2.80 లక్షలు, 5.8 తులాల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. ఉదయం గుర్తించిన ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బత్తలపల్లి మండలం మాల్యవంతంలో కుటుంబసభ్యులు మేడపై నిద్రిస్తుండటాన్ని పసిగట్టిన చోరులు ఇంట్లోకి చొరబడి 4 తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు.

రెండు నెలల కిందట ఓబుళదేవరచెరువు పోలీస్‌స్టేషన్ సమీపంలో నివాసం ఉంటున్న విశ్రాంత ఉద్యోగిని లక్ష్మీదేవి ఇంట్లోకి చొరబడిన దొంగలు ఆమెపై దాడి చేసి 14 తులాల బంగారం దోచుకెళ్లారు.

**ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం**

\- శివన్నారాయణస్వామి, డీఎస్పీ, కదిరి

ఇటీవల చోరీలకు పాల్పడిన దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. కొన్ని కేసుల్లో నిందితుల విషయమై స్పష్టత వచ్చింది. వారిని వీలైనంత త్వరగా పట్టుకుంటాం. దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన కార్యక్రమాలు చేపడతాం.

# ‘పట్టు’జారి.. మరమగ్గాల మోజులో పడి!

ధర్మవరం: గతంలో రెండు మగ్గాలుంటే చాలు.. ప్రభుత్వ ఉద్యోగి కంటే అధిక ప్రాధాన్యం ఉండేది. 25 ఏళ్లపాటు హవా నడిచింది. పదేళ్ల కిందట మరమగ్గాల రాకతో నేతన్నల పరిస్థితులు తలకిందులవుతూ వచ్చాయి. ప్రస్తుతం పట్టు చీరలకు ప్రఖ్యాతి చెందిన ధర్మవరం వెలవెలబోతోంది. ప్రతినెలా వందల కోట్ల రూపాయల టర్నోవర్‌తో దేశ, విదేశాలకు ఇక్కడి నుంచి పట్టు ఉత్పత్తులు ఎగుమతి అయ్యేవి. మరమగ్గాల సంఖ్య వేగంగా పెరగడంతో పరిశ్రమ ఒడిదొడుకులు ఎదుర్కొంటోంది. ఒక్క ధర్మవరమే కాదు.. ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి. ధర్మవరంలో పదేళ్ల కిందట వరకు 40 వేల చేనేత మగ్గాలు ఉండేవి. కార్మికులతో పాటు అనుబంధ పరిశ్రమల్లో 80 వేల మంది పనిచేసేవారు. 2014 తరువాత మరమగ్గాలు రాకతో చేనేత మగ్గాల సంఖ్య 8 వేలకు పడిపోయింది.

కూలీలుగా మారుతూ..: రాష్ట్రంలోనే అత్యధికంగా శ్రీసత్యసాయి జిల్లాలో మరమగ్గాలు ఎక్కువగా ఉన్నాయి. వీటి దెబ్బకు నేతన్నలు మగ్గాలను కట్టిపెట్టి కూలీలుగా మారే పరిస్థితి ఏర్పడింది. రిజర్వేషన్ యాక్ట్ 1985 ప్రకారం చేనేత మగ్గాలపై మాత్రమే నేయడం కోసం రిజర్వు చేసిన 11 రకాల చీరలను నిబంధనలు అతిక్రమించి మరమగ్గాలపై తయారు చేస్తున్నారు. దీంతో ఉత్పత్తి పెరిగి మార్కెట్లో వాటిదే అగ్రస్థానమైంది. 55 శాతం మాత్రమే పట్టుదారం, 45



శాతం పాలిస్టర్ ఉపయోగించాలి. మగ్గంపై నేసిన పట్టుచీర రూ.12 వేలు పలుకుతుండగా మరమగ్గాలపై తయారైన పట్టుచీరను రూ.7 వేలకే విక్రయిస్తున్నారు. ధరలో వ్యత్యాసం ఉండటంతో కొనుగోలుదారులు మరమగ్గం చీరల వైపు మొగ్గుచూపుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో చేనేత కేంద్రాలు: ధర్మవరం, సోమందేపల్లి, ముదిరెడ్డిపల్లి, గోరంట్ల, రోటరీపురం, యాడికి, ఉరవకొండ, పెద్దపప్పూరు, తాడిపత్రి.

## తిరునగరి మురుగుకు.. మోక్ష మార్గం

తిరుపతి : నగరాన్ని పట్టిపీడిస్తున్న భూగర్భ మురుగునీటి వ్యవస్థ (యూడీఎస్)కు త్వరలో మోక్షం లభించనుంది. దీన్ని ఆధునికీకరించేందుకు రూ.330 కోట్లు అవసరమని నగరపాలిక ఇంజినీరింగ్ విభాగం ఇప్పటికే అంచనాలు రూపొందించింది. వైకాపా విధ్వంస పాలన తర్వాత క్లిష్ట పరిస్థితుల్లో యూడీఎస్ సమస్య పరిష్కారానికి కేంద్రం ముందుకు వచ్చింది. నగరంలో 1996లో ప్రారంభించిన యూడీఎస్ పైప్‌లైన్ వ్యవస్థ శిథిలావస్థకు చేరింది. తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నా ప్రయోజనం ఉండటం లేదు.

**ఈ నిధులతో ఏం చేస్తారంటే?**

నగరంలోని మురుగునీరు రేణిగుంట మార్గంలోని ప్రధాన యూడీఎస్ పైప్‌లైన్ ద్వారా తూకివాకంలోని శుద్ధి కేంద్రాలకు చేరుతుంది. 1200 ఎం.ఎం. వ్యాసార్థంగల పైప్‌లైన్ ద్వారా 50 సంవత్సరాల భవిష్యత్తు అవసరాలకు తగినట్లు రేణిగుంట రోడ్డులోని 8 కి.మీ. ప్రధాన పైపులైన్‌ను రూ.80 కోట్లతో నిర్మించనున్నారు. శుద్ధినీటి తరలింపునకు



మిగిలిన రూ.10 కోట్లు వెచ్చించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మురుగునీటిని శుద్ధిచేసి పారిశ్రామిక, వ్యవసాయ అవసరాలకు వినియోగిస్తారు.

**కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం**

ఇటీవల నగరంలో పర్యటించిన కేంద్ర ప్రభుత్వ ప్రజారోగ్య, పర్యావరణ ఇంజినీరింగ్ సంస్థ (చెప్కో) కమిటీ ప్రతినిధులు యూడీఎస్ లోపాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. వీటిని సరిచేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అందుకు అనుగుణంగా అందజేశాం. ఎన్.మౌర్య, నగరపాలిక కమిషనర్

నగరంలో యూడీఎస్ ఇలా..

పైప్‌లైన్ నిడివి: 284 కి.మీ.

మురుగు ప్రవాహం: 55 ఎంఎల్‌డీ

కర్మాగారాలకు విక్రయిస్తున్న శుద్ధినీరు: రోజుకు 5 ఎంఎల్‌డీ

ప్రతి నెలా ఆదాయం: రూ.15 లక్షలు

రైతుల పొలాలకు సరఫరా: 18 ఎంఎల్‌డీ

## లక్ష్యం దిశగా...‘ఉక్కు’!

విశాఖ : విశాఖ ఉక్కు పరిశ్రమను స్థిరీకరించేందుకు అధికారులు, ప్రభుత్వం చేస్తున్న కృషికి తగ్గట్టుగా లక్ష్యసాధన వైపు అడుగులు పడుతున్నాయి. కర్మాగారంలో ముడి సరకు కొరత, ఆర్థిక పరిమితులతో నిలిచిపోయిన బ్లాస్ట్‌ఫర్నేస్-3ను గత నెల 28న పునఃప్రారంభించారు. ప్రస్తుతం మూడు ఫర్నేస్‌లు పని చేస్తుండటంతో కర్మాగారం హాట్‌మెటల్ సామర్థ్యం ఏడాదికి 5 మిలియన్ టన్నుల నుంచి 7.5 మిలియన్ టన్నులకు చేరుకోనుంది.

ప్రస్తుతం రోజు వారీ హాట్‌మెటల్ ఉత్పత్తి సామర్థ్యం 18 వేల నుంచి 20 వేల టన్నులుగా నిర్ణయించుకోగా... గురువారం ఒక్కరోజే బ్లాస్ట్‌ఫర్నేస్-1 నుంచి 7,004 టన్నులు, బ్లాస్ట్‌ఫర్నేస్-2 నుంచి 7,162 టన్నులు, బ్లాస్ట్‌ఫర్నేస్-3 నుంచి 1,570 టన్నులు కలిపి మొత్తం 15,736 టన్నులు ఉత్పత్తి జరిగింది. ముడిసరకు సరఫరాలో ఎలాంటి



ఇబ్బందులు ఎదురవ్వకపోతే.. ఇదే ఒరవడి కొనసాగుతుంది. అయితే ముడిసరకు విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లేకపోవడంతో ఎప్పుడు ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయోనని ఉద్యోగులు, అధికారులు లోలోన ఆందోళన చెందుతున్నారు.

రోజువారీ ఉత్పత్తి 21వేల టన్నులకు చేరితేనే కర్మాగారం ఆర్థికంగా బలోపేతమై.. ఉక్కు ఉద్యోగుల వేతన బకాయిల సమస్య, హెచ్‌ఆర్‌ఏ, విద్యుత్తు ఛార్జీలు, ఇతర అలవెన్సుల సమస్యలు పరిష్కారం అవుతాయి. ఆ దిశగా ఉత్పత్తి సాధించేందుకు ప్రభుత్వం, ఉన్నతాధికారులు సహకరించాలని ఉక్కు ఉద్యోగులు కోరుతున్నారు.

## మహిళా ప్రాంగణం.. తీసేస్తున్నారు ప్రాణం!

సంతనూతలపాడు : ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన ఎండ్లూరుడొంకలోని మహిళా ప్రాంగణం నేడు శిథిలావస్థకు చేరుకుంది. ఒకప్పుడు శిక్షణలతో కళకళలాడిన ఈ ప్రదేశం పూర్తిగా చిల్ల చెట్లు, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. ప్రతి భవనం దెబ్బతింది. ప్రధాన భవనం మినహా మిగిలిన అన్నీ పూర్తిగా పాడైపోయాయి. మరోవైపు శిక్షణలు లేకపోవడంతో ఉన్న అయిదుగురు సిబ్బంది సైతం చాలీచాలని



జీతాలతో కాలం వెల్లదీస్తున్నారు. రూ.2.72 కోట్లతో నిర్మించిన వసతి గృహం సైతం నిరుపయోగంగా మారింది. మొత్తం 11 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంగణంపై గత వైకాపా ప్రభుత్వం కన్ను పడింది. ఇళ్ల స్థలాల కోసం ప్లాట్లు వేసేందుకు యత్నించింది. మరోపక్క ప్రహరీ, భవనాల మరమ్మతులకు రూ.కోటితో ప్రతిపాదనలు పంపినా ఫలితం లేకుండాపోయింది. మహిళా ప్రాంగణాన్ని పూర్తిగా అందుబాటులోకి తెచ్చి ఆక్రమణలు కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# నాడు-నేడు.. పూర్తి ఎప్పుడు..?

పెనుమూరు : వైకాపా హయాంలో పాఠశాలల్లో మౌలిక వసతులు, తరగతి గదుల కొరత అధిగమించే నిమిత్తం నాడు-నేడు పథకాన్ని ఆర్భాటంగా తీసుకొచ్చారు. కానీ అమలులో ఆమడ దూరంలో ఉంది.. నాటి పాలకుల పుణ్యమా అని జిల్లాలోని చాలా పాఠశాలల్లో ఇప్పటికీ అసంపూర్తి భవనాలు దర్శనమిస్తున్నాయి.. ఫలితంగా విద్యార్థులు అసౌకర్యాల నడుమ విద్యాబోధన సాగించాల్సిన పరిస్థితి. పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చుతామని ప్రగల్భాలు పలికిన వైకాపా పాలకులు చివరకు వాటిని అసౌకర్యాల్లోకి నెట్టి తమ ఘనత చాటుకున్నారు. ప్రారంభంలో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. కొద్దికాలానికి నిధుల కొరత ఏర్పడటంతో పనులు చాలావరకు ఆగిపోయాయి. ఇప్పటికీ ఆయా పాఠశాలల్లో పనులు



అసంపూర్తిగానే ఉన్నాయి. కొన్నిచోట్ల గోడలు, పునాదులు, మోల్డింగ్ పనులతో ఆగిపోయాయి.

**కూటమి ప్రభుత్వంపై ఆశలు..**

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అధికారంలోకి వస్తే పాఠశాలల దశాదిశా మారుస్తామని చెప్పారు. విద్యామంత్రి నారా లోకేశ్ అసంపూర్తి భవనాల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు నిధులు కేటాయించకపోవడంతో పనులు సాగలేదు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరుచేసి భవనాలు పూర్తిచేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

**జిల్లాలో నాడు-నేడు పాఠశాలల వివరాలు**

మంజూరైన అదనపు తరగతి గదులు 645

పనులు ప్రారంభించినవి 641

పూర్తైన గదులు 27 వివిధ దశల్లో ఉన్నవి 614

# ఇక 'మొక్క'లేను

భీమవరం : పట్టణంలోని పురపాలక ఖాళీ స్థలాల్లో నాటేందుకు రెండు వేల మొక్కలు 2024లో కొన్నారు. ఒక్కొక్కటి రూ.200. వీటికి రక్షణగా ట్రీగార్డులు, కర్రలకు అదనంగా మరికొంత అయింది. అప్పట్లో ఇందిరమ్మ కాలనీ, బైపాస్ రోడ్డు పొడవునా నాటారు. గునుపూడి సోమగుండం చెరువు గట్టున రెండు మొక్కలు నాటారు. అవి ఇప్పుడు కనుమరుగయ్యాయి.

పచ్చని గోదావరి జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు, ఆకివీడులో ఏటా వర్షాకాలంలో 15 వేలకు పైగా మొక్కలు నాటుతున్నారు. కొన్ని పట్టణాల్లో ఒకే ఏడాదిలో పలు కార్యక్రమాల్లో 3500 నుంచి 8 వేలు వేస్తున్నట్లు దస్త్రాల్లో చూపుతున్నారు. వీటిలో కనీసం 10 శాతం మొక్కలు బతికితే పట్టణాలు పచ్చదనంతో కళకళలాడుతాయి. కానీ.. వాటిని సంరక్షించకపోవడంతో అవి కొద్దిరోజులకే ఎండుతున్నాయి. మరికొన్నింటిని పశువులు



తినేస్తున్నాయి. ట్రీగార్డ్సు అక్రమార్కుల పాలవుతున్నాయి. మరుసటి ఏడాది అక్కడే మళ్లీ మొక్కలు నాటడం పరిపాటిగా మారింది.

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 3.85 లక్షలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని జూన్ 5న ప్రారంభించారు. ప్రముఖులతో అక్కడక్కడా నాలుగైదు వేయించి మమ అనిపించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నా మొక్కలు నాటడం లేదు. కొన్ని రోజుల తర్వాత ఎండ తీవ్రత పెరిగిందంటూ వదిలేయడంతో రూ.లక్షల విలువైనవి ఎండిపోతున్నాయి.

**ఆర్డీ ఏమన్నారంటే..** ప్రతి పట్టణంలో మొక్కల పర్యవేక్షణకు పర్యావరణ ఇంజినీరు ఉన్నారు. వారికి వేరొక బాధ్యతలు అప్పగించకుండా కేవలం పర్యావరణ పరిరక్షణ మాత్రమే చూడాలని ఆదేశించాం.సీహెచ్ నాగనరసింహారావు, పురపాలక ఆర్డీ

# పండుగొప్ప.. రైతుకు ధరల దెబ్బ

మొగల్తూరు : పండుగొప్ప చేపలకు మార్కెట్లో ధరల పతనం కొనసాగుతుండటంతో ఆక్వా చెరువుల్లో వాటిని సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. సీబాస్‌గా పిలిచే వీటి ధరలు గతంలో ఆశాజనకంగా ఉండేవి. రాష్ట్రంలో సముద్ర తీరంలోని పశ్చిమగోదావరి, ఎన్టీఆర్ కృష్ణా, ప్రకాశం తదితర జిల్లాల్లో తక్కువ విస్తీర్ణంలో ఈ సాగు చేసేవారు. వనామీ సాగులో నష్టాలు సంభవిస్తుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండుగప్ప వైపు మళ్లారు. పశ్చిమగోదావరి జిల్లాలో గతంలో సుమారు 600 ఎకరాల్లో వీటి పెంపకం చేసేవారు. ప్రస్తుతం రెండు వేల ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు.

**పెరిగిన దిగుబడులు..** గతంలో ఎకరం చెరువులో 400 నుంచి 500 వరకు పండుగొప్ప చేపలను పెంచేవారు. ప్రస్తుతం ఎకరం చెరువులో వేయి నుంచి రెండు వేలు పెంచుతున్నారు. సాగు విస్తీర్ణం, దిగుబడులు కూడా పెరిగాయి. ఆ మేరకు ఎగుమతులు పెరగలేదు. ఈ చేపలు ఢిల్లీ, కోల్‌కతా, ముంబయి, చెన్నై, బెంగళూరు, కేరళ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. పూర్తిగా దేశీయ మార్కెట్లే ఆధారం. విదేశాలకు ఎగుమతి ఉండదు. సముద్ర వేట నిషేధం ముగియడంతో.. సముద్రంలో చేపలవేట నిషేధ కాలంలో వీటి ధరలు పెరుగుతాయని ఆక్వా రైతులు ఆశించారు. వేట నిషేధకాలం ముగిసింది. దీంతో వీటి ధరలు పెరిగే అవకాశం లేదని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో కిలో నుంచి రెండు కిలోల బరువు పెరిగిన పండుగొప్ప చేపలకు కిలోకు రూ.400 నుంచి రూ.440 వరకూ చెల్లించి కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం కిలో బరువు పెరిగిన చేపకు రూ.340 చెల్లిస్తున్నారు. నాలుగు కిలోల నుంచి ఐదు కిలోల లోపు బరువు పెరిగిన చేపలకు కిలోకు రూ.365, ఐదు కిలోలు ఆ పై బరువు పెరిగిన చేపలకు కిలోకు రూ.375 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో తాము నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# రైతన్నకు వరం.. పింఛను పథకం



అనకాపల్లి : వృద్ధాప్యంలో రైతన్నను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజనను ప్రవేశపెట్టింది. యుక్త వయసులో కష్టపడి వ్యవసాయం చేసిన రైతులు వృద్ధాప్యంలో పనిచేయలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి వారికి ప్రతి నెలా రూ.3 వేల చొప్పున జీవితకాలం పింఛనుగా ఇచ్చి కేంద్ర ప్రభుత్వం ఆదుకోనుంది. 60 ఏళ్లు దాటిన సన్న, చిన్నకారు రైతులకు ఆసరా కల్పించేందుకు ఈ పథకం అమలులోకి రానుందని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు తెలిపారు.

**అర్హులెవరు?**

18 నుంచి 40 ఏళ్లలోపు వయసుండి సొంతంగా భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులందరూ అర్హులే. అనకాపల్లి జిల్లాలో 3.64 లక్షల మంది రైతులు ఉండగా వీరిలో 40 ఏళ్లలోపు వారు 78 వేల మంది ఉంటారని అంచనా. రైతు పేరున ఐదు ఎకరాల్లోపు పొలం ఉండాలి. భర్తభార్యల పేరున భూమి ఉండి ఇద్దరికీ వేర్వేరుగా పాసు పుస్తకాలుంటే ఇద్దరూ అర్హులే.

**దరఖాస్తు ఇలా..** ఆసక్తి ఉన్న రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా నంబరు, ఫోన్ నంబరుతో మీ సేవా కేంద్రాల్లో సంప్రదించాలి. పీఎం కిసాన్ కేఎంవై పోర్టల్‌లో దరఖాస్తు చేయాలి. మొదట ఆధార్, నామినీ వివరాలతో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని సంతకం చేసి అప్‌లోడ్ చేయాలి. అనంతరం పింఛను కార్డు వస్తుంది. పీఎం కిసాన్ పథకానికి అనుసంధానమైన బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. ప్రీమియం మొత్తంలో సగం రైతు చెల్లిస్తే మిగతా సగం కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుంది.

**ప్రయోజనాలివీ..** భారత జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) పెన్షన్ ఫండ్ నుంచి రైతులకు పింఛను చెల్లిస్తుంది. 60 ఏళ్లలోపు మరణం సంభవిస్తే అప్పటివరకు రైతు చెల్లించిన ప్రీమియం, ప్రభుత్వం చెల్లించిన మొత్తంవడ్డీతో కలిపి జీవిత భాగస్వామికి చెల్లిస్తారు. జీవిత భాగస్వామి లేకపోతే నామినికీ చెల్లిస్తారు. 60 ఏళ్లు దాటాక చనిపోతే జీవిత భాగస్వామికి సగం పింఛను అంటే రూ.1,500 చొప్పున ప్రతి నెలా చెల్లిస్తారు.

**ప్రీమియం ఎంతంటే..**

రైతు వయసు ఆధారంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వయసున్న వారు నెలకు రూ.55 చెల్లిస్తే.. కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.55 కలిపి మొత్తం రూ.110 చెల్లిస్తుంది. 21 ఏళ్ల వయసున్న వారు రూ.61, 25 - రూ.80, 30 - రూ.106, 35 - రూ.159, 40 ఏళ్లున్న వారు రూ.200 చెల్లించాలి. కనీసం ఐదేళ్లు ప్రీమియం చెల్లించాలి. ఆసక్తి లేకుంటే మధ్యలోనైనా వైదొలగవచ్చు. అప్పటివరకు రైతులు చెల్లించిన ప్రీమియం, ప్రభుత్వ వాటా వడ్డీతో కలిపి తిరిగి చెల్లిస్తారు.

# సెజ్‌కు కొత్త కళ



అనకాపల్లి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరవాత పారిశ్రామికవేత్తలు జిల్లావైపు చూస్తున్నారు. విశాఖ నగరానికి సమీపంలో ఉండటం.. సముద్ర తీరం, రైలు, రోడ్డు రవాణాలకు అనుకూలంగా ఉండటంతో చాలా కంపెనీలు ఇటువైపు రావడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో (సెజ్) కొత్తగా పలు పరిశ్రమలు కొలువుదీరుతున్నాయి. వీటిద్వారా జిల్లాలోని వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాంబిల్లి మండలం కృష్ణంపాలెంలో గతంలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల మండలి (ఏపీఐఐసీ) సెజ్ రెండోవిడత కింద సుమారు 3400 ఎకరాల వరకు భూములు సేకరించింది. అరకొర మౌలిక సదుపాయాలు కల్పించి వదిలేయడంతో గత ప్రభుత్వంలో ఒక్క పరిశ్రమ కూడా ఇటువైపు కన్నెత్తికూడా చూడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చింది. కొత్త రోడ్ల నిర్మాణం, పరిశ్రమల అవసరాలకు సరిపడా నీటి సరఫరా, విద్యుత్తు సదుపాయానికి అంచనా టెండర్లను సైతం పిలుస్తున్నారు.

దీంతోపాటు ప్రభుత్వం పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు ఇస్తామని ప్రకటించింది. దీంతో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో రెండోవిడత సెజ్ భూముల్లో 'యాక్షన్ తెసా' కంపెనీ రూ.200 కోట్ల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఇటీవల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌తో కలిసి సంస్థ ప్రతినిధులు కర్మాగారం ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు.

**నాలుగువేలకు పైగా ఉద్యోగాలు:** యాక్షన్ తెసా కంపెనీ.. ఎండీఎఫ్, హెచ్‌డీఎఫ్ పార్టికల్ బోర్డులతోపాటు లామినేట్ చెక్క ఫ్లోరింగ్ వంటి ఉత్పత్తులను తయారు చేయడంతో ప్రసిద్ధి చెందింది. ఈ పరిశ్రమ నిర్మాణం పూర్తయితే.. ప్రత్యక్షంగా, పరోక్షంగా నాలుగువేలకు పైగా ఉద్యోగ ఉపాధి కలగనుంది. స్థానిక, నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాల్లో అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

# తవ్వేయ్ కొండ.. అమ్మేయ్ గ్రానైట్



చిత్తూరు : లక్షలాది రూపాయల విలువైన ఖనిజ సంపద అక్రమంగా సరిహద్దులు దాటుతూ.. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడుతోంది. స్థానికులు అభ్యంతరాలు చెప్పినా.. బేఖాతరు చేస్తూ కొండల్ని ధ్వంసం చేస్తున్నారు. అదెక్కడో కాదండోయ్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని చిత్తూరు మండలం నాయనిచెరువు, పెద్దిశెట్టిపల్లెల్లోనే. ఈతంతు కొన్ని నెలలుగా సాగుతున్నా పట్టించుకొనేవారు కరవైనట్లు స్థానికంగా విమర్శలు గుప్పిస్తున్నారు.

నాయనిచెరువు సమీపంలోని ఓ కొండపై స్థానిక నేత కన్నుపడింది. రాత్రివేళ పేలుడు పదార్థాలతో కొండను కొల్లగొడుతూ తమిళనాడు సరిహద్దు గ్రానైట్ ఫ్యాక్టరీలకు తరలిస్తూ రోజుకు రూ.10 లక్షల పైనే జేబుల్లో వేసుకుంటున్నారు. గ్రానైట్ తవ్వకాలు, తరలింపుతో ఆప్రాంత రహదారులు దెబ్బతినడంతోపాటు రాత్రివేళ పేలుడు శబ్దాలతో స్థానికులు తిప్పలు పడుతున్నారు. సదరు నేత అక్రమాలపై రెవెన్యూ, గనుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా మామూళ్లు తోడు ఓ ప్రజాప్రతినిధి పేరు చెబుతుండటంతో ఎవరూ అటుగా కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పెద్దిశెట్టిపల్లె సమీపంలో ఇలా..** పెద్దిశెట్టిపల్లె సమీపంలోని కొండలపై గుడిపాల మండలానికి చెందిన ఓ నేత, చిత్తూరు నగరానికి చెందిన మరోనేత కలిసి చేపట్టిన అక్రమ మైనింగ్ మూడు నెలలుగా సాగుతోంది. పొక్లెయిన్లు, ఐదుకుపైగా లారీలు ఆ ప్రాంతంలోనే ఉండి తీసిన గ్రానైట్ బండలను తమిళనాడు సరిహద్దు ప్రాంతాల గ్రానైట్ ఫ్యాక్టరీలకు తరలిస్తూ రోజూ సంపాదిస్తోంది రూ.25 లక్షలకు పైనే. సీనరేజీ రూపంలో ప్రభుత్వం పెద్దఎత్తున ఆదాయం కోల్పోతున్న నేపథ్యంలో కలెక్టర్ దృష్టి సారించి అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు అభ్యర్థిస్తున్నారు.

**అక్రమమని తేలితే చర్యలు..**

నాయనిచెరువు, పెద్దిశెట్టిపల్లె ప్రాంతాలలోని కొండల తవ్వకాలపై మా సిబ్బందిని పంపుతాం. అక్కడ చేపట్టే మైనింగ్ అక్రమమని తేలితే ఎవరినీ ఉపేక్షించం. చర్యలు తీసుకుంటాం.

సత్యనారాయణ, డీడీ, గనులశాఖ

# బిగుస్తున్న తుడా.. అవినీతి ఉచ్చు

తిరుపతి : తుడా.. అక్రమాల వెలికితీతలో విజిలెన్స్ అధికారులు కీలక అడుగులు వేస్తున్నారు. వైకాపా పాలనలో ఐదేళ్లు తుడా నుంచి ఎటువంటి సమాచారం బయటకు రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు సాగించారు. అనంతరం నిధులు ఇష్టారాజ్యంగా కొల్లగొట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూర్తిస్థాయి విచారణ ప్రారంభించింది. 2024 డిసెంబర్‌లో విజిలెన్స్ అధికారుల విచారణ ప్రారంభమైనా మొన్నటి వరకు సమాచార సేకరణ వారికి పెద్ద సవాలుగా మారింది.

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ(తుడా) లో వైకాపా హయాంలో చట్టాలకు, నిబంధనలకు పాతరేశారు. తుడా పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా పెద్దఎత్తున ఆస్తులు తెగనమ్మారు. ఆ సొమ్మును ఇంజినీరింగ్, ఉద్యాన, పరిపాలనా విభాగాలు ఖర్చు చేశాయి. తుడా అధికారుల అత్యుత్సాహంతో చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ఎంపీడీవోలు సైతం తుడా నిధులను నీళ్లప్రాయంగా ఖర్చుచేశారు. ఈ లెక్కలు రూ.240 కోట్ల వరకు ఉండగా ఇంజినీరింగ్ విభాగం మరో రూ. 250 కోట్ల వరకు ఖర్చు చేసింది. ఉద్యాన విభాగం ద్వారా రూ.30 కోట్ల వరకు వెచ్చించి ఉత్తుత్తి మొక్కల పంపిణీ, పచ్చదనం



పెంపు వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు సమాచారం. పరిపాలనా విభాగానికి సంబంధించి వైద్య శిబిరాలు, టెలీ కాన్ఫరెన్సులు, విమాన ఛార్జీలు, ఇంధన ఖర్చు, వాహనాల కొనుగోలు, అద్దెలు, ప్రచార కార్యక్రమాలు, వాలంటీర్లకు బహుమతుల ప్రదానం, సభలు సమావేశాలు, రాజకీయ కార్యక్రమాలు ఇలా మరో రూ.50 కోట్లకు పైగా వెచ్చించినట్లు తెలుస్తోంది.

**నోటీసులు అందుకోనున్న ఇంకొందరు**

తుడా అధ్యక్షులుగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన తనయుడు మోహిత్ రెడ్డి పనిచేసిన కాలంలో తుడాలో కీలక పోస్టుల్లో పనిచేసిన అధికారులకు ఇప్పటికే విజిలెన్స్ అధికారులు తాఖీదులు జారీ చేశారు. చెవిరెడ్డితోపాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, చంద్రగిరి నియోజకవర్గంలోని 15 మంది ఎంపీడీవోలకు తాఖీదులు ఇప్పటికే జారీ అయ్యాయి. వీరు సమాధానం ఇవ్వడానికి సోమవారం వరకు గడువు ఉంది. ఇంజినీరింగ్, ఉద్యాన, పరిపాలనా విభాగంలో వివిధ హోదాల్లో పనిచేసిన అధికారులకు త్వరలో తాఖీదులు అందనున్నాయి. చంద్రగిరి నియోజకవర్గంలోని పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఆర్అండ్‌బీ అధికారులకు, చెవిరెడ్డి వద్ద పనిచేసిన ప్రత్యేకాధికారులకు సైతం తాఖీదులు జారీ కానున్నాయని తెలుస్తోంది.

# అక్రమ గుట్టలు.. ఆర్జనకు బాటలు

భీమవరం : గోదావరికి వరదల సమయంలో ఇసుక లభ్యత తగ్గుతోంది. ఇదే అదనుగా ప్రజల అవసరాన్ని సొమ్ము చేసుకునేందుకు కొందరు నిబంధనలకు విరుద్ధంగా భారీగా ఇసుక నిల్వలు చేస్తున్నారు. దానిని రెట్టింపు ధరలకు విక్రయించేందుకు పన్నాగం పన్నుతున్నారు. నిల్వల విషయమై స్థానిక అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవ డంతో అవి మరింత పెరుగుతున్నాయి.


**తూర్పుగోదావరి నుంచి..**

జిల్లాలోని రీచ్‌లు కోస్టల్ రెగ్యులేషన్ (సీఆర్) జోన్ పరిధిలో ఉండటతో ఇసుక తవ్వకాలకు అవకాశం లేదు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, పెండ్యాల, ఖండవల్లితో పాటు రావులపాలెం రీచ్‌ల నుంచి జిల్లా పరిధిలో వివిధ ప్రాంతలకు సరఫరా చేస్తున్నారు. నెలకు మూడు లక్షల టన్నుల వరకు అవసరం ఉంది. అయితే జులై, ఆగస్టు నెలల్లో గోదావరికి వరదల నేపథ్యంలో రీచ్‌లలో తవ్వకాలు నిలిచిపోతాయి. ఇదే అదనుగా కొందరు జిల్లాలోని సిద్ధాంతం, దొంగరావిపాలెం, ఇలపర్రు, నడిపూడి, రామన్నపాలెం తదితర ప్రాంతాల్లో ఇసుకను అక్రమంగా నిల్వ చేస్తున్నారు.

ఓపెన్ రీచ్‌లు: 5

బోటమెన్ ర్యాంపులు: 6

వర్షాకాలం ఇసుక అవసరాల అంచనా 5 లక్షల టన్నులు



వైకాపా వైఫల్యంతో..

గోదావరి తీరం వెంబడి పుష్కలంగా నిల్వలున్నా గత వైకాపా ప్రభుత్వ వైఫల్యాలు ఉచిత ఇసుక విధానానికి అవరోధంగా మారాయి. రీచ్‌లకు పర్యావరణ, కాలుష్య, ఇతర అనుమతులు ముగియగా వాటి పునరుద్ధరణపై పాలకులు దృష్టి పెట్టలేదు. గతంలో ఓపెన్‌రీచ్‌ల పరిధిలో 6 లక్షల నుంచి 8 లక్షల టన్నుల వరకు ఇసుక నిల్వ చేసేవారు. వర్షాకాలంలో ఇసుక అవసరాల కోసం దాదాపు 5లక్షల టన్నులు అవసరమతుందని అంచనా వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక భవన నిర్మాణ రంగం ఊపందుకున్న నేపథ్యంలో అక్రమార్కులు ఖాళీ స్థలాలు, తోటల్లో పెద్ద ఎత్తున నిల్వలు చేస్తున్నారు. సమయాన్ని బట్టి రెట్టింపు ధరలకు విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

యలమంచిలి మండలం దొడ్డిపట్ల, వడ్డిలంకలో బోట్‌మెన్ ర్యాంపులు పనిచేస్తున్నా అక్కడి ఇసుకలో ఉప్పుశాతం అధికంగా ఉండటంతో నిర్మాణదారులు కొనుగోలుకు వెనకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వర్షాలకు ముందే అనధికారికంగా ఇసుక నిల్వ చేసిన దళారులు, వ్యాపారులకు డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుతం స్టాకు పాయింట్ల కంటే ప్రైవేటు వ్యక్తులు, వ్యాపారులు నిర్మాణాలు పేరిట ఖాళీ ప్రదేశాల్లో ఇసుక నిల్వ చేస్తున్నారు.

'ప్రభుత్వం స్టాకు పాయింట్లు ఏర్పాటు చేసింది. అవి కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడ నిల్వలు ఉన్నా వాటిని సీజ్ చేస్తాం. అవసరమైతే కేసులు పెడతాం' అని గనుల శాఖ ఏడీ రవికాంత్ తెలిపారు.

## ప్రకృతిలోకి వెళదాం.. ఆరోగ్య పాఠాలు నేర్చుకుందాం!

ఆరిలోవ : 'ఈ వైద్యాలయంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రకృతి వైద్యం అందిస్తున్నాం. పూర్వ రికార్డులు పరిశీలించి వ్యక్తి మొత్తం ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటాం. అనారోగ్యానికి మూల కారణాలు విశ్లేషిస్తాం. శరీర సహజ రక్షణ సామర్థ్యాన్ని పెంచేలా చికిత్స అందిస్తున్నాం'. అని డాక్టర్ సౌమ్య తెలిపారు.
మారిన జీవనశైలి వ్యాధులకు ప్రధాన కారణమవుతోంది. వ్యాధులకు వాడే మందులు ఒక వయసు దాటిన తర్వాత దుష్ప్రభావం చూపిస్తున్నాయి. ఇటువంటి వారికి స్వస్థత చేకూర్చడానికి ప్రకృతి చికిత్స అందిస్తోంది శ్రీకృష్ణాపురం గోశాల ఆవరణలోని ప్రహ్లాద యోగ, ప్రకృతి చికిత్సాలయం. సింహాచలం దేవస్థానం నిర్వహణలో ఈ వైద్యాలయం నడుస్తోంది. ఇక్కడ ఆరోగ్యంగా జీవించేందుకు అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నారు. నిష్ణాతులైన ఆయుర్వేద వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ప్రవేశ రుసుం రూ.100 చెల్లించాల్సి ఉంటుంది.



గోశాల ఆవరణలో తిప్పతీగ, పొడపత్రి, నేల ఉసిరి, లవంగ, తులసి తదితర 12 రకాల ఔషధ మొక్కలు పెంచుతున్నారు. ఈ మొక్కలతో తయారు చేసిన ఆయుర్వేద మందులను రోగులకు అందజేస్తారు.
ఇక్కడ మలివయసులో అంటే 70ఏళ్లు దాటిన తర్వాత ఆరోగ్యంగా జీవించేందుకు ఉపయుక్తమైన యోగా, వ్యాయామం, ఆహార నియమాలు, నిద్ర, సహజ జీవనశైలిపై అవగాహన కల్పిస్తారు. మంచి వ్యాపకం, పుస్తక పఠనం, మొక్కలు పెంచడం, ఆనందకర అంశాలను మననం చేసుకోవడం, స్వలాభాపేక్ష వీడడం, కొంత సమయం సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, మౌనం, ఉపవాసం, మితాహారం పాటించేలా సూచనలిచ్చి ఆరోగ్య జీవనానికి బాటలు వేయిస్తారు.

## గురుకులం.. పాముల భయం

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని కొర్రపాడు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో విద్యార్థులకు పాముల భయం పట్టుకుంది. దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. గురుకుల పాఠశాలను దాదాపుగా 13 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. పక్కాభవనాలు నిర్మించి మూడేళ్ల నుంచి ఇక్కడి నుంచే తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యాలయంలో 6 నుంచి 10వ తరగతి వరకు 500 మందికి పైగా



విద్యార్థినులు చదువుతున్నారు.
గురుకుల మైదానంలో ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు, గడ్డిజాతి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో పాములు, తేళ్లు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. గతంలో పాములు విద్యార్థినుల వసతిగృహాల్లోకి నేరుగా చొరబడటంతో వెంటనే అప్రమత్తమై చంపేశారు. ఈనెల 12వ తేదీ నుంచి విద్యార్థినులకు తరగతులు ప్రారంభమయ్యాయి. విద్యార్థినులు దుస్తులు శుభ్రం చేసుకునే ప్రదేశం, వసతి గృహాల వద్ద పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉంది. దీనికితోడు తాగునీటికోసం ఏర్పాటు చేసి బోరు దగ్గరకు విద్యుత్తు తీగలను కర్రలపై ఏర్పాటు చేశారు. కర్రలు విరిగితే తీగలు కిందపడితే విద్యార్థినుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుంది. ఇప్పటికైనా గురుకులం అధికారులు స్పందించి విద్యాలయంలో పిచ్చి మొక్కలు తొగించడంతో పాటు, విద్యుత్తు తీగలకు స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పండ్ల తోటలకు.. వందశాతం ప్రోత్సాహం

చిత్తూరు : మెట్ట ప్రాంతంలో పండ్లతోటల పెంపకానికి కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఐదెకరాలలోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ్మ ఇతర చిన్న, సన్నకారు రైతులకు వందశాతం ఉపాధి నిధులు వెచ్చించనున్నారు. రెండు నుంచి మూడేళ్లపాటు ఎకరానికి రూ.68,103 నుంచి రూ.2,51,226 వరకు రైతులకు చెల్లించనున్నట్లు వెల్లడించింది. పోషణకు ఎరువులు,పురుగు మందులు సైతం ఉచితంగా ఇస్తారు. తొలకరిలో నాటితే చక్కగా ఎదిగే అవకాశం ఉంది.
**18 రకాల పండ్ల తోటలకు:** జిల్లా పరిధిలో 18 రకాల పండ్ల తోటలు, 2 రకాల పూల తోటల సాగు, మునగ పంటతో కలిపి 21 రకాల



మొక్కల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించనుంది. సొంత భూమి, నీటి వసతి ఉన్న రైతులు ఉపాధిహామీ సిబ్బందిని సంప్రదిస్తే మొక్కలు ఇప్పిస్తారు.
**సద్వినియోగం చేసుకోవాలి:** ఉపాధిహామీ పథకం కింద రైతులు పండ్లతోటలు పెంచుకోవచ్చు. పెట్టుబడిని పూర్తిగా ప్రభుత్వమే అందజేస్తుంది. మొక్కల సంరక్షణకు నిధులు లబ్ధిదారుల ఖాతాలకే జమచేస్తుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రవికుమార్, పీడీ, డ్వామా

# తుంగభద్ర నీటి విడుదలపై సందిగ్ధం



అనంతపురం : జులై ఒకటో తేదీన అన్ని ప్రధాన కాలువలకు నీరు విడుదల చేస్తామన్న టీబీ ప్రాజెక్టు అధికారుల సంకేతాలు హెచ్చెల్సీ అధికారుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ఉమ్మడి అనంత జిల్లా వరప్రదాయినిగా భావించే ఈ ప్రధాన కాలువకు పైన పేర్కొన్న తేదీలో నీటిని తీసుకునే స్థితిలో ఇక్కడి యంత్రాంగం లేదన్నది నిష్ఠూర సత్యం. కాలువపై 11 రకాల మరమ్మతు, కొత్త పనులు సాగుతున్నా.. కీలకమైన 137.702 కి.మీ. వద్ద పాత అండర్ టన్నెల్ (యూటీ) స్థానంలో కొత్త యూటీ, 117.794 కి.మీ. వద్ద కొత్తగా రెండు వరుసల రహదారి వంతెన (డీఎల్ఆర్బీ) నిర్మాణాలు అసలు సమస్యగా మారాయి. ఆ రెండు పనుల పురోగతి 50 శాతం కూడా పూర్తికానట్లు తెలుస్తోంది. ఇంతటి క్లిష్ట తరుణంలో తుంగభద్ర నుంచి నీరు విడుదలైతే ఏం చేస్తారన్న దానిపై సందిగ్ధం నెలకొంది. గుత్తేదారుడి నిర్వాకం.. అధికారుల ముందుచూపు కొరవడంతో అన్నదాతల ఆయకట్టుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. తుంగభద్ర యంత్రాంగం జులై ఒకటో తేదీనే నీరు ఇస్తామన్నా.. సదరు పనులు పూర్తి కాకపోవడంతో రెండు వారాలు ఆలస్యంగా నీరు తీసుకుంటామన్న విషయాన్ని ప్రాథమికంగా బోర్డుకు తెలిపినట్లు సమాచారం.
**అసలే అరకొర.. ఆపై ఆలస్యం**తుంగభద్ర జలాశయం క్రస్ట్ గేట్ల మార్పిడి.. మరమ్మతు.. అభద్రత మూలంగా ఈ దఫా పూర్తిస్థాయి సామర్థ్యం నీటిని నిల్వ చేయలేమని బోర్డు తెగేసి చెప్పింది. 105 టీఎంసీల సామర్థ్యం ఉన్నా.. 80 టీఎంసీలకు మాత్రమే నిల్వ ఉంచాలని ఇటీవల జరిగిన ఎస్ఈల సమీక్షలో నిర్ణయించారు. క్రస్ట్ గేట్ల స్థాయికి నీరు చేరుకోగానే ప్రధాన కాలువలకు ఇవ్వడానికి సిద్ధమయ్యారు. అంటే.. డ్యాంలో 40 టీఎంసీలు చేరుకోగానే నీటిని ఇస్తారు. ఈ నెలాఖరు నాటికి నిర్దేశిత టీఎంసీల వరద జలాలు వచ్చే వీలుందని భావిస్తున్నారు. అరకొరగా వచ్చే కోటాను కూడా సకాలంలో తీసుకోకపోతే ఆయకట్టుపై ప్రభావం పడుతుంది. ఇప్పుడు ఆలస్యంగా నీరు తీసుకుంటే మరింత నష్టపోయే ప్రమాదం లేకపోలేదు.
**పనుల వేగమే కీలకం**
కూటమి ప్రభుత్వం హెచ్చెల్సీ పనుల కోసం రూ.33.89 కోట్లు మంజూరు చేసింది. దీనికి రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు విశేష కృషి సల్పారు. ఆ తర్వాత పనుల పురోగతిపై తరచూ క్షేత్రస్థాయికి వెళ్లి అనుశీలన చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని క్లిష్ట పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్న నేపథ్యంలో యూటీ, వంతెన పనులు రెట్టింపు స్థాయిలో వేగం పుంజుకోవాల్సిన అవసరం ఉంది. తుంగభద్ర నీటిని వీలైనంత త్వరగా తీసుకోడానికి పనులు వేగంగా చేసేందుకు కృషి చేస్తున్నామని హెచ్చెల్సీ ఎస్ఈ పురర్ధనరెడ్డి తెలిపారు.
**తుంగభద్ర జలాశయం వివరాలు**
డ్యాంలో నీటి నిల్వ : 26.873 టీఎంసీలు
ప్రస్తుత సీజన్‌లో లభ్యత : 120 టీఎంసీలు
ఇన్‌ఫ్లో : 8,776 క్యూసెక్కులు
హెచ్చెల్సీ వాటా : 18.396 టీఎంసీలు

# సాంకేతిక విప్లవానికి సమస్యల సెగ!..

## తగ్గిపోతున్న ఫైబర్‌నెట్ కనెక్షన్లు




అగనంపూడి : సాంకేతిక విప్లవానికి ప్రతీకగా ప్రశంసలు అందుకున్న ఫైబర్‌నెట్ ప్రాజెక్టుకు సమస్యల సెగ తగులుతోంది. తరచూ ప్రసారాల్లో అంతరాయాలు, నాణ్యత లేని సేవలతో విసుగు చెందుతున్న వినియోగదారులు ఇతర నెట్‌వర్కులకు మళ్లుతున్నారు. కనెక్షన్ల సంఖ్య భారీగా తగ్గిపోతుండడంతో కేబుల్ ఆపరేటర్లు ఆందోళన చెందుతున్నారు. వైకాపా హయాంలో ఈ ప్రాజెక్టును నిర్వీర్యం చేయగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సంస్థ తిరోగమనంలోకి పయనిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
**వైకాపా హయాంలో నిర్వీర్యం:** ప్రజలకు చౌక ధరలో వినోదంతో పాటు విజ్ఞానం అందించాలనే లక్ష్యంతో 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఫైబర్‌నెట్‌ను ప్రారంభించింది. కేవలం రూ. 150కే అంతర్జాలం, టీవీ ఛానళ్లు, ఫోన్ సదుపాయం కల్పించడంతో వినియోగదారుల నుంచి మంచి స్పందన వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా కేబుల్ ఆపరేటర్ల భాగస్వామ్యంతో 10 లక్షలకుపైగా కనెక్షన్లు ఏర్పాటయ్యాయి.
2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక ఆ సంస్థను వైకాపా నేతలు తమ అనుచరులు, కార్యకర్తలకు ఉపాధి కల్పన కేంద్రంగా మార్చేశారు. అయిదేళ్లలో కొత్త బాక్సులు ఇవ్వకపోగా వినియోగంలో ఉన్న వాటికీ సక్రమంగా సేవలు అందించలేదు.
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుతీరాక ఆయా అక్రమాలపై విచారణకు ఆదేశించడంతో వైకాపా హయాంలో నియమించిన సిబ్బందిని ఇటీవల తొలగించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో సమస్యలు తలెత్తాయి. ఏయూ క్యాంపస్‌లో ఉన్న నెట్‌వర్క్ ఆపరేషన్స్ సెంటర్(ఎన్.ఓ.సి)లో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో సాంకేతిక సమస్య తలెత్తి రాష్ట్రవ్యాప్తంగా ప్రసారాలు ఆగిపోవడంతో ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు.
**ఆపరేటర్లకు గుదిబండగా..:** ఫైబర్‌నెట్ సేవలకు ప్రతి బాక్సుకు నెలకు రూ.59 చొప్పున కేబుల్ ఆపరేటర్ల నుంచి సంస్థ వసూలు చేస్తోంది. బాక్సు పని చేసినా.. చేయక పోయినా ఆపరేటర్లు అద్దె రూపంలో సొమ్ములు చెల్లించాల్సి వస్తోంది. ప్రస్తుతం సేవా లోపాలతో పలువురు వినియోగదారులు కనెక్షన్లు తొలగించుకోగా, ఆయా బాక్సులను తిరిగి ఇవ్వడం లేదు. కనెక్షన్లు తగ్గిపోయి ఆదాయం పడిపోగా బాక్సుల అద్దెలతో అప్పులపాలవుతున్నామని కేబుల్ ఆపరేటర్లు వాపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కనెక్షన్ల సంఖ్య 3.5 లక్షలకు పడిపోయిందని రాష్ట్ర కేబుల్ ఆపరేటర్ల జేఏసీ ప్రతినిధి ఎ.నారాయణ రావు ఆరోపించారు. తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి తలెత్తిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి ఫైబర్‌నెట్‌ను గాడిలో పెట్టాలని కోరారు.

# చుక్‌చుక్ 'రైలు'.. పట్టాలెక్కలేదు..!

విశాఖపట్నం: విశాఖ రైల్వేస్టేషన్ అభివృద్ధి మళ్లీ మొదటికి వచ్చింది. అమృత్ భారత్ పథకానికి ఎంపిక చేసిన స్టేషన్లలో ఒక్క విశాఖలో తప్ప మిగిలిన చోట్ల వేగంగా పనులు జరుగుతున్నాయి. పక్కనే ఉన్న భువనేశ్వర్ స్టేషన్‌ను నవీకరించారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో యుద్ధప్రాతిపాదికన పనులు చేస్తున్నారు. ఇక్కడ మాత్రం అడుగు కూడా ముందుకు పడలేదు. అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమనే విమర్శలు వస్తున్నాయి.
**మూడేళ్ల కిందట టెండర్లు :** విశాఖ రైల్వేస్టేషన్ నవీకరణకు 2022లో రైలు ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్ఎల్‌డీఏ) రూ.450 కోట్లతో బిడ్లు ఆహ్వానించింది. సేషన్‌లో ఎనిమిది ప్లాట్‌ఫారాల విస్తరణ, బహుళ అంతస్తుల కార్ల పార్కింగ్ సముదాయం తదితర వసతులు అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.
మూడేళ్లలో పనులు పూర్తి చేయాలని గుత్తేదారుకు నిబంధన పెట్టారు. పునాదులు నిర్మించిన తర్వాత గుత్తేదారు ఒక్కసారిగా అడ్డం తిరిగారు. మూడేళ్లలో పనులు చేయలేనని చేతులెత్తేశారు. నిధులు సరిపోవని పెంచాలని రైల్వే అధికారులను కోరారు. దీనికి రైల్వే అధికారులు అభ్యంతరం తెలపడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. ఫలితంగా ఇప్పటికే పూర్తవ్వాల్సిన ప్రాజెక్టు ప్రారంభానికే నోచుకోలేదు.
**పనుల ప్రారంభంపై స్పష్టత ఏదీ?:** పనులు నిలిచిపోవడంతో రైల్వేశాఖ కొత్తగా టెండర్లు పిలిచింది. దీనిపై పాత గుత్తేదారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రైల్వేకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇవ్వడంతో టెండర్ల ప్రక్రియ ముందుకు సాగింది. కొత్త గుత్తేదారును ఎంపిక చేశారు. అయినా పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో స్పష్టత లేదు. స్టేషన్ పునరాభివృద్ధి పనులకు సంబంధించి పాత డీపీఆర్‌లో కొన్ని



మార్పులుచేర్పులు చేసి మళ్లీ కొత్తగా తయారు చేసి రైల్వేబోర్డు ఆమోదానికి పంపించారు.
**ప్లాట్‌ఫారాల సంఖ్య పెంచేలా ప్రతిపాదన..:** పాత డీపీఆర్‌లో కొత్తగా రెండు ప్లాట్‌ఫారాలు నిర్మించాలని ప్రతిపాదించారు. కొత్త దాంట్లో నాలుగు నుంచి ఆరు ప్లాట్‌ఫారాలు నిర్మించాలని ప్రతిపాదించినట్లు సమాచారం. అలాగే ప్రస్తుతమున్న వాటిని వెడల్పు చేసి పురుద్ధరించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇవేకాకుండా కోచింగ్ యార్డును నవీకరించనున్నారు. స్టేషన్ నవీకరణ పనులకు సంబంధించి రైల్వే అధికారులు పారదర్శకత పాటించడం లేదు. దీనిపై కూర్మన్నపాలేనికి చెందిన కె.ఈశ్వర్ ఆర్‌టీఐ కింద సమాచారం కోరారు. ఇంజినీరింగ్ ప్రణాళికలు కొనసాగుతున్నాయి, వాటికి ఎంత ఖర్చవుతుందో అంచనాలు తయారు చేస్తున్నట్లు రైల్వే అధికారులు సమాధానం ఇచ్చారు. గతంలో ఒకసారి అడిగితే దాదాపు ఇదే సమాధానం ఇవ్వడం గమనార్హం.

# ఒక్కరొస్తే ఒట్టు!

నర్సీపట్నం : గతేడాది విద్యా సంవత్సరం ముగిసే నాటికి వేములపూడిలోని సమీకృత సంక్షేమ వసతి గృహంలో 293 మంది విద్యార్థులున్నారు. వేసవి సెలవులు ముగియడంతో నాలుగు రోజుల కిందట నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ఈ వసతిగృహాన్ని ఆదివారం ఉదయం సందర్శించగా సిబ్బంది నలుగురు ఉండగా.. విద్యార్థులు ఒక్కరూ లేరు. ఎవరైనా వస్తారేమోనని సిబ్బంది ఎదురుచూస్తూ కనిపించారు. ఇదొక్కటే కాదు. నర్సీపట్నం సహా చుట్టుపక్కల మండలాల్లోని అన్ని ఎస్సీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లోనూ ఇదే పరిస్థితి. నూతన విద్యా సంవత్సరంతోపాటు ఈ నెల 12న సంక్షేమ వసతిగృహాలు తెరచుకున్నాయి. విద్యార్థులకు వసతిగృహాలకు చేరుకుని పాఠశాలల్లో ప్రభుత్వం అందజేసే పుస్తకాలు, విద్యా సామగ్రి తీసుకోవాల్సి ఉంది. రోజుల తరబడి హాజరు కాకపోతే చదువులో వెనకపడతారు. సమీప గ్రామాల్లోని వారైనా రాకపోవడంతో సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తున్నారు. కొందరైతే నేరుగా ఇళ్లకు వెళ్లి వసతిగృహాలకు పంపాలని కోరుతున్నారు.
నర్సీపట్నం ప్రాంతంలోని ఎస్సీ, బీసీ వసతిగృహాల్లో చాలామంది అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన విద్యార్థులున్నారు. దూరప్రాంతాలకు చెందిన వారంతా నాలుగు రోజులు ఆగి వెళ్దాంలే అని మిన్నకుండిపోతున్నారు. పాఠశాలలకు



గైర్హాజరయ్యే హాస్టల్ విద్యార్థులను గుర్తించి ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారం ఇస్తే త్వరగా వచ్చే అవకాశం ఉంటుంది.
విద్యార్థులు హాస్టళ్లకు రాకపోవడాన్ని బీసీ, ఎస్సీ వసతిగృహాల సహాయ సంచాలకులు గోపినాథరావు దృష్టికి తీసుకువెళ్లగా.. ఈ నెల 11 నాటికే అందరూ రావాలని విద్యా సంవత్సరం ముగింపు రోజునే విద్యార్థులకు చెప్పినట్లు పేర్కొన్నారు. పాఠశాలలు తెరిచిన మరుసటి రోజే రెండో శనివారం, ఆదివారం రావడంతో సోమవారం నుంచి హాస్టల్‌కు వస్తామని విద్యార్థులు సంక్షేమాధికారులు, సిబ్బందికి సమాచారం ఇచ్చారన్నారు. హాజరు శాతం పెరుగుతుందని పేర్కొన్నారు.
సాంఘిక సంక్షేమ శాఖ నర్సీపట్నం సహాయ సంచాలకుల పరిధిలోని 11 వసతిగృహాల్లో 1500 మంది, 12 బీసీ సంక్షేమ వసతిగృహాల్లో 750 మంది విద్యార్థులు నమోదై ఉన్నారు. గతంలో వసతి గృహాలకు విద్యార్థులు రోజుల తరబడి రాకపోయినా హాజరైనట్లు చూపేవారు. ఇప్పుడు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేశారు. దీంతో ఎంతమంది హాజరవుతున్నారో స్పష్టంగా తెలిసిపోతోంది.

# సిండికేటా.. మజాకా..!

చిత్తూరు : అంతా మా ఇష్టం.. మేం చెప్పిందే ధర.. మేము కొనిందే కాయ.. ఎవరి మాట వినాల్సిన అవసరం లేదు.. ఇదీ జిల్లాలోని మామిడి గుజ్జు పరిశ్రమల సిండికేట్ వ్యవహారం. సిండికేట్ దెబ్బకు మామిడి రైతులకు కన్నీళ్లు తప్పడం లేదు. తోతాపురి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి.. సర్వశక్తులూ ఒడ్డినప్పటికీ ఫలితం కానరాలేదు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు గుడిపాల మండలంలో గుజ్జు పరిశ్రమ పరిశీలించి టన్నుకు రూ.8 వేలు చెల్లించాలని ఆదేశించినా యజమాన్యంలో మార్పు రాలేదు. సదరు పరిశ్రమలోనే టన్నుపై రూ.2 వేలు తగ్గించి రూ.6 వేలకే కొనుగోలు చేస్తున్నారంటే పరిశ్రమల సిండికేట్ ఎంత గట్టిగా ఉందో అర్థమవుతోంది. మంత్రి ఆదేశాలను పరిశ్రమలు బేఖాతరు చేయడంతో రైతుల ఆశలు అడియాసలవుతున్నాయి.
**అప్రమత్తమైనా ఫలితమేదీ..?:** తోతాపురి ధరలు ఈ ఏడాది గణనీయంగా తగ్గుతాయని భావించి ప్రభుత్వం ముందస్తుగానే చర్యలు చేపట్టింది. టన్నుకు రూ.4 వేలు అదనంగా ఇస్తామని, యాజమాన్యాలు రూ.8 వేలకు కొనాలని స్పష్టం చేసినా అవి అమలు చేయలేదు.



**అధికార యంత్రాంగం వైఫల్యం:** మద్దతు ధర అమలులో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. పరిశ్రమలపై చర్యలు కరవయ్యాయి. ఆదివారం గుజ్జు పరిశ్రమలు రూ.5-6వేలకు కొనుగోలు చేయగా ర్యాంపుల నిర్వాహకులు రూ.3,500 నుంచి రూ.4 వేలు చెల్లించారు.
పత్తాలేని అధికారులు..: జిల్లాలో 30 ర్యాంపులకు అనుమతులు ఇచ్చారు. వీటిలో 12 చోట్ల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇక్కడ అధికారులను నియమించకపోవడంతో.. రైతుల నుంచి ఎంత కొనుగోలు చేశారు..? ఎంత తరలించారు..? వంటి వివరాల్లేవు.
**అప్పుడు నష్టం రాలేదా..? :** నాలుగైదేళ్ల క్రితం తోతాపురి కాయలు టన్ను రూ.50-60 వేలకు పరిశ్రమలు కొనుగోలు చేశాయి. అప్పుడు నష్టం రాలేదు. ప్రస్తుతం రూ.8 వేలకు కొనడానికి నిరాకరించడాన్ని రైతులు తప్పుబడుతున్నారు.
**రైతుల పడిగాపులు**
మామిడి దిగుబడులు అమ్ముకోవడానికి అన్నదాతలు గుజ్జు పరిశ్రమల వద్ద పడిగాపులు కాస్తున్నారు కాయలు దింపుకోవడానికి స్థలం లేదని రెండ్రోజుల తర్వాత అనుమతి ఇస్తామని చెప్పడంతో రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. సకాలంలో కాయలు కోయాలంటే జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో గుజ్జు తయారీ చేపట్టాలి. మొగిలి, మొగిలి వెంకటగిరి వద్ద ఉన్న పరిశ్రమల్లో గుజ్జు తయారీ ఇప్పటివరకు మొదలు పెట్టనే లేదు.ర్యాంపుల ధరల బోర్డు పెట్టాలని రైతులు కోరుతున్నారు.
**సీఎం స్పందించి ఆదుకోవాలి:** మా తోటలో 100-120 టన్నుల తోతాపురి మామిడి కాయలు ఉన్నాయి. పరిశ్రమలు రూ.5-6వేలకే కొనుగోలు చేస్తున్నాయి. సీఎం చంద్రబాబు తక్షణమే స్పందించి తోతాపురి మామిడి రైతులకు న్యాయం చేయాలి. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు జిల్లాలో పర్యటించినా రైతులకు నిరాశే తప్ప ప్రయోజనం లేదు. గుజ్జు పరిశ్రమలు, ర్యాంపుల యాజమాన్యాలు సిండికేట్‌గా ఏర్పడి ధరలు తగ్గించేస్తున్నాయి. మునీశ్వరరెడ్డి, జిల్లేడుపల్లె, బంగారుపాళ్యం మండలం

చురకలు



# అదిదా సర్ప్రైజ్ సాంగ్ కాంట్రవర్సీ.. కేతికా ఏం చెప్పిందంటే..

నితిన్, శ్రీలీల జంటగా నటించిన 'రాబిన్‌హుడ్' సినిమా ఇటీవల విడుదలై ఫ్లాప్ టాక్ ను అందుకున్న విషయం తెలిసిందే. వెంకీ కుదుముల దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంలో కేతికా శర్మ 'అదిదా సర్ప్రైజ్' అనే స్పెషల్ సాంగ్‌లో కనిపించింది. ఈ సాంగ్‌లో ఆమె డ్యాన్స్ సినిమాకు మంచి హైప్ తీసుకొచ్చినప్పటికీ, ఆ సాంగ్‌లోని కొన్ని డాన్స్ స్టెప్స్ వివాదాస్పదంగా మారాయి. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేసిన ఈ పాటకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించగా, నీతి మోహన్, అనురాగ్ కులకర్ణి గాత్రం అందించారు. ఈ సాంగ్‌లోని కొన్ని స్టెప్స్ అసభ్యకరంగా ఉన్నాయని, మహిళలను అవమానకరంగా చూపించాయని నెటిజన్లు, మహిళా సంఘాలు తీవ్రంగా విమర్శించాయి. ఈ వివాదం తెలంగాణ మహిళా కమిషన్ దృష్టికి వెళ్లడంతో, సుమోటోగా కేసు నమోదు చేసి, సినిమా టీంకు నోటీసులు జారీ చేసింది. దీంతో నిర్మాతలు థియేటర్



వెర్షన్‌లో ఆ వివాదాస్పద స్టెప్స్‌ను తొలగించారు. తర్వాత యూట్యూబ్‌లో విడుదలైన లిరికల్ వీడియోలోనూ ఆ స్టెప్స్‌ను కత్తిరించారు. ఈ వివాదం సినిమాకు ఊహించని పబ్లిసిటీ తెచ్చినప్పటికీ, రాబిన్‌హుడ్ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ఈ వివాదంపై కేతికా శర్మ స్పందిస్తూ, తాను డైరెక్టర్ సూచనల మేరకే నటించానని వివరణ ఇచ్చింది. "నేను డైరెక్టర్ చెప్పినట్లు చేశాను. నేను డైరెక్టర్స్ యాక్టర్‌ని, కంప్లీట్‌గా సరెండర్ అవుతాను. వారు చెప్పిన ప్రాసెస్‌ను ఫాలో అవుతాను, అంతకు మించి నేను ఆలోచించలేదు," అని అన్నారు. సినిమా అనేది ఆడియన్స్ కోసం తయారుచేసే ప్రోడక్ట్ అని, నచ్చితే ఎంజాయ్ చేస్తారు, లేకపోతే రిజెక్ట్ చేస్తారని, ఈ వివాదం, సాంగ్‌కు వచ్చిన మిశ్రమ స్పందనపై తనకు అవగాహన ఉందని చెప్పింది. ఈ సాంగ్ కొరియోగ్రఫీపై నెటిజన్లు, మహిళా సంఘాల నుంచి వచ్చిన విమర్శలు ఇండస్ట్రీలో మరోసారి బాధ్యతాయుతమైన చిత్ర నిర్మాణంపై చర్చకు దారితీశాయి. ఐటెం సాంగ్స్‌లో గ్లామర్ డోస్ పెంచడం, అసభ్యకర స్టెప్స్‌ను చూపించడం వంటివి విమర్శలకు కారణమవుతున్నాయి. ఇటీవల 'డాకు మహారాజ్' సినిమాలోని 'డబిడి డిబిడి' సాంగ్ కూడా ఇలాంటి విమర్శలను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. 'రాబిన్‌హుడ్' టీం మాత్రం విమర్శలను సీరియస్‌గా తీసుకుని, వివాదాస్పద స్టెప్స్‌ను తొలగించడం గమనార్హం.

## ట్రాలాలా సీక్రెట్ చెప్పేసిన సమంత!

హీరోయిన్ సమంత ట్రాలాలా మూవీంగ్ పిక్చర్స్ పేరుతో నిర్మాణ సంస్థ స్థాపించిన సంగతి తెలిసిందే. తొలి ప్రయత్నం గా శుభం అనే చిత్రాన్ని నిర్మిస్తుంది. కొత్త నటీనటుల్ని పరిచయం చేస్తూ సమంత నిర్మించిన చిత్రమిది. ఇందులో సామ్ ఓ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ట్రాలాలా నిర్మాణ సంస్థ పేరు రొటీన్ కు భిన్నంగా ఉండటంతో? దీని అర్ధం ఏంటనే విషయాన్ని సమంత తొలిసారి రివీల్ చేసింది. సమంత చిన్నప్పుడు బ్రౌన్ గర్ల్ ఇన్ ది రెయిన్ ట్రాలాలా%-% అంటూ ఓ పద్యం ఎక్కువగా పాడేదట. సడెన్ గా ట్రాలాలా అనే పేరు గుర్తొచ్చే అదే పేరుతో నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసాను తప్ప అంతకు మించి మరే లాజిక్ లేదంది. తన సంస్థ ద్వారా కొత్త వాళ్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే సంస్థను స్థాపించినట్లు తెలిపింది. ఎంతో మంది ప్రతిభావంతులున్నా సరైన



అవకాశాలు రాక పరిశ్రమకు రాలేకపోతున్నారు. అలాంటి వాళ్లకు ట్రాలాలా మంచి వేదిక అవ్వాలి. ప్రతిభావంతుల్ని పైకి తీసుకురావాలి. తాను కూడా ఎలాంటి సినీ బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చానని...సీనియర్లే కావాలనుకుంటే గౌతమ్ మీనన్ ఏమాయ చేసావేలో వాళ్లనే తీసుకుని చేసేవారు. కానీ నాకు ఆయన అవకాశం కల్పించారు కాబట్టే నేడు ఈ స్థానంలో ఉన్నానంది. ఈ సినిమాలో నటీనటుల్ని చూస్తుంటే తనకు పాత రోజులు గుర్తొచ్చాయంది. ప్రతిభా వంతులకు సరైన అవకాశాలు వస్తే అద్భుతాలు సృష్టించాగలరని ధీమా వ్యక్తం చేసింది. ట్రాలాలాకి సాధారణ పేరులు కంటే ట్రాలాలా అన్నది డిఫరెంట్ గా ఉండటంతోనే పెట్టానంది. శుభం కథ అంతా ధారావాహికతో ముడి పడి ఉంటుంది. సీరియల్స్ కి శుభం కార్డు ఎప్పుడు పడుతుందని అంతా ఎదురు చూస్తుంటారు. ఈ సినిమా కథకి..ధారావాహికకి సంబంధం ఏంటన్నది సినిమా చూస్తే తెలుస్తుందని తెలిపింది.




# నాగినీతో మెగాస్టార్ రగులుతోంది మొగలిపొద!






విశ్వంభరలో బాలీవుడ్ నటి మౌనీరాయ్ అలియాస్ నాగినీ ఐటం పాటతో టాలీవుడ్ కి ఎంట్రీ ఇస్తోన్న సంగతి తెలిసిందే. అమ్మడు తెలుగు లోగిళ్లలోనూ నాగినీగా ఎంతో ఫేమస్. నాగిని గురించి ప్రత్యేక పరిచ యం అవసరం లేని పేరు. హిందీ డబ్బింగ్ సీరియళ్లతో తెలుగు ఆడియన్స్ కు రీచ్ అయింది. బాలీవుడ్ లోకొన్ని సినిమాలు కూడా చేసింది. దీంతో విశ్వంభర చిత్రంలో ఐటం భామగా దర్శకుడు మౌనీరాయ్ ని ఎంపిక చేసాడు. మరి మౌనీ రాయ్ ని ఎంపిక చేయడాకి ఇంకా బలమైన కారణాలు ఏవైనా ఉన్నాయా? అంటే కేవలం ఐటం పాట కోసమే కాదు. కథ కూడా ఆమె పెర్ఫార్మర్ ని డిమాండ్ చేయడంతోనే ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

ఈ సినిమా ఒక సోషియా ఫాంటసీ థ్రిల్లర్. యుముడికి మొగుడు, అంజి లాంటి చిత్రాల తర్వాత నటి స్తోన్న సోషియా ఫాంటసీ థ్రిల్లర్ ఇది. ఇందులోనూ అతీంద్రీయ శక్తులు హైలైట్ అవుతున్నాయి. ఈ క్రమంలో నాగ లోకంలో నాగినీగా మౌనీ రాయ్ కనిపించనుందిట. ఆ సందర్భంలో ఈ పాట వస్తుందిట. దీన్ని ఐటం పాటగా చెప్పడం కంటే సన్నివేశంలో భాగంగా వచ్చే పాటనే ఐటం పాటగా ప్రొజెక్ట్ చేస్తున్నట్లు తెలిసింది. ఇందులో చిరంజీవి కూడా నాగరాజ స్టెప్పులు అందుకుంటారని సమాచారం. చిరంజీవి నటించిన ఖైదీ సినిమాలో రగులుతుంది మొగలి పొద ఎప్పటికీ ఓ క్లాసిక్ ఐకానిక్ సాంగ్. అందులో చిరు-రాధల నాగ లోకం డాన్సు ఎంతో అద్భుతంగా ఉంటుంది. అందులో కొన్ని స్టెప్పులను కూడా విశ్వంభరలో ఐటం పాట కోసం రీక్రియేట్ చేస్తున్నారుట.

మొత్తానికిది మెగా అభిమానులకు కిక్ ఇచ్చే అంశమే. రగులుతుంది మొగలి పొద పాటలో చిరంజీవి-రాధ మధ్య కెమిస్ట్రీ నెక్ట్స్ లెవల్లో ఉంటుంది. ఇద్దరు గొప్ప డాన్సర్లు కావడంతో అంత గొప్ప ఔట్ పుట్ వచ్చింది. మరి తాజా నాగినీ సాంగ్ ఆ రేంజ్ లో ఉంటుందా? అన్నది చూడాలి. ఈ పాట కోసమే భీమ్స్ స్పెషల్ గా రంగంలోకి దించిన సంగతి తెలిసిందే.

# కాంతార2 ను వదలని ప్రమాదాలు...



కన్నడ సినీ ఇండస్ట్రీలో విషాదం చోటు చేసుకుంది. కన్నడ స్టార్ హీరో రిషబ్ శెట్టి హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న కాంతార2 షూటింగ్ లో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో జూనియర్ ఆర్టిస్ట్ కపిల్ ప్రమాదవశత్తూ నదిలో నీట మునిగి ప్రాణాలు కోల్పోయి మరణించాడు. ఈ ఘటన ఉడిపి జిల్లా బైందూరులోని కొల్లూరులో జరిగింది. కపిల్ షూటింగ్ పూర్తయ్యాక తన టీమ్ తో కలిసి కొల్లూరులోని సౌపర్ణిక నదిలో ఈత కొట్టేందుకు వెళ్లగా, అక్కడ నీటి లోతు తెలియక నదిలో మునిగి చనిపోయాడని సమాచారం.

జూనియర్ ఆర్టిస్ట్ కపిల్ మరణంతో చిత్ర యూనిట్ తీవ్ర విషాదంలో ఉంది. కొల్లూరు పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాంతారా2 షూటింగ్ మొదలైనప్పటి నుంచి ఆ సినిమాను వరుసపెట్టి ప్రమాదాలు వెంటాడుతూనే ఉన్నాయి. కొన్నాళ్ల కిందట కొల్లూరులోనే జూనియర్ ఆర్టిస్టులతో వెళ్తున్న బస్ సడెన్ గా బోల్తా పడింది. ఆ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోయినా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ తర్వాత గాలి వాన వల్ల రావడం వల్ల భారీ సెట్ కూలిపోయింది. సెట్ కూలినప్పుడు కూడా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. కానీ ఇప్పుడు ఈ తాజా ప్రమాదంలో ఒక జూనియర్ ఆర్టిస్ట్ ఏకంగా ప్రాణాలను కోల్పోయాడు. దీంతో అసలిలా ఎందుకు జరుగుతుందని కాంతార2 చిత్ర యూనిట్ అయోమయంలో పడింది. అయితే కపిల్ మరణం విషయంలో మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతానికైతే అతను కేరళకు చెందిన వ్యక్తి అనే సమాచారం మాత్రమే ఉంది. ఇక సినిమా విషయానికొస్తే కాంతార సినిమా బాక్సాఫీస్ వద్ద ఎన్ని సంచలనాలు సృష్టించిందో కొత్తగా చెప్పనక్కర్లేదు. కన్నడలో రిలీజైన ఈ సినిమా రికార్డుస్థాయి కలెక్షన్లను సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. మొదటి పార్ట్ మంచి హిట్ గా నిలవడంతో రెండో పార్ట్ ను కాంతార: చాప్టర్1 పేరుతో తెరకెక్కిస్తున్నారు. 2022లో వచ్చిన కాంతార సినిమాకు ఇది ప్రీక్వెల్ గా తెరకెక్కుతుంది. అక్టోబర్2, 2025న కాంతార: చాప్టర్1 రిలీజ్ కానుంది. ఈ సినిమాపై అందరికీ భారీ అంచనాలున్నాయి.

# వింబుల్డన్ 2025 షో స్టాపర్ జాన్వీ కపూర్

తనదైన అందం, ప్రతిభతో భారీగా ఫాలోయింగ్ పెంచుకుంది జాన్వీ కపూర్. ప్రస్తుతం కథానాయికగా కెరీర్ పరంగా ఫుల్ బిజీగా ఉన్న ఈ నటవారసురలు, సోషల్ మీడియాల్లోను స్పీడ్ గానే ఉంది. అభిమానులకు ఇన్ స్టా వేదికగా నిరంతరం అప్ డేట్స్ ని అందిస్తూనే ఉంది. తాజాగా ఈ బ్యూటీ లండన్ లో జరుగుతున్న వింబుల్డన్- 2025 సెమీ ఫైనల్ మ్యాచ్ లో ప్రత్యక్షమైంది. ప్రియుడు శిఖర్ పహారియాతో కలిసి జాన్వీ మెరుపులు మెరిపించింది. ముఖ్యంగా జాన్వీ కపూర్ ధరించిన స్పెషల్ డిజైనర్ డ్రెస్ పైనే యువతరం ఫోకస్ చేసింది. జాన్వీ ఎంపిక చేసుకున్న యాక్సెసరీస్, ఆభరణాలు, దుస్తుల



గురించి యూత్ ఆరాలు తీసారు. ఇది స్పెషల్ గా డిజైన్ చేసిన మిడీ డ్రెస్.. జాన్వీ టోన్డ్ సొగసుల్ని ఆవిష్కరిస్తున్న ఈ ప్రత్యేకమైన మిడీ డ్రెస్ రొటీన్ పొట్టి మిడీ కంటే భిన్నమైన ఎంపిక. దీని ఖరీదు సుమారు రూ.3.9 లక్షలు అని లెక్కలు తీస్తున్నారు. ఇక ఎంపిక చేసుకున్న లాంగ్ మిడీకి తగ్గట్టుగానే కళ్లకు గ్లాసెస్ ని జోడించింది జాన్వీ. ఫ్రీస్టయిల్ లో ఈ లుక్ సంథింగ్ స్పెషల్‌గా ఎలివేట్ అయిందనే చెప్పాలి. జాన్వీ ట్రెడిషనల్ దుస్తుల్లోను టూ హాలి గా ఉందంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. కెరీర్ పరంగా చూస్తే.. జాన్వీ ప్రస్తుతం రామ్ చరణ్ సరసన పెద్ది చిత్రంలో నటిస్తోంది. ఉప్పెన ఫేం బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్నారు.

## సింపుల్ లుక్ తో కిల్ చేసిన శ్రద్ధా

బికినీలు స్విమ్ సూట్లు అవసరమే లేదు. ప్రతిసారీ గ్లామర్ షోతో కుర్రకారును టీజ్ చేయాల్సిన పని లేదు. ఈ భామ అలా సింపుల్ గా రొటీన్ డ్రెస్ లో ఒక్క ఫోటోగ్రాఫ్ వదిలితే చాలు. దానికి కోట్లాదిగా ఉన్న ఫాలోవర్స్ గగ్గోలు పెడతారు. అలాంటి గొప్ప ఫ్యాషన్ సెన్స్ శ్రద్ధా కపూర్ కి ఉంది. ఈ బ్యూటీ వరుస ఫోటోషూట్లు ఇంటర్నెట్ లో వైరల్ అవుతున్నాయి. తాజాగా శ్రద్ధా షేర్ చేసిన ఓ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. దీనిలో మెరూన్ కలర్ టీషర్ట్





ధరించిన శ్రద్ధా షార్ట్ హెయిర్ స్టైల్ తో కొంత ట్రెండీగా కనిపిస్తోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే శ్రద్ధా నటించిన స్త్రీ 2 సంచలన విజయంస ఆధించాక, అందరి దృష్టి స్త్రీ 3 పై ఉంది. తాజా ఇంటర్వ్యూలో రాజ్ కుమార్ రావు మాట్లాడుతూ కథ, స్క్రిప్టు రెడీగా ఉంటే తాము కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ చిత్రం 2018 చిత్రం స్త్రీకి సీక్వెల్ . మాడాక్ ఫిల్మ్ హర్రర్-కామెడీ విశ్వంలో భాగం. ఇందులో రాజ్ కుమార్ రావు, శ్రద్ధ కూడా ప్రధాన పాత్రల్లో నటించారు. స్త్రీ 3లోను ఈ కాంబినేషన్ రిపీటవుతుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536